2-3 వారాల్లో పెట్రోల్ ధర రూ.10 పెంపు!



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 17 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 131 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**11 గంటలకు ఎప్‌సెట్ రిజల్టు**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ప్రవేశ పరీక్ష (ఎప్ సెట్-2026) ఫలితాలు ఆదివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. విద్యార్థులు తమ రిజల్టును https://eapcet.tgche.ac.in/ ద్వారా తెలుసుకోవచ్చు.

# యూఏఈతో పలు ఒప్పందాలు



### 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సమ్మతి

### ఆ దేశాధ్యక్షుడు నహ్యాన్‌తో ప్రధాని మోడీ భేటీ

అబుధాబి, మే 16 : ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన స్వల్పకాలిక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటన భారత్‌కు దీర్ఘకాలిక ప్రయోజనాలు తెచ్చిపెట్టింది. శుక్రవారం ప్రధాని ఆ దేశ పర్యటన సందర్భంగా ఇరు దేశాలు ఇంధన భద్రత, ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరా, రక్షణ సహకారం, వాణిజ్యాలకు సంబంధించి ఒప్పందాలపై తాజాగా సంతకాలు చేశాయి. పర్యటనలో భాగంగా మోడీ యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తో అబుధాబీలో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చలు జరిపారు. భారత్ కు ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరాతో పాటు వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలపై ఒప్పందాలు కుదిరాయి. వీటిలో భాగంగా భారత వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వుల్లో యూఏఈ భాగస్వామ్యం

## మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాను

నెదర్లాండ్‌లో ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించిన మోడీ

హేగ్ నగరంలో ప్రవాసీలతో ప్రధాని మాటామంతీ

2

మరోసారి భాషా పంచాతి..

# మూడు భాషలు నేర్చుకోవాల్సిందే

**జులై నుంచే త్రిభాషా విధానం అమలుకు సీబీఎస్ఈ ఉత్తర్వులు**

ఢిల్లీ, మే 16 : దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో విప్లవాత్మక మార్పు అమలులోకి తేనున్నది. జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు మూడు భాషల విధానాన్ని తప్పనిసరి చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్(ఎన్‌సీఎఫ్ఎస్ఈ 2023) సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది.సీబీఎస్ఈ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. ఆ మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు ఉండాలి. మూడు భాషలను

...మిగతా 2లో

నేడు హై కమాండ్‌తో హై లెవల్ డిస్కషన్

# మంత్రి వర్గ విస్తరణపై నిర్ణయం!



## సర్, తాజా రాజకీయ పరిణామాలపై ఫోకస్

### ఢిల్లీలో హైకోర్టు సీజే కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్

హైదరాబాద్, (మనం బ్యూరో) : ప్రశంసల సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేషన్ కుమార్ సింగ్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరయ్యారు. ఆదివారం సీఎం కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కానున్నారు. ఇటీవల కేరళం రాష్ట్రానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. ఆ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతో యూడీఎఫ్ విజయంలో సీఎం సైతం కీలక పాత్ర పోషించారనే ప్రశంసలు అధిష్టానం పెద్దల నుంచి వెల్లువెత్తాయి. ఈ అంశం కూడా సీఎంతో కాంగ్రెస్ పెద్దల భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, గత కొంత కాలంగా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే

...మిగతా 2లో

## పెట్రో ధరల పెంపుతో సామాన్యునిపై భారం

ఇది మోడీ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం : సీఎం

2

ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర వాటా నిధులు ఇవ్వకపోతే..

# మేమే భరిస్తాం



### జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

### ఈనెల చివరిలోగా భూముల ధరల సవరణ

### మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 16, (మనం బ్యూరో) : ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రావాల్సిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురు చూస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు రూ.లక్షా 13 వేల రూపాయల వాటా విడుదల కావాల్సి ఉందనీ, కేంద్రం నిధులు వస్తాయన్న నమ్మకంతో లబ్దిదారులకు ఫైనల్ బిల్లులను ఆపడం జరిగిందని తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి చిట్‌చాట్ నిర్వహించారు. కేంద్రం విడుదల చేయాల్సిన నిధుల కోసం సీఎం రేవంత్ రెడ్డితో పాటు తాను కూడా సంబంధిత శాఖ మంత్రిని కలవడం జరిగిందన్నారు. ఆ నిధుల కోసం ప్రయత్నిస్తూనే

...మిగతా 2లో

## అసలు సిసలు మహిళా బ్యాంకు స్త్రీనిధి

మహిళల ఆర్థిక స్వావలంబనకు అదొక బలమైన వేదిక : మంత్రి సీతక్క

3

## వెండి దిగుమతులపై నిషేధం

ఢిల్లీ, మే 16 : బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని ఇటీవలే కేంద్రప్రభుత్వం 15 శాతానికి పెంచి షాకిచ్చింది. దాని నుంచి తేరుకునేలోపే.. కొనుగోలుదారులకు మరో పిడుగులాంటి వార్త చెప్పింది. పశ్చిమాసియాలో

...మిగతా 2లో

## 2027 డిసెంబర్ నాటికి దేవాదుల పూర్తి

### 38.16 టీఎంసీలతో 10 జిల్లాల్లోని 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు

### ఇప్పటికే రూ.14422 కోట్లతో 87 శాతం పనులు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, మే 16 (మనం బ్యూరో) : 2027 డిసెంబర్ నాటికి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం రూ.14422 కోట్లతో 87.70 శాతం పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2004-05లో అప్పటి సీఎం

...మిగతా 2లో



# 'సర్' పై అనుమానాలొద్దు

**అనర్హులు ఓటరు జాబితాలో లేకుండా చూడటమే లక్ష్యం**

**బీఎల్‌వోలు ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తరు**

**అక్టోబరు 1న తుది జాబితా ప్రకటిస్తం : సీఈసీ సుదర్శన్ రెడ్డి**




హైదరాబాద్, మే 16 (మనం బ్యూరో) : అనర్హులు ఓటర్ జాబితాలో లేకుండా చూడటమే 'సర్'లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియపై ఎలాంటి అనుమానాలు వద్దనీ, నిజమైన ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శనివారం బీఆర్కే భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి రాష్ట్రంలో ఓటర్ల జాబితా సర్ ప్రక్రియ మొదలవుతుందని వెల్లడించారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేస్తామన్నారు. ''బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారు. ప్రతీ ఓటరుకు రెండు ఫామ్‌లు అందుతాయి. ఒకటి పూర్తి చేసి బీఎల్వోకు ఇవ్వాలి. ఇంకో ఫామ్‌ను ఓటరు దగ్గరే

...మిగతా 2లో

# అరెస్టా?.. అప్పగింతా?

## పోలీస్ స్టేషన్‌కు చేరిన 'బండి' పరార్ కథ



**నార్సింగ్‌లో అరెస్ట్ చేశామంటున్న సీపీ**

**లేదు.. తామే అప్పగించామన్న బండి సంజయ్**

**కేంద్ర మంత్రి.. సీపీ భిన్న ప్రకటనలు**

**భగీరథ్ అరెస్ట్....వైద్య పరీక్షలు..రిమాండ్**

హైదరాబాద్,మే 16(మనం,ప్రత్యేక ప్రతినిధి) : మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ లభించకపోవడంతో ఉక్కిరిబిక్కిరైన బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు? లేక పోలీసులే లొంగదీశారా అన్నది చర్చనీయాంశమైంది.

...మిగతా 2లో

## న్యాయ వ్యవస్థపై నమ్మకముంది

### చట్టంపై గౌరవంతోనే భగీరథ్‌ను అప్పగించా

### కీలక ఆధారాల కోసమే సరెండర్‌లో జాప్యం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

2

## చైనా దెబ్బకు.. ట్రంప్ అబ్బా..!!

### వారి స్వాతంత్ర్యం కోసం మేం పోరాడబోం

### తైవాన్ అంశంలో మాట ఫిరాయించిన ట్రంప్

బీజింగ్, మే 16 : తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట మార్చారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. 'తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉండగా, అమెరికాకు మాత్రం 15 వేల కి.మీ.కు పైగా దూరాన ఉంది. ఎక్కువ దూరం కావడంతో మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం

...మిగతా 2లో



## ట్రంపయ్య పొయ్యిండు.. వచ్చిండు

### ఒప్పందాలేమీ లేకుండానే చైనా నుంచి వెనుదిరిగిన అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, మే 16 : యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ట్రంప్ చైనా పర్యటన.. ఒప్పంద ప్రకటనలేవీ లేకుండానే ముగిసింది. కీలకాంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని, ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణలో కీలక పురోగతి సాధించామని చెప్పడానికి మాత్రమే అమెరికా, చైనా పరిమితమయ్యాయి. బోయింగ్ సంస్థ నుంచి 200 విమానాలను కొనుగోలు చేయడానికి బీజింగ్ సమ్మతించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించినా.. దానిపై అధికారిక ప్రకటన రాలేదు.

...మిగతా 2లో

## 'బండి' పదవికి ఉద్వాసన పలకండి

### కేంద్ర హోంశాఖ మంత్రి నుంచి తొలగించాలి

### ప్రధానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత లేఖ

3

## సబ్ స్టేషన్లలో సోలార్ ప్లాంట్లు

### 9 ఉమ్మడి జిల్లాల్లో 19 మెగావాట్ల సామర్థ్యంతో పైలట్ ప్రాజెక్ట్

### రూ. 66.50 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటుకు ఆదేశాలు

### 2030 నాటికి 20 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ లక్ష్యం

హైదరాబాద్, మే 16 : రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన, చౌకైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ సబ్‌స్టేషన్ లెవెల్ సోలారైజేషన్ ప్రాజెక్ట్ కింద పైలట్ ప్రాతిపదికన రాష్ట్రంలోని 9

...మిగతా 2లో

# 2-3 వారాల్లో పెట్రోల్ ధర రూ.10 పెంపు!

ఢిల్లీ, మే 16 : దేశవ్యాప్తంగా లీటరు పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంపు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే.భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదని, దీంతో రాబోయే రోజుల్లో ఇంధన ధరల పెంపు మరింత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశారు. చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడడానికి రూ.3 పెంపు చాలదని.. లీటర్ పెట్రోల్, డీజిల్ ధర రూ.10 వరకు పెరుగుతుందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ పెంపు ఒకేసారి గానీ లేదా 2-3 వారాల్లో దశలవారీగా గానీ ఉండొచ్చన్నారు.

**కేంద్రం చర్యలు :**

పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ, ఉద్రిక్తతలు.. నిరంతర సంక్షోభాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై సుంకం వసూలును తాత్కాలికంగా నిలిపివేసింది. అలాగే ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు కూడా తమ లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని సొంతంగా భరించాయి. ఈ విపత్కర పరిస్థితుల కారణంగా ఇంధన ధరలను రూ.3కి పెంచక తప్పలేదు. అయినప్పటికీ ఈ స్వల్ప పెరుగుదల కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప, పూర్తిగా తొలగించలేకపోయింది. ఈ నేపథ్యంలోనే పెట్రో రేట్లు భారీగా పెరిగే అవకాశముందని ఆర్థిక నిపుణుల అంచనా.

# చైనా దెబ్బకు.. ట్రంప్ అబ్బా..!!

(మొదటి పేజీ తరువాయి)

కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్లు సంయమనం పాటించాలి'' అని ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ అన్నారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంపునకు జిన్ పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో అమెరికా- చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్పా... ప్రత్యర్థులుగా కాదని జిన్ పింగ్ పేర్కొనడం గమనార్హం. తైవాన్ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా కోరుకుంటోంది.

తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. 'తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు' అని ఇంతకాలం అమెరికా స్పష్టంచేస్తూ వచ్చింది. దానికి భిన్నంగా ఇప్పుడు ట్రంప్ మాట్లాడుతున్నారు. తైవాన్ కు ఆయుధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడమూ ఆయన వైఖరిలో మార్పును స్పష్టం చేస్తోంది.

# ట్రంపయ్య పొయ్యిండు.. వచ్చిండు

(మొదటి పేజీ తరువాయి)

చైనా అధ్యక్షుడు షి జిన్పింగ్తో శిఖరాగ్ర చర్చల్లో పాల్గొనేందుకు ట్రంప్ బుధవారం బీజింగ్ కు వచ్చిన సంగతి తెలిసిందే. గురు, శుక్రవారాల్లో వీరిద్దరూ పలు దఫాలు సమావేశమై.. ఇరాన్ యుద్ధం, ద్వైపాక్షిక వాణిజ్యం సహా పలు అంశాలపై విస్తృత స్థాయిలో సమాలోచనలు జరిపారు.

**విభేదాలను పరిష్కరించుకున్నాం: ట్రంప్**

చైనాలో తన పర్యటనను 'అత్యంత విజయవంతమైనది'గా, 'మరుపురానిది'గా ట్రంప్ అభివర్ణించారు. అమెరికాకు తిరుగుప్రయాణంలో ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ''మేం చాలా విషయాలపై అంగీకారం కుదుర్చుకున్నాం. చాలా ఒప్పందాలు చేసుకున్నాం. విభేదాలను పరిష్కరించుకున్నాం'' అని వ్యాఖ్యానించారు. రాబోయే దశాబ్ద కాలంలో బోయింగ్ నుంచి 200 విమానాలను చైనా కొనుగోలు చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఈ మేరకు తన పర్యటనలో ఒప్పందం కుదిరిందన్నారు. ముందుముందు బోయింగ్ నుంచి మొత్తంగా 750 విమానాలను బీజింగ్ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే దీనిపై బోయింగ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను కొనేందుకూ చైనా సిద్ధమని జిన్ పింగ్ తనకు చెప్పినట్లు ట్రంప్ తెలిపారు.

జిన్ పింగ్ వ్యాఖ్య.. బైడెన్ హయాం గురించే..

అమెరికాను పతనావస్థలోని దేశంగా తన పర్యటనలో జిన్పింగ్ వ్యాఖ్యానించడంపై ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో స్పందించారు. ఆ మాటతో తాను 100% ఏకీభవిస్తున్నానని.. కానీ ఆయన చెప్పింది నిద్రమత్తులో ఉండే జో బైడెన్ హయాం గురించి అని పేర్కొన్నారు. బైడెన్ పాలనలో అమెరికాకు అపార నష్టం వాటిల్లిందన్నారు. తన పాలనలో మాత్రం దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు.

# మూడు భాషలు నేర్చుకోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేయాలి. ఇక పదో తరగతి విద్యార్థులకు ఒక ఊరట కల్పించింది. మూడో భాషకు బోర్డ్ ఎగ్జామ్ ఉండదని వెల్లడించింది. ఆ పాఠ్యాంశానికి పాఠశాలల్లో చూపే ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయిస్తారు.

జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్ఈపీ-2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం మాత్రం రాష్ట్రాలకే కట్టబెట్టింది.

**విదేశీ భాష నేర్చుకోవచ్చు..**

విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో భారతీయ భాషలు, ఆంగ్లంతోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలూ ఎంచుకోవచ్చని ఎన్ఈపీ-2020 చెబుతోంది. అధిక శాతం పాఠశాలల్లో భాషా మాధ్యమంగా ఉన్న ఇంగ్లీషును విదేశీ భాషగా పరిగణిస్తారు. అందుకే ఈ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను ఎంచుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగ నిర్దేశాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను సాధించేందుకే ఈ విధానమని ఎన్ఈపీ నిబంధనలు చెప్తున్నాయి.

# యూఏఈతో పలు ఒప్పందాలు

(మొదటి పేజీ తరువాయి)

3 కోట్ల బ్యారెళ్లకు పెరుగుతుంది. గుజరాత్లోని వడినార్ వద్ద ఒక నౌకా మరమ్మతుల పరిశ్రమ స్థాపించడానికి అంగీకారం కుదిరింది. భారత్ లో మౌలిక సదుపాయాల రంగంలో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ''పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. భారత్ ఎప్పుడూ చర్చలు, సంప్రదింపులకే ప్రాధాన్యమిస్తుంది. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ఎప్పుడూ తెరిచే ఉండాలి. యూఏఈపై ఇరాన్ దాడులు ఆమోదయోగ్యం కాదు'' అని మోడీ ఈ సందర్భంగా ప్రకటించారు.

యూఏఈ పర్యటన అనంతరం ప్రధాని నెదర్లాండ్స్ చేరుకున్నారు. అక్కడి నుంచి స్వీడన్, నార్వే, ఇటలీ వెళ్లనున్నారు.

# మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాను

ది హేగ్, మే 16 : భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.

సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నా లక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# వెండి దిగుమతులపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా.. అన్ని రకాల వెండి దిగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలోకి వచ్చే వెండి దిగుమతుల్ని మరింత కఠినంగా పర్యవేక్షించడం, క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తక్షణమే ఈ ఆంక్షలు అమల్లోకి వస్తాయని ఎడీఈఫ్టీ పేర్కొంది. 99.9 శాతం ప్యూరిటీ ఉన్న సిల్వర్ బార్స్ గతంలో ఫ్రీ కేటగిరీలో ఉంచేది. వీటిని ఇప్పుడు నిషేధిత లేదా నియంత్రిత కేటగిరీలోకి మారుస్తున్నట్లు వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

# ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర వాటా నిధులు ఇవ్వకపోతే.. మేమే భరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇంటి కోసం రూ.1.60 లక్షలను తాత్కాలికంగా ఆపామనీ, ఒకవేళ కేంద్రం మరో 15-20 రోజుల్లోగా విడుదల చేయని పక్షంలో తామే ఆ నిధులను లబ్ధిదారులకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలి విడత మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు సుమారు 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2 న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రెండో విడత మంజూరులో వివిధ రకాల వెసులుబాట్లను కల్పిస్తామనీ, గోడలు, బేస్‌మెంట్ లెవల్, శ్లాబ్ వరకు ఉన్న గోడలు, శ్లాబ్ లేని ఇండ్లకు కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గత 25 రోజులుగా రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే అంశాలపై విస్తృతంగా చర్చించామనీ, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించి కొన్ని విషయాలపై అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకుని పరిష్కరించామన్నారు. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలనీ కొన్ని ప్రాంతాల వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో ఆరు నెలలు తిరగకుండానే రెండు సార్లు భూముల ధరలు అశాస్త్రీయ పద్ధతిలో పెంచారనీ, తమ ప్రభుత్వం ఆర్థిక నిపుణులెన అరవింద్ సుబ్రహ్మణ్య సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి ఈనెల చివరి లోగా భూముల ధరలను సవరించి అమలులోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

# 'సర్' పై అనుమానాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అక్నాలెడ్జ్ ఫామ్‌గా ఉంచుకోవచ్చని'' తెలిపారు. ఆన్‌లైన్‌లో వోటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే, హెల్ప్‌లైన్ 1950తో పాటు బుక్ ఎ కాల్ విత్ బీఎల్ఓ సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు సేకరించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇస్తామనీ, ఓటరు జాబితా ముసాయిదాను రాజకీయ పార్టీలకు ఇస్తామని చెప్పారు. జూలై 31న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇస్తామనీ, దీనిపై ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు తెలపడానికి అవకాశం ఇస్తామన్నారు. అభ్యంతరాలు పరిశీలించాక అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 2002లో 'సర్' ప్రక్రియ జరిగిందన్నారు. దాదాపు 25 ఏళ్ల అనంతరం మళ్లీ ఈ ప్రక్రియ జరుగనుందనీ, ఓటరు జాబితాలో అనర్హులు లేకుండా చూడటంతో పాటు అర్హుల ఓటర్లను తొలగించకుండా చూడటం కూడా సర్ లక్ష్యమన్నారు. ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతామనీ, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. జూలై 1కి ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందనీ, 1987- 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# 2027 డిసెంబర్ నాటికి దేవాదుల పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.6106 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన దేవాదుల ఎత్తిపోతల పథకంను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురి చేయడంతో అంచనా వ్యయం రూ18400 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టపై రూ.14422 కోట్లు ఖర్చు చేశామనీ మరో రూ.3978 కోట్లతో వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. మొత్తం మూడు దశల్లో చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 16 ప్యాకేజీలుగా విభజించి నిర్మాణం పనులు చేపట్టామనీ, అందులో మొదటి దశ ద్వారా 1.23 లక్షల ఎకరాలకు, రెండో దశ ద్వారా 1.93 లక్షల ఎకరాలకు, మూడో దశ ద్వారా 2.39 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 20 పంప్ హౌస్‌లు, 642 కి.మీ.ల పైప్ లైన్లు, 57,16 కి.మీ.ల సొరంగ మార్గం, 20 రిజర్వాయర్లు, 306 ప్రధాన కాలువలకు ఈ ప్రాజెక్టు విస్తరించి ఉందని వివరించారు. ఆసియాలోనే అతి పొడవైన 49 కి.మీ.ల డీ ఆకారపు సాగు నీటి సొరంగం ఈ ప్రాజెక్టులో భాగమని పేర్కొన్న మంత్రి ఉత్తమ్ 495.55 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమ్మక్క బ్యారేజ్ అనుసంధానం ద్వారా ఏడాది పొడవునా నీటి లభ్యత దాదాపు నిరంతరంగా ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయనీ తెలిపారు. నిలిచిపోయిన ప్యాకేజీలను గుర్తించి అవసరమైతే, వెంటనే కాంట్రాక్టులను రద్దు చేసి రీ టెండర్లు పిలవాలని ఆదేశించారు. పనులు చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలనీ, పరిపాలనా అనుమతుల జాప్యం కారణంగా విలువైన సాగునీటి సామర్థ్యం నిలిచిపోవద్దని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అధికారులకు స్పష్టం చేశారు.

# సబ్ స్టేషన్లలో సోలార్ ప్లాంట్లు..

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాల పరిధిలోని 18 సబ్‌స్టేషన్లలో (33/11 కేవీ) మొత్తం 19 మెగావాట్ల సామర్థ్యం గల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇంధన శాఖ జీవో విడుదల చేసింది. ఈ ప్రాజెక్టును రూ. 66.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన జీవో (జీఓఎంఎస్ నం.11) ని ఇంధన శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 ప్రకారం.. 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలో 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 2047 నాటికి నెట్ జీరో (కర్బన ఉద్గారాల రహిత) లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా లోడ్ సెంటర్లకు సమీపంలోనే సోలార్ పవర్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం వ్యూహాత్మకంగా, ఆర్థికంగా ఎంతో కీలకం కానుంది.

**డిస్కామ్లు వారీగా కేటాయింపులు...**

ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం అయ్యే రూ.66.50 కోట్ల నిధులను ఆయా డిస్కామ్లే భరించనున్నాయి. టీజీఎస్పీడీసీఎల్ 8 సబ్‌స్టేషన్లలో 8 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 10 సబ్‌స్టేషన్లలో 11 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు నోడల్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా టీజీరెడ్కో వ్యవహరించనుంది. కాంపిటేటివ్ బిడ్డింగ్ ప్రాసెస్ ద్వారా ఈపీసీ కాంట్రాక్టర్లను ఎంపిక చేయనున్నారు. అదిలాబాద్ జిల్లాలో స్థల కేటాయింపుఈ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా తామసి (తాళమడుగు) మండలం కజ్జర్ల పరిధిలోని సర్వే నెంబర్ 142లో గల 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కజ్జర్ల సబ్‌స్టేషన్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం టీజీఎన్పీడీసీఎల్కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# అరెస్టా?.. అప్పగింతా?

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో గత 10 రోజులుగా తప్పించుకుని తిరుగుతున్న బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు లుకౌట్ నోటీసులు సైతం జారీ చేశారు. కాగా పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సీపీ రమేశ్‌రెడ్డి తెలిపారు. నార్సింగిలో పోలీసు అకాడమీ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితుడిని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ సీపీ తెలిపారు. అయితే చట్టంపై ఉన్న గౌరవంతో తానే తన కుమారుడిని న్యాయవాదుల సమక్షంలో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏకంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

**10 రోజులుగా పరార్ :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ గత 10 రోజులుగా పరార్‌లో ఉన్న విషయం తెలిసిందే. అతనిపై నమోదైన పోక్సో కేసులో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో బండి భగీరథ్ విదేశాలకు పారిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా భగీరథ్‌తో టచ్‌లో ఉన్నవారితో పాటు అతని స్నేహితులు, బంధువుల ఇళ్లపై నిఘా ఉంచారు. వెరసి కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న బండి భగీరథ్ కోసం పది ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఫోన్ కాల్ డేటా ఆధారంగా భగీరథ్‌ను గుర్తించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈక్రమంలో బంజారాహిల్స్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి వెళ్లిన పోలీసు బృందం గంటపాటు తనిఖీలు చేపట్టింది. అలాగే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని సన్నిహితులు బంధువుల ఇళ్లల్లో మరో మూడు బృందాలు నిఘా అధికం చేశారు. వీటితో పాటు కరీంనగర్‌లో మరో బృందం గాలిస్తోంది. కాగా శనివారం ఉదయం నుంచి బండి భగీరథ్ పేట్ బషీరాబాద్ పోలీసుల ఎదుట లొంగిపోతారని ప్రచారం సాగింది. అయితే భగీరథ్‌ను నార్సింగ్ సమీపంలోని పోలీసు అకాడమీ వద్ద పోలీసులు అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ కీలక ప్రకటన చేశారు.

**హైకోర్టు ఆదేశాలు :**

హైకోర్టు ఆదేశాల మేరకు మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మరోసారి రికార్డు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఈక్రమంలో శనివారం బాధితురాలు మేడ్చల్ కోర్టుకు హాజరై మెజిస్ట్రేట్ ఎదుట దాదాపు రెండున్నర గంటల పాటు వాంగ్మూలం ఇచ్చింది. ఇప్పటికే రెండుసార్లు పోలీసులకు వాంగ్మూలం ఇవ్వగా, తాజాగా బాధితురాలితో పాటు తల్లి స్టేట్ మెంట్‌ను రికార్డు చేశారు. మరోవైపు ఇప్పటికే తన కుమార్తెను మద్యం సేవించమని బండి భగీరథ్ ఒత్తిడి చేసి.. ఆమె బలహీన స్థితిలో ఉన్న సమయంలో అనుచితంగా ప్రవర్తించాడని ఆమె ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తన కుమార్తె చాలా రోజులు అవమానంగా.. మానసిక వేదనను అనుభవించిందని తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రస్తుతం సిట్ దర్యాప్తు కొనసాగుతోందని.. నిజానిజాలు తప్పకుండా బయటికి వస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తమ వద్ద వాట్సాప్ చాటింగ్,మెసేజ్‌లు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఆధారాలు కూడా ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఈ కేసులో విచారణ నిమిత్తం రావాల్సిందిగా భగీరథ్‌కు ఇదివరకే పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరయ్యాడని, అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు.

**బందోబస్తు :**

బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని రోజురోజుకీ ఆందోళనలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం వద్ద, పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ వద్ద పోలీసులు బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడవద్దనే కోణంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో తీవ్రంగా పరిగణిస్తోంది. కాగా ఈనెల 12 న బండి భగీరథ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. అదే రోజు పేట్ బషీరాబాద్ పోలీసులు బుధవారం స్టేషన్‌కు రావాలని నోటీసులు జారీచేయగా బండి భగీరథ్ గైర్హాజరయ్యాడు. తరువాత మరోసారి విచారణకు హాజరవుతానని పేట్ బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపారు. విచారణకు పూర్తిగా సహకరిస్తామని మెయిల్‌లో వెల్లడించారు. ఈక్రమంలో పోక్సో కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం సుదీర్ఘంగా వాదనలు కొనసాగిన విషయం విదితమే. న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీ దేవి ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం బాలిక వాంగ్మూలం పరిశీలించిన తర్వాత ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

**పారిపోవడం.. పద్ధతి కాదు :**

బండి భగీరథ్ కేసు గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ తీరు నైతికంగా సరైనది కాదని పేర్కొన్నారు. నేరారోపణలు వచ్చేసరికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు పారిపోవడం సరైన పద్ధతి కాదని వెల్లడించారు. త్వరగా అతడిని పోలీసులకు అప్పగించాలని కోరారు. ఈ పరిణామాల తరువాత పోలీసులు శనివారం బండి భగీరథ్‌పై లుక్ ఔట్ నోటీసులు జారీచేశారు.

**అరెస్ట్...రిమాండ్ :**

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను శనివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడు భగీరథ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, జడ్జీ ఎదుట ప్రవేశ పెడతామని పోలీసులు చెబుతున్నారు. జడ్జీ ఆదేశాల మేరకు నిందితుడు భగీరథ్‌ను రిమాండ్‌కు తరలిస్తామని, ఈక్రమంలో ఆదివారం ఉదయం జైలుకు తరలించే అవకాశాలున్నట్లు పోలీసు అధికారులు వివరించారు.

# న్యాయ వ్యవస్థపై నమ్మకముంది

హైదరాబాద్,మే 16(మనం,ప్రత్యేక ప్రతినిధి) : పోక్సో కేసులో నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్, సరెండర్ విషయంలో హైడ్రామా మొదలైంది. ఒకవైపు పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెబుతుండటంతో మరోవైపు తానే తన కుమారుడిని పోలీసుల ఎదుట హాజరుపరిచానని బండి సంజయ్ ప్రకటన విడుదల చేశారు. ఈక్రమంలో బండి భగీరథ్‌కు అన్నివైపులా ఉచ్చు బిగియడంతో లొంగిపోయాడా, దేశం వదిలి పారిపోతే పట్టుకోవడం కష్టమని పోలీసులు అరెస్ట్ చేశారా? అన్నది చర్చనీయాంశమైంది. కాగా కుమారుడి అరెస్ట్, సరెండర్ విషయంలో అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందేనని బండి సంజయ్ పేర్కొన్నారు. చట్టంపై ఉన్న గౌరవంతోనే తమ కుమారుడిని లాయర్ల సమక్షంలో పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఆ నమ్మకంతోనే కుమారుడిని పోలీసులకు అప్పగించానని ఆయన స్పష్టం చేశారు.

**ఆధారాల కోసమే జాప్యం**

పోక్సో కేసులో నిందితుడైన తన కుమారుడి అరెస్ట్‌పై బండి సంజయ్ మాట్లాడుతూ.. భగీరథ్ తాను ఎలాంటి తప్పూ చేయలేదని చెబుతున్నాడని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి తాము నిర్దోషులమని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సేకరించే క్రమంలోనే పోలీసులకు అప్పగించడంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. అంతేకాని చట్టం నుండి తప్పించుకోవాలనే ఉద్దేశం తమకు లేదని, అందుకే ఇప్పటివరకు లొంగిపోకుండా సరైన ఆధారాలతో లాయర్ల ద్వారా పోలీసుల ముందుకు వచ్చామని తెలిపారు. కుమారుడిని చట్టం ముందు ప్రవేశపెట్టిన అనంతరం, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, న్యాయస్థానాల్లో తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ లొంగుబాటుతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడగా, పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు.

# మంత్రి వర్గ విస్తరణపై నిర్ణయం!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అంతా భావించారు. కానీ, తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్త్‌లు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు హోం, విద్యా శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ చేస్తే సీఎం దగ్గర ఉన్న కొన్ని కీలక శాఖలను కూడా కొత్త మంత్రులకు ఇచ్చే అవకాశం ఉంది. మంత్రి పదవులపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలూ నాయక్‌తో పాటు రామ్మోహన్ రెడ్డి కూడా ఆశలు పెట్టుకున్నారు. శనివారం తాను అధిష్టానం పెద్దలను కలిశాననీ, మంత్రివర్గంలో స్థానంపై హామీ వచ్చిందని రామ్మోహన్ రెడ్డి వెల్లడించారు. ఇక గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో చామల కాంగ్రెస్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందడంతో సీఎం తనకు మంత్రి పదవి ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఇక మరో రెండు నెలల్లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్నందున హైదరాబాద్‌కు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న మల్‌రెడ్డికి హైదరాబాద్ నగరంపై గట్టి పట్టు ఉంది. ఆయనకు మంత్రి పదవి ఇచ్చినట్లయితే హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందనే అంచనాలు ఉన్నాయి. ఇక వెలమ సామాజిక వర్గం నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్న వారిలో ప్రేమ్‌సాగర్ రావు, మదన్‌మోహన్ రావు, మైనంపల్లి రోహిత్ ఉన్నారు. గత మంత్రివర్గ విస్తరణ సమయంలోనే ప్రేమ్‌సాగర్ రావును మంత్రి పదవి వరిస్తుందన్న ప్రచారం జోరుగా సాగింది. అయితే, సామాజిక సమీకరణల కారణంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. ఒకవేళ మంత్రివర్గ విస్తరణ చేపట్టని పక్షంలో సీఎం రేవంత్ రెడ్డి పలువురు మంత్రుల శాఖలు మార్చే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. మంత్రుల పనితీరు, వివాదాలు, అవినీతి ఆరోపణల కారణంగా ఇద్దరు లేదా ముగ్గురు మంత్రుల శాఖలు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బీసీ వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ మంత్రిని పదవి నుంచి తప్పించి ఆయన స్థానంలో మరో బీసీకి ఇవ్వొచ్చనే చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, ప్రస్తుతం ఒక్కో మంత్రి రెండు మూడు కీలక శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రధానమైన భారీ సాగునీటి పారుదల శాఖతో పాటు పౌర సరఫరాల శాఖను, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూతో పాటు హౌసింగ్ శాఖను నిర్వహిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన పక్షంలో ఇప్పుడున్న మంత్రుల్లో పదవులు కోల్పోయేది ఎవరు? కొత్తగా మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయి? అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యునిపై భారం

- ఇది మోడీ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం
- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 16 (మనం బ్యూరో) : ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందనీ, నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదేపదే ప్రకటించిందనీ, ఫలితాలు వచ్చి పది రోజులైనా గడవకముందే ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమేననీ, కేవలం ఒట్ల కోసం మోడీ అబద్దాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారనీ, ఇది విశ్వాస ఘాతుకం అవుతుందని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వ అసమర్థ, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందనీ, ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయనీ, యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందనీ, ఇప్పుడు ఆ పతనం పరాకాష్టకు చేరిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# అసలు సిసలు మహిళా బ్యాంకు స్త్రీనిధి

## మహిళల ఆర్థిక స్వావలంబనకు అదొక బలమైన వేదిక: మంత్రి సీతక్క




హైదరాబాద్, మే 16 : మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి బలమైన వేదిక పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిదని, సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయని అన్నారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజాభవన్లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీనిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకోగా, మంత్రి సీతక్క అభినందించారు. సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాకుండా, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతోపాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 'రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించింది. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిది. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి' అన్నారు. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు.

స్త్రీనిధి అసలు సిసలు మాహిళా బ్యాంక్ అని కొనియాడారు. తెలంగాణ మహిళలకు స్త్రీనిధి ఒక నమ్మకమైన బ్యాంక్గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీనిధి మోడల్ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అని మంత్రి తెలిపారు. దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి సంస్థపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అలాంటి ఆరోపణలపై వాస్తవాలను ఉద్యోగులు స్పష్టం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ఇప్పుడు అదే వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో సంస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 'మాది ఉద్యోగ అనుకూల ప్రభుత్వం. స్త్రీనిధిలో ఒక్కరిని కూడా తొలగించలేదు. ఇప్పటికే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేశాం.

సెర్ప్లో వంద శాతం బదిలీలు నిర్వహించాం. స్త్రీనిధిని బలోపేతం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం తప్ప, ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదు' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్త్రీనిధి సంస్థ ఏర్పాటులో, దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న విద్యాసాగర్ రెడ్డిని మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. నూతన నాయకత్వంలో స్త్రీనిధి సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. 'స్త్రీనిధి మహిళల కోసం, మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. దీనిని కాపాడుకుంటూ మహిళల ఆర్థిక అభివృద్ధికి మరింత బలోపేతం చేయాలి' అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీనిధి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సైక్లిస్ట్ రమ్యకు సైకిల్ అందజేత

- కేటీఆర్, అండగా నిలిచిన వారికి రమ్య కృతజ్ఞతలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : సైక్లిస్ట్ రమ్య తన కలల ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాయమందించారు. నల్గొండ జిల్లా కంచనపల్లి గ్రామానికి చెందిన యువ సైక్లిస్ట్ రమ్య సైదులు ఎన్నో కష్టనష్టాలకోర్చి అలుపెరగకుండా శ్రమిస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గుర్తింపు తెచ్చుకుంది. అయితే, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు ప్రొఫెషనల్ రేసింగ్లో సైకిల్ ధర రూ.10 లక్షలు ఉండటంతో వారికి సాధ్యం పడలేదు?.. ఆమె పట్టుదల, లక్ష్యాన్ని చూసి చలించిన కేటీఆర్, ఆమెకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను ఇప్పుడు నిలబెట్టుకున్నారు.

**రమ్యకు ప్రొఫెషనల్ రేసింగ్ సైకిల్..**

కేటీఆర్ ప్రారంభించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' స్ఫూర్తితో అదే జిల్లాకు చెందిన డాక్టర్ శ్రీరెడ్డి ముందుకు వచ్చారు. దీంతో 'హెర్మియోన్ డన్కన్ రెడ్డి ఫౌండేషన్' ద్వారా రమ్యకు ప్రొఫెషనల్ రేసింగ్ సైకిల్ను అందజేశారు.

# డ్రగ్స్ ముఠా అరెస్ట్

## 137 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్,మే 16(మనం,ప్రత్యేక ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపాయి. మెహదీపట్నంలో 137 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసులో కీలక నిందితుడు శుభమ్ సహా 8 మందిని అరెస్ట్ చేశారు. అలాగే నిందితులకు చెందిన వోల్వో కారు, ప్యాకింగ్ మెటీరియల్, 9 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. హైదరాబాద్ టాస్క్ఫోర్స్, మెహదీపట్నం పోలీసులు పక్కా సమాచారం ఆధారంగా ఆపరేషన్ నిర్వహించారు. ఈ కేసులో నిందితులు ఏ1 శుభమ్ కుమార్ మిశ్రా, ఏ2 సోహమ్ నాయక్, ఏ3 కలంగి రాజేష్, ఏ4 ముంతున్ కుమార్, ఏ8 అబ్దుల్ షాబాజ్ బాలానగర్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. మిగిలిన వినియోగదారులు హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు శుభమ్ కుమార్ మిశ్రాకు, అదే ప్రాంతంలో నివసించే బుసా సాయి నిఖిల్ యాదవ్ అలియాస్ సాయి చిన్ననాటి స్నేహితులని, వీరిద్దరికీ గంజాయి, ఎండీఎంఏ తీసుకునే అలవాటు ఉందన్నారు. ఈ క్రమంలో శుభమ్.. సాయి నిఖిల్ వద్ద నుండి ఎండీఎంఏ డ్రగ్స్ను సేకరించడం ప్రారంభించాడని, కాగా, సాయి నిఖిల్ను ఇటీవల చిలకలగూడ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశారని పోలీసులు తెలిపారు. సాయి నిఖిల్ అరెస్ట్ అయిన తర్వాత కూడా శుభమ్ కుమార్ మిశ్రా ఈ డ్రగ్స్ వ్యాపారాన్ని కొనసాగించాడని, ముఖ్యంగా తన స్నేహితులైన సోహమ్ నాయక్, కలంగి రాజేశ్లతో కలిసి డ్రగ్స్ దందా చేశాడన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శుభమ్ వారిద్దరికీ పెద్ద మొత్తంలో డ్రగ్స్ సరఫరా చేయగా.. వారు దానిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి కస్టమర్లకు విక్రయించేవారని, డ్రగ్స్ను వినియోగదారులకు చేరవేయడానికి రాపిడో సర్వీసులను ఉపయోగించేవారని విచారణలో తేలింది.

# 'బండి' పదవికి ఉద్వాసన పలకండి

- కేంద్ర హోంశాఖ మంత్రి నుంచి తొలగించాలి
- ప్రధానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత లేఖ



హైదరాబాద్,మే 16(మనం,ప్రత్యేక ప్రతినిధి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుండి తొలగించాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రధానికి లేఖ రాశారు. ఆయన కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయనను పదవికి ఉద్వాసన పలకాలని లేఖలో డిమాండ్ చేశారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్ర విచారణ జరిగేందుకు చొరవ చూపాలని, దేశంలో మైనర్ల రక్షణ కన్నా రాజకీయ ప్రయోజనాలు ఎక్కువ కాదని ప్రధాని గుర్తించాలన్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలన్నా...విచారణలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండొద్దని సూచించారు. రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం ప్రధాని తక్షణ కర్తవ్యమని గుర్తించాలని కవిత అన్నారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తప్పించాలని లేఖలో తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్పై పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో అత్యంత తీవ్రమైన బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. బండి సంజయ్ ప్రస్తుతం దేశంలోనే అత్యంత కీలకమైన, చట్టాన్ని అమలు చేసే అధికారాలు గల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నారు. చట్టపరంగా ఆయన కుమారుడి పై నేర నిరూపణ అనేది న్యాయస్థానం తేల్చాల్సిన విషయమే. కానీ ఆయన అదే పదవిలో కొనసాగడం వల్ల దర్యాప్తు ప్రక్రియ, సాక్ష్యాల సేకరణ, సాక్షుల రక్షణపై ప్రభావం పడే అవకాశం ఉంది. న్యాయస్థాన విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని లేఖలో పేర్కొన్నారు.

# తిరుమలలో విస్తృత స్థాయి నాఖాబందీ నిర్వహణ

- భక్తుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

తిరుమల, మే16 మనం న్యూస్: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా తిరుమలలో విస్తృత స్థాయిలో నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు.భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తిరుమలలోని శిలాతోరణం, శ్రీవారి పాదాలు ప్రాంతాల్లో ఉదయం 6.00 గంటల నుండి 7.30 గంటల వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కార్యక్రమానికి ముందు ఉదయం 5.30 గంటలకు శిలాతోరణం జంక్షన్ వద్ద సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ నాఖాబందీ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ సర్వీసెస్, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మైనర్ కోసం లాయర్ను ఎందుకు పెట్టలేదు?

## బాధిత యువతి కేసులో వారికి న్యాయజేసేందుకు లాయర్ను ఎందుకు పెట్టలేదు?

- ప్రశ్నించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మనం ప్రతినిధి : బండి సంజయ్ కొడుకు.. ఓ మైనర్ బాలికపై చేసిన అఘాయిత్యం గురించి రేవంత్ రెడ్డికి ఎప్పుడో చెప్పాడని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. అయితే, దీనిపై బండి సంజయ్ ఏమని చెప్పాడు?, డీజీపీకి ఏం ఆదేశాలు ఇచ్చారో? సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారంనాడు తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... తనకు ఎవరు? ఎక్కడ అడ్డు ఉండకూడదన్న ఒకే ఒక్క కారణంతో.. ప్రతిపక్షాల మీద లాయర్ల కోసం కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వారికోసం కోట్లువెట్టే మీరు.. కనీసం.. ఓ బాధిత మైనర్ కోసం ఒక మంచి లాయర్ను ఎందుకు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల రెండు రోజుల క్రితం ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి మాటలను గుర్తు చేశారు. ఈ రాష్ట్రంలో నాకు 51 శాతం మంది ఓటు వేస్తే చాలు మిగతా 49 శాతం మంది వేయకపోయినా పర్లేదని అని ఆయన అన్నారంటూ గుర్తు చేశారు. అంటే? ఈ మైనర్ అమ్మాయి 49 శాతం మందిలో ఉందనా..? మీరు ఆమె గురించి పట్టించుకోవడం లేదు? అని ప్రశ్ని ంచారు. 51 శాతం దాంట్లో ఏమో బండి సంజయ్ కుటుంబం ఉంది.. 49 శాతం దాంట్లో ఈ అమ్మాయి ఉందనే మీరు పట్టించుకోవడం లేదా..? మీరు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల సంపదను రూ.17 కోట్ల 7 లక్షల రూపాయలను కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు చేయని నేరానికి ఎట్లా జైలుకు పంపించాలె? అన్న కుట్రమీద సుప్రీంకోర్టులో పేరు మోసిన లాయర్లను పెట్టి వృధా చేసిన్రు అని గుర్తు చేశారు. ఈ ముగ్గురు నాయకుల మీద చేయని నేరానికి పెద్ద పెద్ద లాయర్లను ఒక్కొక్కరికి రూ.కోటి ఇచ్చి తీసుకొచ్చిన్రని మండిపడ్డ ఆయన.. ఒక అమ్మాయికి తండ్రిగా.. బాధిత కుటుంబానికి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి.., కనీసం ఒక్క ఫోన్ కూడా చేయలేదని తీవ్రంగా మండిపడ్డారు.

# లుకౌట్ నోటీసులు.. తీవ్ర అవమానం

- తన కొడుకుని బండి సంజయ్ అప్పగించలేదు? : ఆరెస్పీ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని మోదీ చెప్పడమంటే ఆడవాళ్ల మీద, మైనర్ బాలికల మీద అఘాయిత్యాలు పెరుగుతాయని చెప్పడమేనా..? అని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

బీజేపీ నాయకులు, వారి కొడుకులు తెలంగాణలో ఆడవాళ్లకు, బాలికలకు భద్రత లేకుండా చేస్తారని చెప్పడమేనా..? అన్నారు. తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..

పోలీసులు ఒక కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కొడుకుకు లుకౌట్ నోటీసులు ఇవ్వడం కంటే అవమానం ఇంకొకటి ఉంటుందా..? ఒక తీవ్రవాదిలాగా కేంద్ర మంత్రి కొడుకు కోసం రాష్ట్ర పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి వెతకడం కంటే సిగ్గు చేటు ఇంకోటి ఉంటుందా..? అన్నారు.

# మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ. 30 వేలు

## పిల్లలే సంపద పేరుతో కొత్త కార్యక్రమం

## పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై సీఎం చంద్రబాబు.



అమరావతి, పి.మీరాహుస్సేన్ . మనం ప్రత్యేక ప్రతినిధి): దేశ ప్రగతిలో పిల్లలే అసలైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోందని, జనాభా తగ్గుదల రేటును అరికట్టేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పిల్లలే సంపద పేరుతో త్వరలో కొత్త కార్యక్రమం చేపడతామని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రకటించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా జనాభాను దేశానికి సంపదగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేలు ప్రోత్సాహకంగా అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. చాలామంది ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారని, ఈ కారణంగా చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. దీని వల్ల ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని స్పష్టం చేశారు. గతంలో కుటుంబ నియంత్రణ అమలు పై విస్తృతంగా పనిచేశామని, ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించేలా ఆంగన్వాడీ కేంద్రాలను కూడా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగ్లు ముద్దు

కదిరి,మే16మనంన్యూస్ : ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగ్ లు ముద్దు అంటూ ప్లాస్టిక్ నివారిద్దం పర్యావరణం కాపాడుదాం అని కదిరి పట్టణంలో మెప్మ సిబ్బంది,మరియు నాయకులు కార్యకర్తలతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జరిగింది.. ప్లాస్టిక్ కవర్, వస్తువుల వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించాలని, పేపర్ సంచులు వాడి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మరియు స్వచ్ఛంద్ర కమిషన్ డైరెక్టర్ పర్వీన్ బాను,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్,మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సందీప్,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# అంపశయ్యపై నుంచి అభివృద్ధి పథంలోకి...

కూటమి రాకతో చేనేతకు స్వర్ణయుగం ప్రారంభం

చేనేత రంగ అభివృద్ధికి నూతన టెక్స్ టైల్స్ పాలసీ

నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు

15 శాతం సబ్సిడీకే నూలు... 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు

చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా బకాయిల చెల్లింపు

రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు, మెగా టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటు

చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఒప్పందాలు

ఆప్కో షో రూముల్లో పెరిగిన అమ్మకాలు... ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు

లోకేష్ చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

నేతన్నలు కాలరెగరేసేలా కూటమి పాలన





అమరావతి, మే 16, మనం న్యూస్: కూటమి ప్రభుత్వం రాక నిస్తేజంలో కూరుకుపోయిన నేతన్నకు భరోసానిచ్చింది.. గత రెండేళ్ల కాలంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అంపశయ్యపై ఉన్న చేనేత పరిశ్రమ అభివృద్ధి పథంలోకి పయనించసాగింది. ఒకవైపు నూతన టెక్స్ టైల్స్ పాలసీ, మరోవైపు వ్యక్తిగత లబ్ధి పొందేలా పథకాల అమలు, ఇంకోవైపు చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలతో డీలా పడిన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం జవసత్వాలు నింపింది. నేను కూలీని కాదు కళాకారుడిని అని నేతన్నలు కాలెరెగేసేలా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది, ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. చేనేత రంగాన్ని ఆదుకున్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు సైతం నేతన్నలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక మంత్రి నారా లోకేష్ తీసుకున్న చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు, గౌరవం దక్కింది.

**చేనేతకు పథకాలతో చేయూత...**

2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ. 4 వేలకు పెన్షన్ పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద 2024-25లో రూ.5 కోట్లు, 2025-26లోనూ మరో రూ.5 కోట్లు కేటాయించారు. త్రిఫ్ట్ పథకం ద్వారా 5,726 మందికి లబ్ధి కలిగింది. రెండేళ్లలో రూ.65.35 కోట్ల మేర ముద్ర రుణాలను 6,808 మందికి అందజేశారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి)పథకం ద్వారా చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.10.44 కోట్లను వెచ్చించగా, 7,500 మంది చేనేతలకు లబ్ధి కలిగింది. రూ.175 కోట్లతో ముడి పదార్థాల సరఫరా పథకం ద్వారా నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేనేత ఉత్పత్తుల 5 శాతం జీఎస్టీ రియింబర్స్ మెంట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించారు. ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో పాటు క్యాష్ క్రెడిట్ పథకం కింద సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు.

**నేతన్నల కుటుంబాల్లో 'ఉచిత' వెలుగులు**

గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా నేతన్నల కష్టాలను తెలుసుకుని, ఉచిత విద్యుత్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.150 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం వెచ్చిస్తోంది. సుమారు 1.04 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది కలుగనుంది. పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతోంది.

**ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు**

నేటితరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాల తయారీలో 5 జిల్లాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కలంకారి చీరలు, పెన్ కలంకారి చీరలు, దుపట్టాలు, డిజిటల్ ప్రింటెడ్ చీరలు, క్రోచెట్ లేస్ చీరల తయారీలో శిక్షణ అందజేశారు. ఆప్కో షో రూముల్లో రెడీమేడ్ చేనేత వస్త్రాలను అమ్మకాలు ప్రారంభించారు. వెల్కో ధోవతులు, కాటన్ రెడీమేడ్ పెళ్లికూతురి ధోవతులు, మోడీ జాకెట్లు, సిల్క్ పెళ్లికూతురి సెట్లు, కొత్త డిజైన్లతో రెడీమేడ్ షర్టులు, లెనిన్ షర్టుల సహా వందకు పైగా డిజైన్లతో చేనేత రెడీమేడ్ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. మారిన అభిరుచుల నేపథ్యంలో యువత, మహిళలు చేనేత వస్త్రాల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. ఆన్ లైన్ లోనూ చేనేత రెడీమేడ్ దుస్తులు,ఇతర వస్త్రాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 40 ఆప్కో షో రూమ్స్ ద్వారా 6,770 ఉత్పత్తులను అమ్మకాలకు పెట్టారు. ఈ కామర్స్ అమ్మకాలతో నేరుగా వినియోగదారుల ఇళ్లకే వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఆప్కో పేరిట సొంత వెబ్ సైటును అందుబాటులోకి తీసుకొచ్చారు. చేనేత వస్త్రాల పై సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం చేస్తూ, నేటి తరానికి నేతన్నలను కూటమి ప్రభుత్వం మరింత దగ్గర చేస్తోంది.

## జీవితం

నేనెప్పుడు కృంగిపోలేదు
నేనెప్పుడు ఆగిపోలేదు
నేనెప్పుడు మదన పడలేదు
నేనెప్పుడు వెనకడుగు వేయలేదు

కష్టాల కడలి తెలుసు
ఇబ్బందుల అలజడి తెలుసు
మంచులో కరిగిపోయా
నిప్పుల కొలిమీలో నెగటునయ్యా

విజయం, అపజయం
కళ్ళముందు ఏది మెదలాడిన
రెండింటిని ఒకే రీతిలో
చూడడం నాకు అలవాటైంది

ఎందుకంటే.....
విజయ,అపజయ
సమ్మేళనమే జీవితం..

**- తాళ్ళపెల్లి సురేందర్**
9440715635

## దేశం

రేట్లు .. కంగారులూ
ఓట్లు.. బంగారాలు
కుర్చీలు.. కునికిపాట్లు
తెలివి అమ్మకం సరుకు
అజ్ఞానం అధికారం
జనం ...గందరగోళం
సమూహం... ఒంటరి గోళం

**- మండాది గోపీనాథ్**
9885045344

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి – ఎడిటర్**

# పురోగమనంలో టెలికాం సమాచారం



మానవ నాగరికత పురోగమనంలో సమాచారం ఒక కీలకమైన శక్తి. నేటి ప్రపంచాన్ని సమాచార సాంకేతికత శాసిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకప్పుడు పావురాలతో, ఆ తర్వాత ఉత్తరాలతో సమాచారం పంచుకున్న మనం, టెలికాం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో నేడు ప్రపంచాన్ని అరచేతిలో చూస్తున్నాం. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుందాం! 1837లో శామ్యూల్ మోర్స్ టెలిగ్రాఫ్‌ను కనిపెట్టడంతో సుదూర ప్రాంతాలకు సమాచారం చేరవేయడానికి ఒక కొత్త శకం మొదలైంది. మోర్స్ కోడ్ ద్వారా విద్యుత్ సంకేతాలను ప్రసారం చేయడం ఎలక్ట్రానిక్ సమాచార మార్పిడికి నాంది పలికింది. ఇదే రేడియో సాంకేతికతకు పునాది వేసింది. ఆ తర్వాత 1876లో అలెగ్జాండర్ గ్రాహం బెల్ టెలిఫోన్‌ను కనుగొనడంతో మనుషులు నేరుగా మాట్లాడుకునే అద్భుత అవకాశం వచ్చింది.

1969లో ఇంటర్నెట్‌కు పూర్వగామి అయిన 'అర్పానెట్' పరిశోధనల కోసం కంప్యూటర్లను అనుసంధానించడానికి ఏర్పాటైంది. 1973లో మార్టిన్ కూపర్ మొబైల్ ఫోన్ కాల్‌ను పరిచయం చేయడంతో కమ్యూనికేషన్ మరింత వ్యక్తిగతమైంది. 70వ, 80వ దశకాల్లో మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావడం ఒక పెద్ద సంచలనం. 1990లో టిమ్ బెర్నర్స్-లీ 'వరల్డ్ వైడ్ వెబ్'ను కనుగొనడంతో ఇంటర్నెట్ సామాన్యులకు సైతం చేరువైంది.

2004లో ఫేస్‌బుక్ రాకతో సోషల్ మీడియా యుగం ప్రారంభమైంది. 2007లో ఆపిల్ ఐ ఫోన్ విడుదల స్మార్ట్‌ఫోన్‌ల ఆవిష్కరణకు తెరలేపింది. దీనితో సమాచారం, కంప్యూటింగ్, వినోదం అన్నీ ఒకే పరికరంలో అందుబాటులోకి వచ్చాయి. నేడు కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ వంటి అత్యాధునిక సాంకేతికతలు సమాచార సాంకేతిక భవిష్యత్తును సరికొత్తగా మారుస్తున్నాయి.

ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ టెలికమ్యూ నికేషన్ దినోత్సవాన్ని జరుపుకుంటాం. 1865 మే 17న 'ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్' స్థాపన జ్ఞాపకార్థం ఈ రోజును పాటిస్తున్నాం. ఇంటర్నెట్, కొత్త టెక్నాలజీలు తీసుకువచ్చిన సామాజిక మార్పులపై అవగాహన పెంచడం, ప్రాంతాల మధ్య



డిజిటల్ అంతరాన్ని తగ్గించడం ఈ రోజు యొక్క ముఖ్య లక్ష్యాలు. ఈ ఏడాది 'డిజిటల్ ఆవిష్కరణల ద్వారా స్థిరమైన అభివృద్ధి' అనే అంశాన్ని థీమ్‌గా ఉంది. దీని అంతరార్థం ఏమిటంటే నేటి ఆధునిక యుగంలో డిజిటల్ టెక్నాలజీ కేవలం సమాచార మార్పిడికి మాత్రమే పరిమితం కాకూడదు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లయిన పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్, పేదరిక నిర్మూలన, మరియు అందరికీ సమానమైన విద్య, వైద్యం అందించడంలో టెలికాం ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలి. సాంకేతికత ఎంత పెరిగినా, అది భూమిపై ఉన్న ప్రతి సామాన్యుడి జీవితాన్ని సుస్థిరం చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ థీమ్ మనకు స్పష్టం చేస్తోంది. ప్రపంచ దేశాలలో చైనా తర్వాత అత్యధిక చందాదారులతో అతి పెద్ద టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ కలిగిన రెండవ దేశం మన భారతదేశం. టెలికాం నియంత్రణ సంస్థ గణాంకాల ప్రకారం, మన దేశంలో సుమారు 118.99 కోట్ల మంది ఫోన్ సౌకర్యం కలిగి ఉన్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 66.33 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 52.65 కోట్ల మంది ఉన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 94.49 కోట్ల బ్రాడ్‌బ్యాండ్‌ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో మొత్తం టెలిసాంద్రత 84.45%గా నమోదైంది.

భారత టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో-50.48%, భారతీ ఎయిర్టెల్ - 30.65%, వొడాఫోన్ ఐడియా-13.33%, బిఎస్ఎన్ఎల్-3.90%, ఏట్రియా -0.24%, ఇతరులు -1.60% వాటాలు కలిగి ఉన్నాయి. ఒకసారి మనం గతంలోకి తొంగి చూస్తే, ప్రొఫెసర్ ఎస్. పి. చక్రవర్తిని భారతీయ ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ పితామహుడిగా చెప్పుకుంటాం. స్వాతంత్ర్యం రాకమునుపే టెలిగ్రాఫ్ పరిచయంతో మనదేశంలో టెలికమ్యూనికేషన్స్ ప్రారంభమయ్యాయి. 1850లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కలకత్తా, డైమండ్ హార్బర్ మధ్య మొదటి ప్రయోగాత్మక విద్యుత్ టెలిగ్రాఫ్ లైన్‌ను ప్రారంభించింది. 1881లో ఇంగ్లాండ్‌కు చెందిన ఓరియంటల్ టెలిఫోన్ కంపెనీ లిమిటెడ్ కలకత్తా, బొంబాయి, మద్రాస్, అహ్మదాబాద్లలో ఎక్స్ఛేంజ్లను తెరవడం ద్వారా దేశంలో మొదటి అధికారిక టెలి ఫోన్ సేవలను ప్రారంభించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1948 నాటికి దేశం మొత్తం మీద కేవలం 80 వేల టెలిఫోన్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. 1971 నాటికి ఈ సంఖ్య 9.80 లక్షలకు చేరుకుంది. 80వ దశకంలో సోవియట్ యూనియన్ సహకారంతో సికింద్రాబాద్లో దేశీయ సమాచార ప్రసారాల కోసం మొదటి భూ-ఉపగ్రహ కేంద్రం ప్రారంభమైంది. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ టెలికాం రంగంలో సరళీకరణ తీసుకురావడానికి ప్రయత్నించినా, కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. అయితే, 90వ దశకంలో పి.వి. నరసింహారావు గారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఈ రంగం ఒక్కసారిగా ఊపందుకుంది. 1994లో వచ్చిన నేషనల్ టెలికమ్యూనికేషన్స్ పాలసీతో దేశంలోని అన్ని గ్రామాలకు టెలికాం సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. 1997లో ట్రాయ్‌ఏర్పాటుతో విధాన రూపకల్పనలో ప్రభుత్వ జోక్యం తగ్గింది. 1995లో పబ్లిక్ కమర్షియల్ ఇంటర్నెట్ సదుపాయాన్ని విదేశ్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన సాంకేతిక మార్పులతో 2ఎ, 3ఎ, 4ఎ, 5ఎ లతో మనం దూసుకుపోతున్నాం. ఇప్పుడు ఆరవ తరం (6ఎ) కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. సామాజిక ఆర్థికాభివృద్ధికి టెలికాం వారధి !టెలికమ్యూనికేషన్ భారతదేశ సామాజిక ఆర్థికాభివృద్ధికి ఎంతో మద్దతునిచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషించింది. భారతదేశంలో ఈ-గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచడానికి ఇది సహాయపడింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం సామూహిక విద్యా కార్యక్రమాలను అందించడానికి ప్రభుత్వం ఆధునిక టెలికమ్యూనికేషన్ సౌకర్యాలను సమర్థ వంతంగా ఉపయోగించింది. టెలికాం రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించే దిశగా మరింత కృషి చేద్దాం!


**మే 17 అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ దినోత్సవం..**

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# పవిత్ర భారత దేశం చూతము రారండి!



రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయగీతం 'జనగణమన అధినాయక జయహే! భారత భాగ్య విధాత! ప్రజల ఐక్యతను, వైవిధ్యాన్ని సార్వభౌమాధికారాన్ని కీర్తిస్తుంది. అధినాయకుడు పశ్చిమ, ద్రావిడ, ఈశాన్య ప్రాంతాలను పంజాబ్ ,సింధు, వింధ్య , హిమాచలాలను నదులను సముద్రాలను కంటికి రెప్పలా చూస్తున్నాడా! ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రధాన మంత్రి అధినాయకుడే కదా ! దేశాన్ని అన్ని కోణాలలో అభివృద్ధి చెందేలా చూడడం రాజ్యాంగ విలువలు కాపాడేలా చర్యలు తీసుకోవడం ఆయన ప్రథమ కర్తవ్యమే కదా! భరత మాత ఆరోగ్యం ఎలా ఉందో ! రుగ్మతల బాధపడుతుందో ఏమో! పాపం తెల్సుకుందాం రండి. MRI చేసి కనుగొన్న చేదునిజాలు వింటే ఆశ్చర్యానికి గురి కావసిందే. ఇది తెలిసిన భరతమాత రాజ్యాంగాన్ని కౌగలించుకొని ఎక్కి ఎక్కి ఏడుస్తుంది. ఎక్కడ చూసినా ఏమున్నది గర్వ కారణం.? స్వతంత్ర ప్రతిపత్తి గల ఉన్నత న్యాయస్థానాలలో కూడా అవినీతి అనకొండ అరంగేట్రం చేసి ప్రజాస్వామ్య పునాదులు కదిలించిందని సోషల్ మీడియా చక్కెర్లు కొట్టింది. ఇది కలనో! నిజమో! కేంద్ర ప్రభుత్వ మాయనో! గుడిలో ఉన్న దేవుళ్ళకు కూడా తెలుసో లేదో మరి! అశోక ధర్మ చక్రం ముల్లె మూట సర్దుకొంటుంది! మువ్వన్నెల జెండా రెప రెప లాడడానికి సంకోచించుతుంది. నిర్దోషులు దోషులుగా చలామణి అవుతున్నారు. చట్టాలు చూస్తే బూజు పట్టి ఉన్నాయి తీర్పులు, కొలిక్కిరాకుండా దశాబ్దాలు గడుస్తున్నాయి. రామాయణంలో పిడకల వేటలా పని దినాల సంఖ్య తక్కువ. పనిచేయని దినాలు ఎక్కువ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఇంకెప్పుడు అప్డేట్ అయ్యేది ? దీనిని దృష్టిలో పెట్టుకొని కాబోలు జస్టిస్ విక్రమ్‌నాథ్ సుప్రీంకోర్టు జడ్జి ఇలా అన్నాడు' మన దేశంలో జైల్లో ఉన్న వారిలో 70 శాతం మంది నేరం చేసినట్లు ఇప్పటికీ నిరూపించబడలేదు. వారు తమ ట్రయల్స్ కోసం వేచి చూస్తున్నారు'..'ఇది గమనించదగిన విషయం. కరడుగట్టిన నేరస్థులు కూడా బెయిల్ ద్వారా బయటకు వచ్చి నిర్భయంగా వారి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఎంతైనా నిప్పులేనిది పొగ రాదు కదా! న్యాయ దేవత కళ్ళకు ఎప్పుడో గంతలు కట్టుకుంది. ఇప్పుడు చెవులు కూడా మూసుకొని కోర్టు సరిహద్దులు దాటుతుంది.



మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల్లో అడుగు పెడితే చాలు 'పైసా వసూల్ ' చేయనిదే పని అయితే ఒట్టు . ఆర్డర్లీ వ్యవస్థను పాటించే పోలీస్ అధికారులే ఏసి.బికి చిక్కితే, సామాన్యునికి రక్షణ ఎక్కడా? కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం కల్పించుకొని పార్టీ పరంగా లబ్ధి పొందుతున్నాయని ప్రతి పక్షాలు ఆరోపణలు. చదువుకున్నోళ్లకు చెత్త కూడా ఎక్కడ పడేయాలో తెలియదు. ఇంకా ఓటు హక్కును ఎలా సద్వినియోగం చేస్తారు? నోటుకు లొంగిపోయి ఓటువేసే వారు సత్పౌరులేనా! మేకల మందకు తోడేలును కాపలా పెట్టేది ఎవరు? నేటి పౌరులే కదా !

నేరస్థులను రౌడీలను, చట్టసభలకు తెచ్చేది ఎవరు? కుల మతాల చిచ్చు రగిలించే దెవరు ? అందుకే అంటారు 'యదార్థ వాది లోక విరోధి' అని. అంబేద్కర్ చిత్ర పటాలకు దండలు వేసి సుద్దులు వల్లించగానే సరిపోయిందా? ఆయన ఆశయాలు ఆచరణలో పెడుతున్నారా? కేంద్ర ప్రభుత్వం బి.జే.పీయేతర ప్రభుత్వాల పట్ల పక్షపాత వైఖరి అవలంబించి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్న విషయం ఎంత వరకు నిజం ? రాష్ట్రాల నుండి కేంద్రం ప్రభుత్వం రకరకాల పన్నులు వసూలు చేసినప్పుడు నిధులు ఎందుకు ఇవ్వడం లేదు? ప్రజాధనం ప్రజలకే చెందాలి. ప్రశ్నించే వారిని అధికారం అడ్డుపెట్టుకొని వేధింపులకు గురిచేస్తున్నారని వార్తలు వస్తూనే ఉన్నాయి. ఉచిత పథకాలతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. 'ప్రజలకు విద్య ,వైద్యం ,న్యాయం ,తప్ప ఏవి కూడా ఉచితంగా ఇవ్వద్దు. ఉచితాలు ప్రజలను పని దొంగలుగా మార్చి దేశాన్ని మరింత బలహీన పరుస్తాయి'అన్న మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజపేయి మాటలు ఆచరణలో పెడుతున్నారా? ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి అప్పులు కుప్పలుగా తెస్తే ఆ భారం భరించే వారెవ్వరు ప్రజలే కదా! మహిళకు ఉచిత బస్ సౌకర్యం ఎందుకు? సీట్ల కొరకు సిగలు పట్టుకొని తన్నుకోవడానికా? ఓవర్ లోడ్‌తో పోయి మూకుమ్మడిగా చావడానికా? ఈ తెగులు ఇంతటితో ఆగిందా అంటే అదీ లేదు, తెలంగాణ నుండి పొరుగు రాష్ట్రాలకు క్రమేణా ప్రాకుతుంది సాధికరత అంటే ఇదేనా? ఇంతకు ప్రభుత్వ సలహాదారులు ,ఆర్థిక నిపుణులు ఏమి చేస్తున్నట్లు? ఆర్థిక క్రమశిక్షణ లేని విధానాలను గాడిలో ఎందుకు పెట్టడం లేదు.

కాగ్ లెక్కలు కాకి లెక్కలా? బద్ధకస్తులుగా తయారు చేసే ఉచితాలకన్న స్వయం ఉపాధి కల్పనే మేలు కదా! 40 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయి కాటికి కాలు జాపిన వారికి పెన్షన్ లేదు. 4 సంవత్సరాలు ప్రజల సొమ్ము తిన్న ఎం ఎల్ ఏ, ఎం.పిలకు మరియు ఇతర ప్రజా ప్రతినిధులకు పదవి దిగిన తర్వాత పెన్షన్ మరియు ఇతర సౌకర్యాలకు కొరకు ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతుంది. ఇదెక్కడి న్యాయం? ఇంకో వైపు చూస్తే హిమాలయాలు కరిగి కన్నీరై సముద్రములో పడి ఆత్మ హత్య చేసు కుంటున్నాయి. పర్వతాలు, నదులు సముద్రాలు, కొలనులు, సరస్సు లు పర్యాటకుల చేతిలో చావు దెబ్బలు తిని అంపశయ్యపై మరణం అంచున తొంగి చూస్తున్నాయి. మనిషి ప్రకృతితో చెలగాట మాడి తన చావును తానే కొని తెచ్చుకుంటున్నారు. దేశాభివృద్ధి అంతా కాలుష్యం సునామీలో కొట్టు కొని పోతున్నా రక్షించే పాలకులు కళ్ళు మూసుకొని దేశ భక్తి భజనలు చేస్తారా ? ప్రార్థనా మందిరాలలో మనుషులు చేసిన దేవుళ్ళకు కోట్లు కుమ్మరిస్తారా? గ్లోబల్ వార్మింగ్‌కు 95 శాతం మనుషులే ప్రధాన కారణం. బొగ్గు, పెట్రోలియం నాచురల్ గ్యాస్ వినియోగించడం వలన గ్రీన్ హౌస్ వాయువులు చెలరేగుతున్నాయి. కార్బన్ డయాక్సైడ్ గ్రహించే అడవులు క్రమేణా మాయం అవుతున్నాయి. భూతాపం పెరగడం వలన మానవాళికి ముప్పు తప్పదేమో! ఎలక్ట్రానిక్ వాహనాలు సోలార్ విద్యుత్ ఎందుకు ఉపయోగించడం లేదు. ప్లాస్టిక్ ఉత్పత్తి ఎందుకు నిషేధించడం లేదు. భవన ఆక్రమణ నిర్మాణాలకు హద్దుపద్దు ఉందా? కాలుష్యానికి కళ్ళెం ఎందుకు వెయ్యడం లేదు? మరో కోణంలో చూస్తే భారత దేశం ఆకలి చావుల సూచికలో 123 దేశాలలో మనది 102 స్థానంలోకి చేరింది. అభివృద్ధి అంటే ఇదేనా! పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్లు మోడీ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని సోషల్ మీడియా కోడై కూస్తుంది ఇంకో వైపు పంటలు పండించే రైతులు అప్పులతో ఆత్మ హత్యలు చేసుకొంటున్నారు. విజ్ఞాన స్పృహ తో శాస్త్రీయంగా అభివృద్ధి చెందాల్సిన దేశం మూఢనమ్మకాలకు పట్టుకొని గబ్బిలం లా వేళ్లాడుతుంది. బాబాలు, అఘోరాలు, పీఠాధిపతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నారు. కాని కొత్త కొత్త ఆవిష్కరణలు లేవు. పరిశోధనలు అంత కన్నా లేవు.

కుంభమేళాలో నిండా మునిగి నీరు కలుషితం చేస్తున్నారు.. తొక్కిసలాటలో భక్తి నలిగి అభిమానం పెరిగి అతి పిన్న వయసులో నిండు ప్రాణాలు కోల్పోతున్నారు.

సినిమా, క్రికెట్ క్రేజీతో యువత జీవితాలు పాడు చేసుకొంటున్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్ లో మెడికల్ మాఫియా దారుణాలు కల్తీ ఆహారాలు కలవర పెడుతున్నాయి. బాలకార్మికులకు దిక్కులేదు. చట్టాలు ఎగ్జిబిషన్లో పెట్టిన అందమైన బొమ్మలుగానే నిలిచిపోయాయి. ధర్మ స్థల పుణ్య క్షేత్రాలలో భక్తులు అదృశ్యమై అసహజ మరణాల మిస్టరీ ఇంకా ఎందుకు తేలలేదు? అందుకే అన్నారు అరుణ్ ప్రకాష్ నావికా దళ మాజీ చీఫ్ 'ఓ పక్క చైనా,జపాన్, టెక్నాలజీలో కృత్రిమ యంత్ర రంగాలలో పోటీపడి ఎదుగుతూ ఉంటే మనం మాత్రం గుళ్ళు గోపురాలు, మక్కాలు , మసీదులు, చర్చ్‌లు, గురుద్వారాలు అంటూ కాలాన్ని వృథా చేస్తున్నాం'. ఇది నిప్పులాంటి నిజం కాదా !

ఏది ఏమైనా ప్రజాస్వామ్యం చిగురేసి మొగ్గేసి ప్రజా సంక్షేమం పరిమళించాలి. కుల మతాలకు ప్రాంతాలకు భాషలకు అతీతంగా సుపరిపాలన ఉండాలి. పౌరులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని నీతి నిజాయితీ గల సమర్థవంత మైన నాయకుడిని ఎన్నుకోవాలి. శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకొని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలి దేశాభివృద్ధికి యువతరం గుండె కాయలాంటిది. ఐక్యతతో అందరం కలసి అసలైన అభివృద్ధి దిశగా నడుం బిగిద్దాం రండి.

**- పూసాల సత్యనారాయణ**
9000792400

# సత్కర్మలకు పురుశోత్తమ మాసం

అధిక మాసము చంద్ర మానము ద్వారానే వస్తుంది. చాంద్ర మానం అంటే చంద్ర కళలను (తిథులను) ఆధారంగా ఒక నెల రోజులను లెక్కించడము. సూర్యుడు ఏడాదిలో 12 రాశుల చక్రాన్ని పూర్తి చేస్తే చంద్రుడు రోజుకు ఒక నక్షత్రం చొప్పున నెలకు 27 నక్షత్రాల దగ్గరే వుంటాడు. సూర్యుడి చుట్టు భూమి తిరగడానికి 365 రోజులా, 6 గంటలు, 11 నిముషాలు 31 సెకెండ్లు. పడుతుంది. చంద్రునికైతే 324 రోజులే పడుతుంది. వీరిద్దరి మధ్య సుమారు 41 రోజులు తేడా ఉంది. ఈ వ్యత్యాసం వల్ల భూమి సూర్యుని చుట్టు 19 సార్లు తిరిగితే చంద్రుడు 235 సార్లు తిరుగుతున్నాడు. దాని వలన 19 సంవత్సరాలకు..... ఏడాదికి 12 మాసాల చొప్పున 228 మాసాలు రావలసి వుండగా 235 వస్తున్నాయి. అనగా చంద్రుడు 7 నెలలు అధికంగా తిరుగు తున్నాడని అర్థం. ఆ లెక్కన ప్రతి ముప్పై రెండున్నర సౌర మాసాలకు ఒక చంద్ర మాసం అధికంగా.. వస్తుంది. ఈ విషయాన్ని మొట్ట మొదట గ్రహించిన వారు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులే. మూడు సంవత్సరాలకు ఒకసారి సూర్య చంద్రుల గతిలో కలిగే ఒక నెల భేదాన్ని సరిపెట్టడానికి పంచాంగ కర్తలు ఒక చంద్రుని మాసం అధికంగా కలపడం జరుగుతున్నది. చాంద్రమానం ప్రకారం సూర్యుడు ఒక రాశినుండి మరో రాశికి చేరే సమయం 29 రోజుల 12 గంటల 44 నిమిషాలు. అంటే సంవత్సరానికి ఈ లెక్కన 354 రోజులు 9 గంటల సమయం అవుతుంది. అంటే 365 రోజులకు దాదాపు 11 రోజులు తక్కువ. అందుకే ఈ వ్యత్యాసాన్ని సమం చేయడానికి మూడు సంవత్సరాలకు ఒక శూన్య మాసం ఏర్పడుతుంది.

దీనికి అధిక మాసం పురుషోత్తమ మాసం, మలమాసం అని కూడా అంటారు. సూర్య సంక్రాంతి లేకుండా పోయిన చాంద్ర మాసానికి అధిక మాసం అని పేరు పెట్టారు. సాధారణంగా ఒక నెలను కొలవటానికి చంద్రుడు భూమి చుట్టూ తిరగడాన్ని ప్రమాణంగా తీసుకుంటూ వుంటాం. భూమి చుట్టూ చంద్రుడు ఒక్కసారి తిరిగితే అది నెల కింద లెక్క దానినే చాంద్ర మానం అని కూడా అంటారు. సూర్యుడు 12 రాశులలో ఒక్కో రాశిలో ఒక్కో నెల సంచరించడాన్ని సౌరమానం అంటాం. సూర్యుడు ఒక రాశిలో నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని రాశి సంక్రమణం అంటారు. చాంద్రమాన మాసం సౌరమాన మాసం కన్నా చిన్నది. కనుక ఒక్కొక్కప్పుడు ఒక చాంద్ర మాన మాసంలో సౌర మాసం ఆరంభం కావడం జరగకుండా పోతుంది. అటువంటప్పుడు ఇలా



అధికంగా వచ్చే అధిక మాసం శుభకార్యాలకు, ముఖ్యమైన దైవ కార్యా లకు పనికి రాదని నిషేధించారు. అధిక మాసము ఎప్పుడూ చైత్ర మాసము నుండి ఆశ్వయుజ మాసము మధ్య లోనే వస్తుంది. ఒక సారి అధిక మాసము వచ్చాక తిరిగి 28 నెలలకు మరోసారి వస్తుంది. ఆ తర్వాత 34, 35, 28 నెలలకు వస్తుంది. అధిక మాసం ముందు వచ్చి ఆ తర్వాత నిజ మాసం వస్తుంది. ఈ అధిక మాసాన్ని మైల మాసం అని అంటారు. అనగా ఈ అధిక మాసంలో ఎలాంటి శుభ కార్యాలు చేయ కూడదు. పండుగలు ఇతర శుభ కార్యాలు అధిక మాసంలో చేయక పోవడం అనాదిగా ఆచరిస్తున్న సంప్రదాయం.

విశేషించి సర్వ సంపద సమృద్ధి, అనేక జన్మలలో చేసిన పాప నాశనానికి ప్రీతికై సూర్య నారాయణుని అర్చించడం సదాచారం. పురాణాది పఠనాలు, రాత్రి ఏకభుక్తం లేదా పగలు ఏకభుక్తం, ఉపవాసం, మౌన వ్రతం, అఖండ దీపారాధన తదితర సత్కర్మలు ఆచరించడం పరిపాటి. మే 17నుండి జూన్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు పాటించగల పురుషోత్తమ (శూన్య లేదా మల) మాసం మంగళ వారం ప్రారంభం అయింది.

మాసం అధికంగా రావడం జరిగింది. దీని మాసాధిపతి శ్రీమహా విష్ణువు కనుక పురుషోత్తమ మాసమని పేరు. ఇది సూర్య సంక్రాంతి రహిత మాసం. సౌరమాస పరిధిలో చాంద్రమాసం ఇమిడినపుడు అది అధికమాసం అని అర్థమవుతున్నది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# కేరళలో ప్రజాభిప్రాయం గెలిచింది!



కేరళ రాజకీయ చరిత్రలో మే 14 ఒక అసాధారణమైన రోజుగా నిలిచిపోతుంది. ఇది కేవలం ఒక కొత్త ప్రభుత్వం కొలువుదీరడమో లేదా ఒక ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయడమో మాత్రమే కాదు. దశాబ్దాల కాలంగా భారతీయ రాజకీయ పార్టీలను పట్టి పీడిస్తున్న 'అధిష్టాన సంస్కృతి'పై సామాన్య ఓటరు సాధించిన నైతిక విజయం. వి.డి. సతీశన్‌ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయక తప్పని పరిస్థితిని కల్పించడం ద్వారా, ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన నిర్ణేతలని కేరళ సమాజం మరోసారి చాటిచెప్పింది. ఢిల్లీలోని ఏకస్వామ్య పద్ధతులకు, ఏసీ గదుల్లో తీసుకునే నిర్ణయాలకు కాలం చెల్లిందని, క్షేత్రస్థాయి వాస్తవాలే అంతిమమని ఈ పరిణామం నిరూపించింది.

ఈ రాజకీయ యుద్ధం వెనుక ఉన్న నేపథ్యాన్ని పరిశీలిస్తే, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ సాధించిన విజయం సామాన్యమైనది కాదు. గత పదేళ్ల కాలంగా అధికారానికి దూరమై, తీవ్ర నిరాశలో ఉన్న పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపి, ఎల్డీఎఫ్ కోటను బద్దలు కొట్టడంలో సతీశన్ పాత్ర అసాధారణమైంది. 140 స్థానాలకు 102 స్థానాలను కైవసం చేసుకోవడం, అందులో కాంగ్రెస్ సొంతంగా 63 స్థానాలు సాధించడం వెనుక సతీశన్ నాయ కత్వ పటిమ ఉంది. కానీ ఫలితాలు వెలువడిన తర్వాత కాంగ్రెస్ హైకమాండ్ వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. ఎన్నికల రణరంగంలో నేరుగా తలపడకుండా, తెరవెనుక రాజకీయాలు చేసే కె.సి. వేణుగోపాల్ వంటి వారిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని చూడటం అధిష్టానం చేసిన అతిపెద్ద పొరపాటు. ఇది కేరళ ప్రజల తీర్పును అవమానించడమే.

అయితే, కేరళ ఓటరు అత్యంత చైతన్యవంతుడు. అక్కడ అక్షరాస్యతతో పాటు రాజకీయ విశ్లేషణా సామర్థ్యం కూడా ఎక్కువే. ఎవరి ముఖాన్ని చూసి ప్రజలు ఓటు వేశారో, వారికే అధికారం దక్కాలన్న కనీస ప్రజాస్వామ్య సూత్రాన్ని హైకమాండ్ విస్మరించడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఇది సతీశన్ వ్యక్తిగత విజయం కాదు. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం కోసం జరిగిన ఒక గొప్ప మలుపు. గతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇటువంటి తప్పులే చేసి అధికారానికి దూరమైన చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. ఆ చేదు అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని, చివరి నిమిషంలోనైనా ప్రజాభిప్రాయానికి తలొగ్గడం ఆ పార్టీకి భవిష్యత్తులో మేలు చేసే పరిణామం.

61 ఏళ్ల వి.డి. సతీశన్ రాజకీయ ప్రస్థానం గమనిస్తే, ఆయన ఎటువంటి వారసత్వ రాజకీయాల అండ లేకుండా ఎదిగిన నాయకుడని అర్థమవుతుంది. స్వాతంత్ర్యానంతర కేరళలో జన్మించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన ప్రభుత్వంపై చేసిన వాదనలు, సంధించిన ప్రశ్నలు కేరళ ప్రజల మనసు గెలుచుకున్నాయి. మేధోపరమైన చర్చలకు ప్రాధాన్యతనిచ్చే కేరళ సమాజానికి, సతీశన్ వంటి లోతైన అవగాహన ఉన్న నాయకుడు సరిగ్గా సరిపోతారని ప్రజలు బలంగా నమ్మారు. అందుకే ఢిల్లీ నాయకత్వం 'పారాచూట్' నాయకుడిని రుద్దాలని చూసినప్పుడు ప్రజలు అంతగా స్పందించారు.

కానీ, అధికారం దక్కించుకోవడం ఎంత కష్టమో, దాన్ని నిలబెట్టుకోవడం అంతకంటే కష్టం. సతీశన్ ముందున్న సవాళ్లు హిమాలయాలంత ఎత్తులో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా ఉంది. భారీ అప్పుల ఊబిలో ఉన్న కేరళను గట్టెక్కించడం ఆయనకు మొదటి సవాలు. ఒకవైపు మేనిఫెస్టోలో ఇచ్చిన 'ఇందిర గ్యారెంటీలను' అమలు చేయాలంటే అపారమైన నిధులు కావాలి, మరోవైపు సంక్షేమ పథకాల కోసం వెచ్చించే ఖర్చును తగ్గించలేము. ఆదాయ వనరులను పెంచుకోవడానికి వినూత్న మార్గాలను అన్వేషించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధుల కోసం గట్టిగా పోరాడాల్సి ఉంటుంది. అభివృద్ధి మరియు సంక్షేమం మధ్య సమతుల్యతను సాధించడంలోనే సతీశన్ పాలనా దక్షత బయట పడుతుంది.

రాజకీయంగా కూడా ఆయనకు కత్తిమీద సామే ఎదురవుతోంది. ఓటమి పాలైన వామపక్షాలు ప్రస్తుతం తమ గాయాలను మాన్పుకుంటున్నప్పటికీ, అవి చాలా బలమైన శక్తి. ముఖ్యంగా ఉత్తర కేరళలో ఉన్న వారి కోటలను కాపాడుకుంటూనే, ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కోవాలి. మరోవైపు, కేరళలో ఇప్పుడిప్పుడే పాగా వేస్తున్న బీజేపీ, ఈసారి మూడు స్థానాలను గెలుచుకోవడంతో పాటు ఆరు చోట్ల రెండో స్థానంలో నిలిచి తన ఉనికిని చాటుకుంది. ఇది కాంగ్రెస్‌కు ఒక హెచ్చరిక. వీటన్నింటికీ మించి, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత పోరు సతీశన్‌కు నిద్రలేకుండా చేయవచ్చు. పదవుల పంపకంలో అసంతృప్తులు సహజం, కానీ వాటిని సమర్థవంతంగా చక్కదిద్దుకుంటూ, అందరినీ కలుపుకుంటూ సామూహిక నాయకత్వంతో ముందుకు వెళ్లడం ఆయనకు అనివార్యం.

చివరగా చెప్పాలంటే, కేరళలోని ఈ మార్పు భారత రాజకీయ వ్యవస్థ మొత్తానికి ఒక పాఠం లాంటిది. కేవలం హైకమాండ్ ఆశీస్సులు ఉంటే సరిపోదని, ప్రజల ఆశీర్వాదం ఉంటేనే పీఠం దక్కుతుందని ఈ పరిణామం రుజువు చేసింది. 'ఢిల్లీ ఆదేశం' అనే పద్ధతికి కాలం చెల్లిందని, ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవించినప్పుడే జాతీయ పార్టీలు మనుగడ సాగించగలవని సతీశన్ ఎంపిక స్పష్టం చేసింది. మేధస్సు, అనుభవం మరియు ప్రజాకర్షణ కలిగిన సతీశన్, కేరళను అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. కేరళ రాజకీయాల్లో ఒక నూతన శకానికి నాంది కావాలి. ప్రజాస్వామ్యంలో ఓటరే దేవుడని నమ్మి, వారి ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఈ గెలుపునకు సార్థకత లభిస్తుంది. ఈ అధికారం, కేరళ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆశిద్దాం.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# అంతరాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా

- కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కట్టుదిట్టం
- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్, మే 16(మనం బ్యూరో)ః ఇటీవల కాలంలో అంతరాష్ట్ర సాయుధ ముఠాలు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యంత కట్టుదిట్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పీఎంజే జ్యువెలర్స్ లో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, కమిషనరేట్ పరిధిలోని అన్ని వ్యాపార, ఆర్థిక సంస్థల యాజమాన్యాలు, సెక్యూరిటీ ఏజెన్సీలు కింది రక్షణ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సంస్థల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, లాకర్ రూములు కవర్ అయ్యేలా హై-రిజల్యూషన్ నైట్ విజన్ సీసీటీవీ కెమెరాలను నిరంతర విద్యుత్ బ్యాకప్తో ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. సమీప పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూమ్లకు అనుసంధానించబడిన బర్గర్ అలారాలు, పానిక్ బటన్లను అమర్చడంతో పాటు, గుర్తింపు పొందిన శిక్షణ కలిగిన సెక్యూరిటీ గార్డులను (వీలైనంత వరకు సాయుధ సిబ్బందిని) నియమించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, లోపలి ప్రాంగణంలోకి అనవసరమైన వ్యక్తుల రాకపోకలను నియంత్రించాలని, నగదు లేదా బంగారం రవాణా సమయాల్లో తీవ్ర గోప్యత పాటించాలని, సంస్థల్లో పనిచేసే రెగ్యులర్, తాత్కాలిక సిబ్బందికి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించి అనవసరంగా లోపలికి వచ్చే వారి పట్ల, పరిసరాల్లో రెక్కీ నిర్వహిస్తున్నట్లు అనుమానం వచ్చే వారి పట్ల యాజమాన్యాలు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సాయుధ నేరగాళ్లను నేరుగా ఎదుర్కొని ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా, కస్టమర్ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మరోవైపు, అంతరాష్ట్ర ముఠాల కదలికలను అణచివేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన నిఘా చర్యలు చేపట్టినట్లు సీపీ వివరించారు. వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, ఏటీఎం పరిసరాల్లో బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల ద్వారా 24 గంటల నిరంతర పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. నగర ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, జాతీయ రహదారులపై ఆకస్మిక నాకాబందీలు, ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరాష్ట్ర ముఠాలు, చోరీ సొత్తును కొనుగోలు చేసేవారిపై నిఘా ఉంచేందుకు స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్, లోకల్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారని, పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల పోలీస్ ఏజెన్సీలతో నిరంతరం సమాచారాన్ని పంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, అద్దె ఇళ్లు మరియు కొత్తగా వలస వచ్చిన అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి ముమ్మరంగా తనిఖీలు (వెరిఫికేషన్ డ్రైవ్స్) చేస్తున్నామని, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక సాంకేతిక నిఘా ఉంచామని తెలిపారు. అంతరాష్ట్ర వ్యవస్థీకృత నేరాలను సమర్థవంతంగా అడ్డుకోవడంలో ప్రజల, వ్యాపారుల సహకారం ఎంతో కీలకమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా, గుర్తుతెలియని వ్యక్తులు నిఘా వేసినట్లు గమనించినా, లేదా అనుమానాస్పద వాహనాలు నిలిపి ఉంచినా వెంటనే పోలీసులకు లేదా 'డయల్ 100/112' కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ఆస్తుల రక్షణకు కరీంనగర్ పోలీస్ యంత్రాంగం పూర్తి అంకితభావంతో పనిచేస్తుందని సీపీ స్పష్టం చేశారు.

## క్రీడా పోటీల్లో కరీంనగర్ ఏఎస్సై 'పల్లి ఉమారాణి'కి కాంస్య పతకం

- అభినందించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్ మే 16 మనం బ్యూరో)ః ఉత్తరప్రదేశ్లోని లక్నోలో ఘనంగా నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో (ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్) కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉమెన్ ఏఎస్సై పల్లి ఉమారాణి అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈ నెల 09 నుండి 13 వరకు లక్నోలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలలో, ఉమారాణి ఉమెన్ డబుల్స్ 50 ఏళ్ళ వయసు విభాగంలో తెలంగాణ పోలీస్ శాఖ తరపున ప్రాతినిధ్యం వహించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్ర పోలీస్ శాఖకు ఆమె మంచి పేరు తీసుకువచ్చారు. పోటీలు ముగించుకొని నగరానికి చేరుకున్న ఏఎస్సై పల్లి ఉమారాణి శనివారం కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన కాంస్య పతకాన్ని, సర్టిఫికేట్ను సీపీకి చూపించారు. ఉమారాణి ప్రతిభను సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. 50 ఏళ్ల వయసులోనూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లో ఈ స్థాయి ప్రతిభ కనబరచడం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొని ఉమారాణికి అభినందనలు తెలిపారు.

## ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం వేస్తారా..?



- మోడీకి కార్పొరేట్లపై ఉన్న ప్రేమ పేదలపై లేదు
- సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి

కరీంనగర్, మే 16 మనం బ్యూరో)ః కేంద్రంలో అధికారం ఉంది కదా అని బిజెపి ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతుందని,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కార్పొరేట్ల పై ఉన్న ప్రేమ పేద ప్రజలపై లేదని సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఆరోపించారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కమాన్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగిందని సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓడ ఎక్కేదాక ఓడ మల్లయ్య ఓడ దిగినాక బోడ మల్లయ్య అనే చందంగా నరేంద్ర మోడీ వ్యవహారం ఉందని,ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రం వంటగ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం వేసిందని,గతంలో వాణిజ్య గ్యాస్ ధర పెంచడంతో టీస్టాల్, టిఫిన్ సెంటర్ లలో ధరలు పెంచారని, పేదలు కనీసం బయట టిఫిన్ చేయడానికి కూడా భయపడుతున్నారని అన్నారు. గత కొంత కాలం క్రితం అమెరికా,ఇజ్రాయిల్ ఏకమై ఇరాన్ పై బాంబుల దాడులు చేయడం వల్ల అంతర్జాతీయంగా చమురు కొరత ఏర్పడే అవకాశం ఉందని విస్తృత ప్రచారం జరిగినా కేంద్రం మాత్రం అలాంటి పరిస్థులు లేవని ప్రజలను నమ్మబలికారని,అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ తగ్గినప్పుడు కూడా దేశంలో మోడీ ప్రభుత్వం చమురు ధరలు తగ్గించలేదని,పైగా ఇందన వాడకం తగ్గించాలని మోడీ ఉచిత సలహాలు ప్రజలకు ఇస్తున్నాడని అన్నారు. ధరల పెరగడం మూలంగా నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని, వాటితో పాటు అన్ని రంగాలపై ప్రభావం పడి పేద,మధ్యతరగతి,సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయే అవకాశాలు ఉన్నాయని,ప్రజలపై భారం వేయడానికి పూనుకున్న కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,టేకు మల్ల సమ్మయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,కొట్టె అంజలి,బామండ్ల పెల్లి యుగేందర్,బూడిద సదాశివ,నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం,బాకం ఆంజనేయులు,చెంచల మురళి,నూనావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు



- గోవుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 6 చెక్పోస్టుల ఏర్పాటు
- హిందూ మత సంఘాల ప్రతినిధులతో సమీక్షా
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్, మే 16 (మనం బ్యూరో)ః రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ , బజరంగ్ దళ్, గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా, తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించకూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం, 1977 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా నిషేధించినట్లు సీపీ తెలిపారు. పశువుల రవాణాకు సంబంధించి నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్లు జారీచేసే 'ఫిట్ ఫర్ ట్రాన్స్పోర్ట్' పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్పోస్టులు, 52 అంతర్రాష్ట్ర చెక్పోస్టులు పనిచేస్తున్నాయని.. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.చెక్పోస్టుల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సరిపడా పోలీసు సిబ్బందిని కేటాయించామని, రానున్న రెండు వారాల పాటు నిరంతరం మరింత పటిష్ట భద్రతను కొనసాగిస్తామని సీపీ తెలిపారు. చెక్పోస్టుల వద్ద అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు.చట్టాన్ని ఉల్లంఘించి పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన వాహనాలను కూడా సీజ్ చేస్తామని సీపీ హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యతని, అందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, హిందూ సంఘాల పెద్దలు ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివగంగా ఎత్తిపోతల పథకాన్ని మరమ్మత్తులు చేయాలి



- రైతులకు సాగునీరుఅందించాలి
- ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

మంగపేట ,మే 16,, మనం ప్రతినిధిః ములుగు జిల్లా మంగపేట మండలం కత్తి గూడెం గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున నిర్మించిన శివగంగ ఎత్తిపోతల పథకం కింద నిర్మించబడిన ఇంటెక్ వెల్ ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు రైతులతో పాటు సందర్శించి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయడం జరిగినది కానీ ఇప్పుడు నిరుపయోగంగా ఉన్న శివగంగ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే మరమ్మత్తులు చేసి మరియు గోదావరిలో ఉన్న ఇసుకమేటలను తొలగించి నీళ్లు వచ్చే విధంగా చేసి ఇక్కడ ఉన్న 1500 ఎకరాల రైతులకు నీరు అందించాలని గౌరవ మంత్రి సీతక్క గారికి తెలియజేస్తున్నాను. వెంటనే శివగంగ ఎత్తిపోతల పథకాన్ని రిపేరు చేసి ఇక్కడ సాగు చేస్తున్న 1500 ఎకరాల రైతులకు సాగునీరు అందించాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు. గతబిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతుల అభ్యర్థన మేరకు కేసిఆర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎన్నికలు వచ్చినా సందర్భంగా ఆ పని జరగకుండా ఆగిపోయిందని లక్ష్మణ్ బాబు తెలియజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం శివగంగా ఎత్తిపోతల ఇంటెక్ వెల్ నిరుపయోగంగా పడి ఉన్న కారణంగా వెంటనే మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మరియు శివగంగ ఎత్తిపోతల పథకం కోసం సబ్ స్టేషన్ నిర్మాణాన్ని కూడా పునరుద్ధించాలని కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులతో పాటుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణయ్య తుమ్మ మల్లారెడ్డి ఎడ్లపల్లి నరసింహారావు ఎండి వలీ బాబా కూనూరి అశోక్ కాకులమర్రి ప్రదీప్ రావు బాడిషా నాగ రమేష్ చిట్టి మల్ల సమ్మయ్య కొమరం రామ్మూర్తి సిద్ధంశెట్టి లక్ష్మణరావు తుక్కాని శ్రీనివాస్ యలవర్తి శ్రీనివాసరావు కర్రి శ్రీను సుదర్శన్ సంతోష్ హుస్సేన్ తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలి
- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్, మే 16(మనం బ్యూరో)ః విద్యార్థులు చదువుతోపాటు విభిన్న రంగాల్లో రాణించాలని, భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో సాంస్కృతిక వారసత్వానికి కళలకు నిలయమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని తెలిపారు.

**విద్యార్థుల అభివృద్ధికి ఎన్నో వినూత్న ఏర్పాట్లు**

అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆర్ట్ క్రాఫ్ట్ మేళా వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రాయింగ్ కాంపిటీషన్, కళా ఉత్సవ్ వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారని పేర్కొన్నారు. విభిన్న రంగాల్లో అనేక శిక్షణలు ఇప్పించామని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా పలు కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆర్ట్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. జవహర్ బాల భవన్, కస్తూరిబా పాఠశాలలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్లు డి.శ్రీనివాస్, అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఉమారాణి, జవహర్ బాల భవన్ సిబ్బంది మంజుల, శ్రీధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పేదలకో న్యాయం...పెద్దలకో న్యాయమా..!?

**బండి భగీరథపై టీజేఎస్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అరికిల్ల స్రవంతి,ముత్తు గీతాంజలి**




హైదరాబాద్,మే 16(మనం న్యూస్)ః మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బండి భగీరథ్ను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ జన సమితి మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ పార్టీ మహిళా జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అరికిల్ల స్రవంతి, ముత్తు గీతాంజలి సంయుక్తంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్కు అధికారిక లేఖను సమర్పించారు. పోక్సో కేసు నమోదైనా అరెస్ట్ చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. గత కొంతకాలంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడైన బండి భగీరథ్ ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ ఘటనపై ఇప్పటికే 'పోక్సో' చట్టం కింద కేసు నమోదైనప్పటికీ, నేటికీ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడంపై టీజేఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.'రాజ్యాంగ చట్టం ప్రకారం నిందితుడు ఏ స్థాయి వ్యక్తి అయినా అందరూ సమానమే. కానీ ఇక్కడ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో నిందితుడి ఆచూకీ కనుగొనే ప్రయత్నం కూడా జరగడం లేదని వారు తీవ్రంగా దుయ్యబట్టారు. లేదు.అదే సామాన్యులైతే నిందితుడు దొరికే వరకు వారి కుటుంబ సభ్యులను వేధిస్తారు.' అని లేఖలో మండిపడ్డారు.వివిధ కారణాల పేరుతో కోర్టులు కూడా విచక్షణతో వ్యవహరిస్తున్నాయని, నిందితుడి అరెస్టు ఆలస్యమైతే బాధిత మైనర్ బాలికకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు నిందితుడికి ఉన్న రాజకీయ పలుకుబడి, అధికార అండదండలతో దర్యాప్తు వ్యవస్థలను తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉందని వారు లేఖలో ఆరోపించారు.అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బండి కుమారుడిని ఆలస్యం చేయకుండా వెంటనే అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆ కుటుంబానికి అండగా నిలిచేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి పార్టీ మహిళా విభాగం తరపున రాష్ట్ర మహిళా కమిషన్ను కోరారు.

## మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి
- అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం




కరీంనగర్ మే 16 (మనం బ్యూరో)ః కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్య సాధన దిశగా సమన్వయంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మ్యాపింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దశను ప్రణాళి కాబద్ధంగా అమలు చేస్తూ ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, ఫీల్ స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం కరీంనగర్లోని పద్మనగర్, ఆరేపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనుల పురోగతి, మౌలిక సదుపాయాలు, పెండింగ్ అంశాలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఇండ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యుత్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనుల పూర్తి చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమయపాలనతో ముందుకెళ్లాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ తహసీల్దారులు లక్ష్మీ నరసింహారావు, నరేందర్ వెంకటలక్ష్మి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్లకు స్థలం కేటాయింపు జి.వో. జారీ

- ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



జగిత్యాల మే 16(మనం న్యూస్)ః జగిత్యాల జిల్లా చల్గల్ కు మంజూరైన కేంద్రీయ విద్యాలయనికి 2 ఎకరాల స్థలం,మరియు గౌరవ ముఖ్యమంత్రి గారు జిల్లా కు మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ కోసం 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. స్థలం కేటాయింపునకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు జిల్లా మరియు జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. చల్గల్ లో ఉన్న వాలంతరి అనేది అటానమస్ సంస్థ అని రైతుల కోసం ఏర్పాటు చేసింది అని, నేషనల్ హై వే కు దగ్గరగా ఉన్న చాలా విలువైన స్థలాన్ని కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్రంలో 65 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కాగా ,జగిత్యాలకు సైతం మంజూరు చేయాలని కోరగా రెండవ దశలో 8 మంజూరు చేస్తే జగిత్యాల కు సైతం మంజూరు చేయటం జరిగింది అని అన్నారు.బీజేపీ నాయకులు కావాలని కేంద్రీయ విద్యాలయం స్థలం ను రాజకీయం గా వాడుకోవాలని చూస్తున్నారు.., విద్య సంస్థల స్థలాల విషయం లో వేరే చోట్ల ప్రజలకు అందుబాటులో స్థలాలను గుర్తించడం జరిగింది. నాకు చల్గల్ లో ఏర్పాటు చేయాలని మొదటి నుండి చిత్తశుద్ధి తో ఉన్న. నేషనల్ హై వే కు దగ్గర లో ఉంది., నేడు 12 ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించడం జరిగింది.జి వో కూడా రావడం జరిగింది. బీజేపీ నాయకులు వారి భాష యాస ను ప్రజలు గమనిస్తున్నారు.నేను అలా మాట్లాడదలచుకోలేదు.. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే నా తాపత్రయం, ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రీయ విద్యాలయం సంస్థ కు జిల్లా కలెక్టర్ గారితో లెటర్ కూడా ఇప్పిస్తా వారికి స్థలం పొజిషన్ ఇస్తారు అని అన్నారు., 10 ఎకరాలు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం యం డీ గణపతి రెడ్డి గారికి కూడా స్థలం పొజిషన్ ఇస్తాం.. పాఠశాలల ఆట స్థలం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి తన వంతుగా కృషి చేస్తామని అన్నారు. విద్య సంస్థల విషయం లో అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ కోణంలో చూడవద్దని,విద్యార్థుల కు నాణ్యమైన విద్య అందించే విధంగా ఆలోచన చేయాలని సూచించారు.

# యువతలో క్రీడాస్ఫూర్తి పెంపుకు ప్రత్యేక కార్యాచరణ

**18 నుంచి 23 వరకు జిల్లాలో 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాలు**

**యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపే లక్ష్యం**

**యువత, ఎన్జీఓలు, యూత్ క్లబ్బులు, క్రీడ సంఘాలు భారీగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపు**

**మే 18న ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ పేరిట 2కే, 5కే రన్స్ నిర్వహణ**

**మే 21న ఇందిరాగాంధీ స్టేడియంలో ఘనంగా 'స్పోర్ట్స్ డే' నిర్వహణ**

**కామారెడ్డి, బాన్సువాడ స్టేడియాల్లో స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణ**



**కామారెడ్డి, మే 16 (మనం జిల్లా ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువతలో క్రీడలపై ఆసక్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యతాభావం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18 నుంచి 23 వరకు జిల్లావ్యాప్తంగా 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆరు రోజుల పాటు మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో యువత, ఎన్జీఓలు, యూత్ క్లబ్బులు, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**మే 19న జిల్లా స్థాయిలో కెరీర్ మార్గదర్శకత్వం.**

మొదటి రోజు అయిన మే 18న ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ పేరుతో జిల్లా, మండల స్థాయిల్లో 2కే మరియు 5కే రన్స్ నిర్వహించనున్నారు. కామారెడ్డిలో 2కే రన్ జడ్పీహెచ్ఎస్ (బి) హైస్కూల్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగనుంది. మే 19న జిల్లా స్థాయిలో కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. మే 20న యువతలో నాయకత్వ లక్షణాల పెంపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలు కూడా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనే జరుగనున్నాయి.

**మే 23న ఉద్యోగ సాధన, ఉపాధిపై కార్యక్రమాలు.**

మే 21న జిల్లాస్థాయిలో 'స్పోర్ట్స్ డే'ను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలు, క్రీడా ప్రదర్శనలు చేపట్టనున్నారు. మే 22న స్వచ్ఛ తెలంగాణ లక్ష్యంగా యువతను సంసిద్ధం చేస్తూ శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియం, బాన్సువాడలోని ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్టేడియంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టనున్నారు. చివరి రోజు మే 23న జిల్లాస్థాయిలో ఉద్యోగ సాధన కార్యక్రమాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా యువత సమగ్రాభివృద్ధి కోసం ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# సిద్ధిపేట జిల్లాలో ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



- **సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్**

**గజ్వేల్ మే 16 మనం న్యూస్:** ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్ను దృష్టిలో ఉంచుకుని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేందుకు సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు.ఈ ఏర్పాట్లలో భాగంగా శనివారం నాడు ఐకేపీ మరియు ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ, గుర్తించిన అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ధాన్యం అన్లోడింగ్ జరుగుతున్న రైస్ మిల్లులను కూడా పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటుమన్నారు. సున్నితమైన మరియు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్లోడింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలు మరియు రవాణా మార్గాల వద్ద పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ట్రాఫిక్ రద్దీ, వివాదాలు మరియు రవాణాలో జాప్యాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. సమర్థవంతమైన భద్రతా అమలుకు రెవెన్యూ, సివిల్ సప్లైస్ మరియు ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు సూచించారు.సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ జిల్లా వ్యాప్తంగా పలు కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాలు మరియు రైస్ మిల్లులను స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని, రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


# అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

- **అమెరికన్ సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలు తాకట్టుపెట్టిన మోడీ**
- **అంబానీ, అదానీల కోసమే ప్రజలపై బారాలు**
- **పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్**



సంగారెడ్డి, మే 16 మనం ప్రతినిధి: ప్రపంచ దేశాలపై అమెరికన్ సామ్రాజ్యవాద దాడి పెరుగుతుందని, అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్ విమర్శించారు . శనివారం నాడు సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్ లో సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ తరగతుల ప్రారంభ సూచికంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పార్టీ జెండావిష్కరణ చేయడం జరిగింది . ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. దేశ సంపదనను అంబానీ అదానీలకు ఇస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై మాత్రం భారాలు మోపుతున్నారని విమర్శించారు.పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.మోడీ ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెట్టిందని అన్నారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో దేశానికి జరిగే ప్రయోజనం ఏమీ లేదన్నారు. పైగా ఆ ఒప్పందాల ప్రభావం దేశంలోని కార్మికులు, రైతులపై తీవ్రంగా ఉంటుందని తెలిపారు. అమెరికాతో చేసుకుంటున్న ట్రేడ్ ఒప్పందాల వివరాలను ఇప్పటివరకు పార్లమెంట్కు గానీ, దేశ ప్రజలకు గానీ తెలియజేయలేదని విమర్శించారు. ఈ చర్య దేశీయ పరిశ్రమలు, ఉపాధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల జీవనోపాధిపై దాడి జరుగుతుందని అన్నారు. ఈ ఒప్పందాలపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడం దేశాన్ని అవమానపరచడమే కాక ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హాని అని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని, మతాల మధ్య అగ్గి రాజేస్తూ వాటి మధ్యలో కూర్చొని చలికాచుకుంటుందన్నారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను దారిమల్లిస్తూ నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని వాపోయారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారతదేశ సంస్థలన్నింటినీ వారికి తాకట్టు పెడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందన్నారు. అమెరికా అధ్యక్షులు మన దేశ అంతర్గత విషయాల్లో పెత్తనం చేస్తూ ఉంటే నోరు ఎత్తడం చేతకాని ప్రభుత్వమని చెప్పారు. మోడీ ఓ పక్క మతోన్మాదాన్ని మరోపక్క కార్పొరేట్ వ్యక్తులను అడ్డుపెట్టుకొని దేశంలో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. దేశంలోని పార్లమెంట్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా తనకు అనుకూలమైన బిల్లులు పాస్ చేయించుకొని నియంతల పాలన సాగిస్తున్నదని అన్నారు. ధరల పెంపు తప్పా ప్రజా సంక్షేమ చర్యలేవి మోడీ తీసుకురాదన్నారు. బిజెపి విధానాలను వ్యతిరేకించడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. ఎర్ర జెండా ఆధ్వర్యానా ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఉపాధి హామీ చట్టాన్ని నేరుగార్చారని పేద కూలీల పొట్ట కొడుతున్నారని కూలీలను మభ్యపెట్టి రాముని పేరుతో భజన చేస్తున్నారని ఈ విషయంలో కాంగ్రెస్ సరైన తీరులో స్పందించకపోవడం శోచనీయమన్నారు. రైతాంగానికి ఉచిత విద్యుత్తు గృహాలకు పేదలకు దళిత గిరిజనులకు ఉచిత విద్యుత్తు రద్దు చేసేందుకే విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చారని ఇది రైతాంగం మనుగడకు ముప్పని అన్నారు. అను విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేటుపరం చేసి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకే శాంతి బిల్లు తెచ్చారని ఇది ప్రమాదకరమైన ది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, నాయకులు నాగేశ్వర్ రావు, యాదగిరి, కృష్ణ, విద్యా సాగర్, పాండు రంగారెడ్డి, పాల్గొన్నారు.

# బండి భగీరథ ఫోక్స్ కేసులో బాధితురాలి స్టేట్మెంట్ నమోదు




**మేడ్చల్, మే 16( మనం జిల్లా ప్రతినిధి):** మేడ్చల్ జిల్లా పరిధిలో సంచలనం సృష్టించిన బండి భగీరథ ఫోక్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది... ఈ కేసుకు సంబంధించి బాధితుల స్టేట్మెంట్ను మేడ్చల్ కోర్టు జడ్జి నమోదు చేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా సంబంధిత వ్యక్తులను కోర్టుకు హాజరుపరచగా, జడ్జి వారి వాంగ్మూలాలను వీడియో రికార్డు తో నమోదు చేసినట్లు తెలిసింది.. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు పలు కోణాల్లో విచారణ కొనసాగిస్తుండగా, తాజాగా కోర్టులో స్టేట్మెంట్ రికార్డు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది....కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు సీజన్ మొత్తం రైతులకు సురక్షిత వాతావరణం కల్పిస్తూ, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సిద్ధిపేట పోలీసులు కట్టుబడి ఉన్నారని కమిషనర్ తెలిపారు.

# యాసంగి మక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి



- **అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**

**కామారెడ్డి, మే 16 (మనం ప్రతినిధి):** జిల్లాలో యాసంగి 2025 - 26 సీజన్లో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో మక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి (డి సి ఓ), జిల్లా మార్కెటింగ్ అధికారి (డి ఎం ఓ), డి.ఎం. మార్క్ఫెడ్, వేర్హౌస్ మేనేజర్లు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (టి జి ఎస్ డబ్ల్యు సి) అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., మండలాల వారీగా మక్కజొన్న కొనుగోలు లక్ష్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారికి సూచించారు. సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మక్కజొన్నను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్కు సూచించారు. హమాలీల సంఖ్య పెంచి కొనుగోళ్లు వేగవంతం చేయాలి.అన్లోడింగ్ పాయింట్ల వద్ద కూడా హమాలీల సంఖ్యను పెంచి, వాహనాల అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లను గుర్తించి స్టోరేజ్ స్పేస్ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. లారీ రవాణా కాంట్రాక్టర్లు అవసరమైన మేరకు వాహనాలను సమకూర్చి మక్కజొన్న రవాణా నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను అదనపు కలెక్టర్, మార్క్ఫెడ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజలను పొదుపు చేయాలంటూ ధరల మంట పెడుతున్న మోడీ



- **పెట్రోల్ డీజిల్ గ్యాస్ . దరలు తగ్గించాలి**
- **సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య**

**గజ్వేల్, మే 16(మనంన్యూస్):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను పొదుపు చేయాలంటూనే బంగారం, గ్యాస్ పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గించాలంటూ ధరలు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. శనివారం నాడు స్థానిక సి ఐ టి యూ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ పెట్రోల్ పై మూడు రూపాయలు సిఎన్జి గ్యాస్ పై రెండు రూపాయలు, ఇటీవల కాలంలో వ్యాపార సిలిండర్ పై 1000 రూపాయలు పైగా పెంచి ప్రజల జేబుకు చిల్లు పెట్టడం జరిగిందని అన్నారు కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రైతులు, విదేశాల్లో పరిశ్రమ పెట్టిన దేశ డాలర్లను బయటకు పంపి ధనవంతులకు ఒక విధంగా పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు గత పది సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా, నిత్యవసర సరుకుల ధరలు అనేక రెట్లు పెంచి పేదలను మోసం చేస్తుందని అన్నారు. ప్రత్యామ్నాయంగా కార్పొరేట్ పన్నులు, సూపర్ ప్రాఫిట్ పన్నులు వేయకుండా ప్రత్యక్ష పన్నుల ద్వారా ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులు ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు భవిష్యత్తులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, పట్టణ నాయకులు ఎమ్ రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది



- **టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి మే 16 మనం న్యూస్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జరిగిన విద్యా వారోత్సవాలకు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల లో ఆన్లైన్ తరగతుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మానిటర్ లను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. భవిష్యత్తు పై స్పష్టమైన దృష్టి తో ఇప్పటినుండే కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, ప్రిన్సిపాల్ సునీత, లెక్చరర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# సిద్దిపేటను డెంగ్యూ రహిత జిల్లాగా మార్చుదాం



- **పరిశుభ్రత పాటించడమే ముందస్తు చర్యలు**
- **వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి**

సిద్దిపేట మే 16; మనం ప్రతినిధి : పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యాధి లక్షణాలను గుర్తించి వెంటనే వైద్య సేవలను పొందడం వల్ల డెంగ్యూను పూర్తిగా నివారించవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం ప్రజల్లో అవగాహన కల్పించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ముందస్తుగానే నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, పైలేరు వంటి వ్యాధుల నివారణ కోసం ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. సిద్దిపేట బస్తీ దావఖానా ప్రాంతంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ అనంతరం పలువురు వైద్య శాఖ అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి లక్షణాలను తొలి దశలోనే గుర్తించి నివారించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జ్వరం, చలి, వణుకు, ఒళ్ళు నొప్పులు, వాంతులు, అలసట లాంటి లక్షణాలు కనిపించగానే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, నవీన్ కుమార్, సోపాన్, చక్రధర్ తదితరులు సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

# యువజన,క్రీడా వారోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**
- **18 నుంచి 23 వరకు యువజన, క్రీడా వారోత్సవాలు**



రాజన్న సిరిసిల్ల, మే (మనం ప్రతినిధి ):ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18 నుంచి మే 23 వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన, క్రీడా వారోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం ఆయన సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ₹ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక₹ కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడా వారోత్సవాల నిర్వహణ, జిల్లా స్థాయి సభల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వ తేదీ వరకు ప్రతీ జిల్లాలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, క్రీడా పోటీలు, తదితర కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ నెల 22 వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభల నిర్వహణపై మార్గదర్శనం చేశారు. 2కె రన్, సాంస్కృతిక కార్యక్రమాలు, యువజన ఉపాధి అవకాశాలకు సంబంధించిన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అనంతరం జిల్లాలో యువజన, క్రీడా వారోత్సవాల నిర్వహణ, అలాగే ఈ నెల 22 వ తేదీన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ విజయవంతం చేసేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, ప్రణాళిక ప్రకారం మే 18వ తేదీన అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ఉదయం 6:30 గంటలకు 2 రన్ నిర్వహణ, మే 19 వ తేదీన ఐడిఓసీ లో కెరీర్ నైపుణ్యాభివృద్ధి నిర్వహించి, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వంపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 వ తేదీన సిరిసిల్ల లోని మినీ స్టేడియంలో క్రీడా దినోత్సవంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22 వ తేదీన ఉదయం వేములవాడలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హరిత హోటల్ సమీపంలోని పరిసరాలలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం చేపట్టనున్నట్లు, అనంతరం కరీంనగర్ లోని మ్యూజియం సందర్శన ఉంటుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఈ నెల 23వ తేదీన జాబ్ మేళా**

మే 23న సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి ₹ఉద్యోగ సాధన₹ పేరుతో జాబ్ మేళా నిర్వహించ నున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.22 వ తేదీన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించే సభకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమీక్షలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, యువజన, క్రీడా శాఖ అధికారి రాందాస్ పాల్గొన్నారు.

# మే 20న మెడికల్ షాపులు బంద్



మంగపేట, మే 16, మనం ప్రతినిధి: మంగపేట మండలం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 మే 2026న దేశవ్యాప్తంగా జరగనున్న బందు గురించి మండల తాసిల్దార్ రవీందర్ మరియు మంగపేట సెకండ్ ఎస్ఐ శ్రీకాంత్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆన్లైన్లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ మరియు దేశంలో నెలకొన్న పలు అంశాలపై నిరసనగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏఐఓసిడి) ఈ బందుకు పిలుపునిచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా మందుల దుకాణాలు మూతబడునున్నాయి. ఈ కార్యక్రమంలో మంగపేట మండలం మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, సెక్రటరీ సావుల సాంబశివరావు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఖమ్మం విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావాలి



## రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలి
## రోటరీ నగర్ విజయ డెయిరీకి మరమ్మతులు
## అన్ని హంగులతో ఆధునీకరణ
## ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమ అభివృద్ధి సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, మే 16(మనం బ్యూరో):** ఖమ్మం విజయ డెయిరీకి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని, రాష్ట్రంలోనే ఆదర్శ డెయిరీగా నిలిచేలా సమగ్ర అభివృద్ధి చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రోటరీ నగర్లో ఉన్న విజయ డెయిరీ భవనానికి తక్షణ మరమ్మతులు చేపట్టి, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మంత్రి పాడి పరిశ్రమ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఖమ్మం జిల్లాలో పాల ఉత్పత్తి, సేకరణ, రైతులకు లభించే మద్దతు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**ఉమ్మడి రాష్ట్రంలో విజయ డెయిరీ వైభవం**

ఉమ్మడి రాష్ట్ర కాలంలో విజయ డెయిరీ రోజుకు పదివేల లీటర్ల పాల సేకరణతో కళకళలాడేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.

రైతులకు నమ్మకమైన సంస్థగా నిలిచిన విజయ డెయిరీ మళ్లీ అదే స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమకు అపార అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతుల్లో విశ్వాసం పెంపొందించేలా పారదర్శక విధానాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఖమ్మం డెయిరీ ఆధునీకరణపై మంత్రి దృష్టి**

ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సమర్థులైన అధికారులు రైతుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, పాల రవాణా మార్గాలను శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా పాడి పరిశ్రమకు కొత్త ఊపిరి పోయాలని అభిప్రాయపడ్డారు.

**మహిళా సాధికారతతో పాడి పరిశ్రమకు బలం...**

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పాల సేకరణను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సూచించారు. పాడి రైతులకు అవసరమైన బ్యాంకు రుణాలు అందేలా అధికారులు సమన్వయం చేయాలని ఆదేశించారు.

స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముల్కనూర్ డెయిరీ అభివృద్ధి నమూనాను వివరించగా మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముల్కనూర్ నమూనాను మించి ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పాల ఉత్పత్తి పెంపుకు కార్యాచరణ...**

జిల్లాలో పశువుల సంఖ్యను పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. పాల ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతుల విశ్వాసమే విజయ డెయిరీ బలం..**

మంత్రి ఆలోచనలకు అనుగుణంగా విజయ డెయిరీ ఇప్పటికే అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసిందని చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో నాణ్యమైన పాల సేకరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, అత్యంత పారదర్శకంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సహకార శాఖ రిజిస్ట్రార్ రాహుల్ రాజ్, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంపుతో సామాన్యుడిపై భారం



- అధిక ధరలను నియంత్రించాలి
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న

**చుంచుపల్లి, మే 16(మనం న్యూస్):** ఇరాన్ అమెరికా యుద్ధాన్ని అడ్డం పెట్టుకొని అంతర్జాతీయ స్థాయిలో ముడిచములు ధరలు పెరిగాయని సాకుతో కేంద్ర ప్రభుత్వం పెట్రోలు డీజీలు వంటగ్యాస్ ధరలను భారీగా పెంచడాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న తీవ్రంగా విమర్శించారు. కొత్తగూడెంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దేవి ప్రసన్న పాల్గొని మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెంపుతో పేదల ప్రజల జేబులకు చిల్లులు పడతాయని అన్ని రకాల నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయే ప్రమాదం ఆమె ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు తగ్గించి ప్రజలపై ధరల భారాన్ని పడకుండా చూడాలని, లేకుంటే ప్రజాగ్రహానికి బిజెపి మోడీ ప్రభుత్వం గురికాక తప్పదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వై. శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకులు చింతలపూడి రాజశేఖర్, చిమట నాగేశ్వరరావు, కుమారస్వామి,మెట్టెల సైదుబాబు, దామెర్ల సర్వయ్య, రాము, మహేష్, సంపత్, మతిన్, భూక్య రామ దాసుతదితరులు పాల్గొన్నారు

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు



**మధిర, మే16(మనం న్యూస్):** అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం మధిర పరిధిలో చోటుచేసుకుంది. మధిర మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలోని ఒక ప్రైవేటు వెంచర్లో మృతురాలు కేకలు వేయకుండా చున్నీతో నోటిపై కట్టి హత్య చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మృతురాలు ఆంధ్రప్రదేశ్లోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన గోపిశెట్టి కల్పన(28)గా గుర్తించారు. కల్పన అదే గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. గత నాలుగు సంవత్సరాల క్రితం వారికి ప్రేమ వివాహం జరగగా రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. గత కొద్ది నెలలుగా వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో కల్పన అదే గ్రామంలో వాళ్ళ నానమ్మ ఇంటి వద్ద ఉంటుంది.

కల్పన మధిరలో గల మహేంద్ర హోం ఫైనాన్స్ ప్రైవేట్ కంపెనీలో క్యాషియర్గా పని చేస్తున్నది. రోజు లాగానే శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మేడూరు నుంచి డ్యూటీకి వెళ్తున్నట్లు ఇంట్లో నుంచి బయలుదేరింది. కల్పన ఆఫీస్కి రాకపోవడంతో ఆఫీస్ నుంచి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిసిన బంధువుల ఇంటికి ఏమైనా వెళ్ళిందేమో అని ఫోన్ చేశారు. ఎవరు తమ వద్దకు రాలేదని తెలియజేసినట్లు తెలిపారు. కల్పన తండ్రికి సుమారు ఉదయం 11 గంటల సమయంలో ఒక వ్యక్తి ఫోన్ కాల్ చేసి మీ అమ్మాయిని నేను వివాహం చేసుకుంటున్నాను ఆమెను తీసుకొని వెళుతున్నట్లు చెప్పాడని మేడూరు గ్రామస్తులు అనుకుంటున్నారు. కల్పన తండ్రి శుక్రవారం మధ్యాహ్నం గంపలగూడెం పోలీస్ స్టేషన్ లో తమ కూతురు మిస్ అయిందని తనకు వచ్చిన ఫోన్ కాల్ పోలీసులకు వివరించి మిస్సింగ్ కేసు నమోదు చేయించినట్లు సమాచారం.

గంపలగూడెం పోలీస్ సిబ్బంది కల్పన ఫోన్ సిగ్నల్ ఆధారంగా కృష్ణాపురం సమీపంలో లొకేషన్ ద్వారా శుక్రవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో కనుగొన్నారు. అనంతరం మధిర రూరల్ పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. పంచనామా జరిపి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్కే ఫౌండేషన్ దోర్నాల రామకృష్ణ ద్వారా తరలించినట్లు సమాచారం. కల్పన కేకలు వేయకుండా తన చున్నీతో నోటిపై బిగించి హత్య చేసి ఉంటారని తెలుస్తోంది. మృతదేహంపై గాయాలతో రక్తపు మడుగులో ఉంది. కల్పన హత్యకు భర్త కారణమా? ప్రేమికుడా ? ఇంకా ఎవరైనా ఉంటారా ?అనే కోణంలో మధిర రూరల్ సిఐ డి.మధు, రూరల్ ఎస్ఐ బి.లక్ష్మీ భార్గవి దర్యాప్తు చేస్తున్నారు.

# కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం

## సోనియా గాంధీ , సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**ఖమ్మం, మే 16(మనం న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, శుక్రవారం ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న ఉద్యమకారుల చిరకాల కోరిక నెరవేరుతున్న సందర్భంగా ఉద్యమకారులంతా చాలా ఆనందంతో ఉన్నారు గాని, కమిటీ విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని, కాలయాపన చేయకుండా శ్రీకృష్ణ కమిటీ లాగా ఊరూ,ఊరూ వాడ,వాడ తిరిగి ఉద్యమకారులను, నాయకులను నేరుగా కలిసి గుర్తింపు కార్డులను జారీ చేసి తుది నివేదికను తయారుచేసి తక్కువ టైంలో ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , గుంతేటి వీరభద్రం, పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి,షేక్ అబ్బాస్, బత్తిన మధుగౌడ్, లింగనబోయిన సతీష్, కూరపాటి సుశీల, రవిచంద్ర చౌహాన్, బాలిన భాస్కర్ రెడ్డి, దరిపల్లి వీరబాబు, మోత్కూరి వేంకటేశ్వరా చారి,భుక్య శ్రీనివాస్ నాయక్, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, కోడిరెక్క ఉమాశంకర్, గాజుల రవి కుమార్, ఆసిఫ్, బురాన్, కోటేశ్ యాదవ్, రెడ్డబోయిన వరలక్ష్మి, గ్లోరి, కమలమ్మ, ధనలక్ష్మి, స్వరూప, కోసూరి వీరబాబు ,పగడాల నాగరాజు, పగడాల శీను ,గాలి రాము, ఇనుప శీను ,లంజేపల్లి బాబు ,నార్పొంగు వెంకట్ ,పరికపెల్లి ఎల్లయ్య ,ఎస్ కే యాకూబ్, సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, మే 16(మనం న్యూస్):** హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,సందర్శించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజ కవర్గ ప్రజలకు ప్రభుత్వం తరఫున అందుతున్న వైద్య సహాయంపై ప్రత్యేక దృష్టి సారించారు. ములకలపల్లి మండల కేంద్రానికి చెందిన గట్టిగొర్ల మహాలక్ష్మమ్మ, చండ్రుగొండ మండలం అన్నారం తండా కు చెందిన బానోత్ దినేష్,కి అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వం నుంచి చెరొక రూ.2.50 లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షల ఎల్ఓసి చెక్కులను స్వయంగా అందజేశారు అనంతరం అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామానికి చెందిన ఇనుముల లక్ష్మయ్య ,అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం, గ్రామానికి చెందిన పామర్తి సుస్మిత, దమ్మపేట మండలం లచ్చాపురం దిబ్బగూడెం గ్రామానికి చెందిన గురింద గోపాలరావుని పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు అందజేత

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- 10 మంది సభ్యులకు 55.60 లక్షల చెక్కులు




**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (మనంప్రతినిధి):** మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల పోలీసులు ఎదుట లొంగిపోయిన 10 మంది సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంజూరైన రివార్డులను శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన చేతుల మీదుగా అందజేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వారి క్యాడర్ ను బట్టి తెలంగాణ ప్రభుత్వం రివార్డులను ప్రకటించింది.10 మంది సభ్యులకు గాను 55 లక్షల 60 వేల రూపాయలను ఎస్పీ చెక్కుల రూపంలో అందజేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని లొంగిపోయిన వారందరికి ప్రభుత్వం తరఫున రావాల్సిన రివార్డు నగదును ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు. రివార్డులను అందుకున్న వారిలో ఒక స్టేట్ కమిటీ మెంబెర్ , ఒక డివిజనల్ కమిటీ మెంబర్స్, ఆరుగురు ఏరియా కమిటీ మెంబెర్స్ , ఇద్దరు దళ సభ్యులున్నారు. ప్రస్తుతం వారి స్థితిగతుల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. రివార్డులను అందుకున్న సభ్యులకు ఎస్పీ కొన్ని సూచనలను చేశారు.రివార్డుల ద్వారా అందుకున్న నగదును విలాసాలకు ఉపయోగించకుండా,సక్రమ పద్ధతిలో జీవనోపాదికి ఉపయోగపడేలా వాటిని ఖర్చు చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందిస్తున్నామని తెలియజేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- ప్రతి ఇంటికి బీఎల్వోు చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం, మే16(మనం బ్యూరో):** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్ఓ లు, ఎన్నికల సిబ్బందికి ఎస్ఐఆర్ పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యంచేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.మ్యాపింగ్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గత వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో మంచి పురోగతి సాధించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో ఇచ్చిన అన్ని సూచనలను అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల వద్ద నివాస ధ్రువీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని సందర్భాల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. ఏదైనా ఓటరు పేరు జాబితాలో లేకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రధాన అజెండా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడటమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి అభ్యంతరం, క్లెయిమ్, దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి

## తరుగు పేరుతో నిలువు దోపిడీ.. బోనస్ హామీ ఏమైంది? బీజేపీ కిసాన్ మోర్చా హెచ్చరిక



**వైరా, మే 16 (మనం న్యూస్):** రాష్ట్రంలో రైతాంగం పండించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు వారం రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా హెచ్చరిక చేసింది. బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోలి మధుసూదన్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఖమ్మం జిల్లా వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వారు స్వయంగా పరిశీలించారు. కల్లాల వద్ద నెల రోజుల పైబడి పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై, మంత్రుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం వల్లే రైతులు రోడ్డున పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**రవాణా వ్యవస్థ కుదేలు.. కాంట్రాక్టర్లకే పెద్దపీట**

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే, ఇక్కడ రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసిందని నాయకులు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో రవాణా కాంట్రాక్టులను ఉమ్మడి జిల్లాలకు చెందిన ఒకే కాంట్రాక్టర్ కు కట్టబెట్టడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆరోపించారు. కనీసం మూడు, నాలుగు లారీలు కూడా లేని వారికి కాంట్రాక్టులు ఎలా అప్పగిస్తారని అధికారులను నిలదీశారు. లారీల కొరత ఉంటే పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా జగ్గయ్యపేట లాంటి ప్రాంతాల నుంచి వందలాది లారీలను రప్పించి తక్షణమే ధాన్యాన్ని తరలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం గోనె సంచులు, హమాలీ ఛార్జీలు, రవాణా ఖర్చులు, గోదాముల అద్దెలు సహా అన్ని నిధులను సమకూరుస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కనీస పర్యవేక్షణ చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు.

**తరుగు పేరుతో నిలువు దోపిడీ.. మిల్లర్లతో కుమ్మక్కు**

కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువునా దోచుకుంటున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కింద రూ. 2389 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బస్తాకు 7 కిలోల నుంచి 10 కిలోల వరకు తరుగు, తాలు పేరుతో కోతలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు, స్థానిక మంత్రులు, అధికారులు కుమ్మక్కై ఈ దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. వంద బస్తాలు మిల్లుకు వెళితే 90 బస్తాలకే రశీదులు ఇస్తున్నారని, మిగిలిన 10 బస్తాల డబ్బులు ఎవరు భరిస్తారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల ముందు గొప్పగా చెప్పిన రూ. 500 బోనస్ ఏమైందని, ఆ బోనస్ ఇచ్చే దిక్కు లేకనే ఇలా రైతుల కడుపు కొడుతున్నారా అని విమర్శించారు.

**ప్రణాళికా లోపం.. హెలికాప్టర్ రివ్యూలు**

రాష్ట్ర మంత్రులకు రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, హెలికాప్టర్లలో వచ్చి తూతూ మంత్రంగా సమీక్షలు నిర్వహించి వెళ్లిపోతున్నారని మధుసూదన్ రెడ్డి, కోటేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఫిబ్రవరి నెలలోనే ఏ జిల్లాలో ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేసి, దానికి తగ్గట్టుగా రవాణా, గోనె సంచులు, గోదాముల ప్రణాళిక చేసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం దారుణంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కనీసం 30 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని, నిన్నటికి నిన్న ఒక రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. చింతకాని, బోనకల్ మండలాల్లో మొక్కజొన్నలు వర్షానికి తడిసిపోతుంటే హడావిడిగా ప్రైవేటు ట్రాక్టర్లు పెట్టి తరలించారని, మిగతా రైతుల పట్ల ఎందుకు ఆ శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. ఈ మొత్తం వైఫల్యానికి బాధ్యత వహిస్తూ సంబంధిత మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

**వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి: అల్టిమేటం**

ప్రస్తుతం వాతావరణం అనుకూలించడం లేదని, రాబోయే రోజుల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వచ్చే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి బీజేపీ నాయకులు డెడ్ లైన్ విధించారు. మరో వారం రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే, రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అడుగడుగునా మంత్రులను, ప్రభుత్వాన్ని అడ్డుకుంటామని, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. రైతులు అధైర్యపడొద్దని, బీజేపీ వారికి అండగా ఉండి తీరుతుందని, మద్దతు ధరతో పాటు ప్రతి గింజనూ కొనిపించే బాధ్యత తాము తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కనతల అశోక్ రెడ్డి, నున్న రవికుమార్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, జిల్లా కార్యదర్శి తొండపు సైదేశ్వర రావు ,వైరా మండల అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీసిటీలో చిన్మయ అమృత మహోత్సవ్ వేడుకలు




శ్రీసిటీ, మే 16, మనంన్యూస్: చిన్మయ మిషన్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న చిన్మయ అమృత మహోత్సవ్ వేడుకలలో భాగంగా శ్రీసిటీలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు విచ్చేసిన చెన్నై నార్త్ ఈస్ట్ చిన్మయ మిషన్ రెసిడెంట్ ఆచార్యులు స్వామి మిత్రానందకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. మిత్రానందతో పాటు కొయంబత్తూరులోని చిన్మయ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ రెసిడెంట్ డైరెక్టర్ స్వామి అనుకూలానంద, కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద, గుంటూరు విశాఖపట్నం చిన్మయ మిషన్ ఇన్చార్జ్ స్వామి సువీరానంద కు ఆయన ఆహ్వానం పలికారు. డా. రవీంద్ర సన్నారెడ్డి తన స్వాగత ప్రసంగంలో దేశ నిర్మాణం, విలువల ఆధారిత విద్య, యువత సాధికారతకు చిన్మయ మిషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. అమృత యాత్రలో భాగంగా తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్లోకి ప్రవేశించిన అనంతరం తొలి గమ్యస్థానంగా శ్రీసిటీని ఎంపిక చేసినందుకు స్వామి మిత్రానందకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించండి

- నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయండి
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ను కలిసిన ఎంపీ గురుమూర్తి



తిరుపతి, మే16 మనం న్యూస్: తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెండింగ్లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, అలాగే డిజిటల్ విద్యా మరియు సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు.రేణిగుంట రైల్వే స్టేషన్ను ఆధునికసౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు.సింహపురి ఎక్స్ప్రెస్ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, దీని ద్వారా నెల్లూరు జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అంబేద్కర్ నగర్ అండర్పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్లో కృష్ణా ఎక్స్ప్రెస్, పూరి ఎక్స్ప్రెస్, తిరుమల ఎక్స్ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.డిజిటల్ విద్య, సైబర్ భద్రత రంగాల్లో తిరుపతిని జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడంలో నైలెట్ కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ప్రతిపాదిత భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, హాస్టళ్లు, ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు కోసం కనీసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పాలసీ, లా అండ్ టెక్నికల్ రీసెర్చ్ ఇన్ సైబర్ స్పేస్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందించాలని కోరారు. తిరుపతికి సైబర్ పరిశోధన మరియు డిజిటల్ ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉందని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తే ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



తిరుపతి,మే 16 మనం న్యూస్: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్'వి బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్'జికగ రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్' బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద శ్రీ పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు ' మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు,ఎంపిహెచ్ఇఓ లు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్




ఏర్పేడు, మే 16 మనం న్యూస్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం ఏర్పేడు బస్టాండు కూడలిలో మండలంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రతిజ్ఞ చేసి ప్రజలకు, స్థానిక అధికారులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచిస్తూ గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, పునర్వినియోగ వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇంటి వద్ద నుంచే చెత్త వేర్వేరుగా వర్గీకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో వేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ తిరుపతి కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



- బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

తిరుపతి, మే16 మనం న్యూస్: తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు.తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.మే 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మే 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్న వాహనసేవలు భక్తి పారవశ్యాన్ని పంచనున్నాయి. ముఖ్యంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి.

**వాహనసేవల విశేషాలు**

మే24నఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం.మే25న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం. మే26నఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, మే27న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం మే28న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, మే29ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం మే30నఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, మే31నఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం.బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, ఏఈవో శ్రీ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో విస్తృత స్థాయి నాఖాబందీ నిర్వహణ



- భక్తుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- పలు శాఖల సమన్వయంతో కాటన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ

తిరుమల, మే16 మనం న్యూస్: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా తిరుమలలో విస్తృత స్థాయిలో నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు.భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తిరుమలలోని శిలాతోరణం, శ్రీవారి పాదాలు ప్రాంతాల్లో ఉదయం 6.00 గంటల నుండి 7.30 గంటల వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కార్యక్రమానికి ముందు ఉదయం 5.30 గంటలకు శిలాతోరణం జంక్షన్ వద్ద సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ నాఖాబందీ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ సర్వీసెస్, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి కాటన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ప్రజలు, భక్తులు పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయం

- డైరెక్టర్, ఐఐటి తిరుపతి డా. ఏ.సత్యనారాయణ




ఏర్పేడు, మే 16 మనం న్యూస్: కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6 రోజుల పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్నినిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటి కళాశాల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పేడులోని తిరుపతి ఐఐటి కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డా.ఏ. సత్యనారాయణతో కలసి జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ అనుభవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా యువ సంఘం ఆరు రోజుల కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలోప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన సుమారు యాభై మంది గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు తిరుపతి జిల్లాలోని వివిధ విశేష ప్రాచుర్యం కలిగిన ప్రదేశాలైన తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి దేవాలయాలతో పాటు శ్రీ సిటీ పారిశ్రామిక కేంద్రం, శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, తిరుపతి ఎస్వీ, మహిళా విశ్వవిద్యాలయాలను సందర్శిస్తారన్నారు. విశ్వవిద్యాలయాల సందర్శనలో భాగంగా ఇక్కడి అభివృద్ధి, విద్యా వ్యవస్థ, సంస్కృతి మొదలగు విషయాల పై పరస్పర అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. వీటితో పాటు అదనంగా రెండు రోజులు అమరావతికి తీసుకువెళ్ళి రాజధాని ప్రాంతంలోని అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ నిర్మాణాలు ఎలా ఉన్నాయో కూడా వీరికి చూపించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తూ ప్రతి ఏడూ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందులోనూ తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించుకోవడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో యూత్ ఇంటిగ్రేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని, ఆ సమయంలో ఐఐటి అరుణాచల్ ప్రదేశ్ నుండి విద్యార్థులతో ఈ కార్యమరమ్యం నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహారాష్ట్ర నుండి వచ్చిన సుమారు 50 మంది విద్యార్థులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జూన్ మొదటి వారంలో మహారాష్ట్ర తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు. దేశం నలుమూలల విద్యా వ్యవస్థ, సంస్కృతి, పరిశ్రమలు, అభివృద్ధి తదితర అంశాల పై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయంగా భారత ప్రధాని నరేంద్ర మోడి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలు చూపించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐఐటి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు అవ్వాలి




తిరుపతి మే16 మనం న్యూస్: తిరుపతి నగరాన్నిప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై పాత మునిసిపల్ కార్యాలయం నుండి శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ తో పాటు గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ,రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు,యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, టిటిడి బోర్డు మెంబెర్ భానుప్రకాష్ రెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొని ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర భాగంగా ప్రతి మూడవ శనివారం ఒక థీమ్ తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్' అనే థీమ్ తో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యమని తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు కలుగుతున్నాయని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాదవ్, డి.ఈ లు రాజు, వెంకట ప్రసాద్, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన



- తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి

తిరుపతి, మే16 మనం న్యూస్: తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చడమే ధ్యేయంగా తుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు.ఉప్పరపల్లి పరిధిలో జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ,డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన తుడా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్న ఆయన, కాంట్రాక్టర్కు మరియు ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు.ఉప్పరపల్లి రోడ్డు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం కాబట్టి, పనుల వల్ల స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బారికేడ్లు,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అని,పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు,ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజాయి బారి నుండి తిరుపతిని రక్షించుకుందాం!



- భూమన కుటుంబం నుండి యువతనుకాపాడుకుందాం!
- గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహిళలు!

తిరుపతి మే16 మనం న్యూస్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో యువత జీవితాన్ని నాశనం చేస్తున్న గంజాయి కి వ్యతిరేకంగా తిరుపతి కూటమి పార్టీల మహిళా విభాగాల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు ఉద్యమించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట శాంతియుత నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన కు చెందిన పలువురు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి, అయన కుమారుడు అభినయ్ రెడ్డి ల కనుసన్నల్లో కొట్లాది రూపాయల గంజాయి వ్యాపారం జరుగుతుందన్నారు.నాలుగు రోజుల క్రితం భూమన అభినయ్ రెడ్డి ప్రధాన అనుచరుడు భాను ప్రకాష్ తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతూ.. ఆరు కేజీల గంజాయితో పట్టుబడడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.ఒరిస్సా నుండి వందల కేజీల గంజాయి తెప్పించి పవిత్రమైన తిరుపతిలో అభినయ్ రెడ్డి తన అనుచరుల ద్వారా బస్టాండు రైల్వే స్టేషన్ కాలేజీలు చివరికి స్కూల్ ల వద్ద కూడా గంజాయి అమ్మిస్తూ కోట్లాది రూపాయలుసంపాదిస్తున్నారన్నారు.ఈ గంజాయి వలన యువతీ యువకులు తమ జీవితాలను కోల్పోతున్నారని.. వారి తల్లి, తండ్రులు మరియు కుటుంబాలు తీవ్రమైన మానసిక క్షోభ అనుభవిస్తున్నాయన్నారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు..ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట కార్యదర్శి కుమారమ్మా, పార్లమెంట్ సెక్రటరీ రేవతి..జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అకేపాటి సుభాషిణి, టిడిపి నగర మహిళా విభాగం అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ.. ఇతర మహిళా నాయకులతో పాటు.నగరానికి చెందిన పలువురు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## స్విమ్స్లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం



తిరుపతి, మే16 మనం న్యూస్: స్విమ్స్ కార్డియాలజి విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ రక్తపోటు దినోత్సవం ను స్విమ్స్ శ్రీ పద్మావతి ఓ.పి.డి. బ్లాక్ నందు శనివారం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా' రామ్ తెలియజేశారు.స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా' ఆర్.వి. కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని (కలిసి కట్టుగా అధిక రక్తపోటును నియంత్రిస్తున్నాము) అనే థీమ్ తో ఈ సంవత్సరం మనం నిర్వహించడం జరిగిందన్నారు. కార్డియాలజి సీనియర్ ప్రొఫెసర్ విభాగాధిపతి డా'వనజాక్షమ్మ మాట్లాడుతూ అధిక రక్తపోటును కంట్రోల్ లో వుంచుకోవడానికి ప్రతి రోజు యోగా, ధ్యానం లాంటివి చేసుకుంటూ, మనసును ప్రశాంతంగా వుంచుకోవాలన్నారు. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకుంటే అధికరక్తపోటును నియంత్రించ వచ్చునన్నారు. పండ్లు, కూరగాయలు, అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల మీ రక్తపోటు తగ్గుతుందన్నారు. కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా' వరుణ్ మాట్లాడుతూ రక్తపోటుకు గల కారణాలు, లక్షణాలు, రక్తపోటు ఎలా గుర్తించాలి ? రక్తపోటు తగ్గించుకోవడం వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా' ఫర్దీబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసే తత్వం అలవాటు చేసుకోసువడం వల్ల శరీరంలో అధిక కొవ్వును అరికట్టవచ్చునని, ప్రాసెసింగ్ ఫుడ్ తీసుకోకపోవడం మంచిదని సూచించారు. దీనివలన అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం నుండి కాపాడకోవచ్చునని, అలాగే రక్తపోటు ఉన్నవారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా' వాహిద్ ఖాన్ మాట్లాడుతూ బీపీని కంట్రోల్ వుంచుకోవడం వల్ల స్ట్రోక్, పక్షవాతం లాంటివి తగ్గించుకోవచ్చు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం 30 న్ని లు పాటు వ్యాయామం చేయడం, ఉప్పు తక్కువ తినడం వల్ల బీపిని కంట్రోల్లో వుంచుకోవచ్చునని తెలిపారు. అధిక బరువును నియంత్రించుకోకపోతే అధిక రక్తపోటుకు గురికావాల్సి వస్తుందన్నారు. కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా' అనిల్ కుమార్ మాట్లాడుతూ రక్తపోటు అందరికీ వుంటాది కానీ అది నార్మల్ గా వుందా లేదా అనేది క్రమంగా చెక్ చేసుకోంటు వుండాలన్నారు. ఇంటి వద్ద బి.పి. చూసుకొనే విధానాన్ని వివరించారు.కార్డియాలజి వైద్యులు డా' సురేష్ కుమార్ మాట్లాడుతూరక్తపోటు ఎక్కువగా వున్నప్పుడు గమనించవలసిన లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అ ధిక రక్తపోటు పై పేషంట్లకు సాధారణంగా వుండే సందేహాలను నివృత్తి పై ప్యానెల్ చర్చలో మోడెరేటర్ గా కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా'వాహిద్ ఖాన్ వ్యవహించారు. పేషంట్లు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు, చివరిగా వైద్యులు, పేషంట్లు కలిసికట్టుగా ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో రక్తపోటును నియంత్రింస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలని సంకల్పం చేశారు. అనంతరం పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగపు వైద్యులు డా'రోహిత్, డా' ఉపేంద్ర, డా'ధర్మసాయి, డా'విష్ణు ప్రసన్న బాబు, డా' విష్ణు వర్ధన్, డా' నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# కీవ్‌పై రష్యా దాడి.. 24 మంది మృతి



**కీవ్,మే 16 :** ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలోని ఒక తొమ్మిది అంతస్తుల అపార్ట్‌మెంట్‌పై రష్యా జరిపిన క్రూయిజ్ క్షిపణి దాడిలో 24 మంది మరణించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఈ నెల 9 నుంచి 11 వరకూ కాల్పుల విరమణ పాటించిన రష్యా తదనంతరం భారీస్థాయిలో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఉక్రెయిన్ సైతం రష్యాలోని ర్యాజాన్‌పై డ్రోన్ దాడులు జరిపింది. ఈ దాడిలో అక్కడి చమురు శుద్ధి కర్మాగారంలో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధ ఖైదీల బదలాయింపు నిరాటంకంగా సాగుతోంది. తాజాగా రష్యా 205 మంది యుద్ధ ఖైదీలను బదిలీ చేయగా ఉక్రెయిన్ కూడా అంతే సంఖ్యలో ఖైదీలను అప్పగించింది.

# ఇక అతడు మమ్మల్ని భయపెట్టలేడు

## ఐసిస్ అగ్ర కమాండర్ హతమైనట్లు ట్రంప్ పోస్టు

**వాషింగ్టన్,మే 16 :** ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు.

''నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేకపోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్లు లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్'' అని ట్రంప్ రాసుకొచ్చారు.

నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సీనియర్ కమాండర్.




ఇస్లామిక్ స్టేట్ తరఫున టెర్రర్ సెల్స్‌కు సూచనలు ఇవ్వడం, అంతర్జాతీయ నిధులను దారి మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ ఆరోపణలతో 2023లో అమెరికా అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది.

# న్యాయవ్యవస్థ 24/7 ఆసుపత్రుల్లా పనిచేయాలి

## 'పరాన్నజీవి' వ్యాఖ్యలపై సీజేఐ క్లారిటీ

**భోపాల్/ఢిల్లీ,మే 16 :** న్యాయవ్యవస్థ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సామాన్యుడి సమస్యలను పరిష్కరించేందుకు న్యాయస్థానాలు 24/7 ఆసుపత్రుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగించే యంత్రాంగం ఉండాలని అన్నారు. న్యాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయడానికి సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థను మరింతగా విస్తరించాలని సూచించారు. కొవిడ్ సమయంలోనూ విధులను నిర్వర్తించిన ఏకైక న్యాయవ్యవస్థ భారత్‌ది మాత్రమే అన్నారు. సాంకేతికత వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

న్యాయవ్యవస్థ పనితీరులో మరింత పారదర్శకతను తీసుకురావడానికి సాంకేతికత సహాయపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. సాంకేతిక పురోగతిని సౌకర్యానికి సంబంధించిన విషయంగా కాకుండా రాజ్యాంగ అవసరంగా చూడాలన్నారు. న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిజిటల్ వ్యవస్థలు సహాయపడతాయన్నారు. కోర్టు కేసుల్లో జాప్యాలు, అసమర్థతలకు సాంకేతికతే అత్యంత ప్రభావవంతమైన పరిష్కారమని ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయ పడ్డారు. అధునాతన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు కోర్టు తీర్పుల వేగాన్ని గణనీయంగా మెరుగుపరచగలవని పేర్కొన్నారు.

ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను



తప్పుగా అర్థం చేసుకున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూనే తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. మీడియాలోని ఓ వర్గం వాటిని వక్రీకరించిందన్నారు. భారతీయ యువత పట్ల ఎంతో గర్వపడుతున్నానని పేర్కొంటూ సీజేఐ ఓ ప్రకటన విడుదల చేశారు.


''నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఓ వర్గం వక్రీకరించిన తీరును చదివి ఎంతో బాధపడ్డా. నకిలీ, బోగస్ డిగ్రీలతో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశిస్తూ ఆ విమర్శలు చేశాను. ఇలాంటి వ్యక్తులే.. మీడియా, సోషల్ మీడియాతోపాటు ఇతర రంగాల్లో చొరబడ్డారు. అందుకే వారిని పరాన్నజీవులుగా చెప్పాను'' అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

# 'డార్లింగ్.. నీ కోసం పేపర్ లీక్ చేస్తా'

## అసిస్టెంట్ ప్రొఫెసర్ అసభ్య మాటలు • పరమ్ జిత్ సింగ్ అరెస్ట్

**లఖ్‌నవూ,మే 16 :** ఉత్తర ప్రదేశ్‌లో ఒక ప్రొఫెసర్ అసభ్య వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు పెడదోవపట్టకుండా మార్గనిర్దేశం చేయాల్సిన అతడే.. దారి తప్పాడు. ఒక విద్యార్థినితో అభ్యంతరకరంగా మాట్లాడిన ఆడియో క్లిప్ బయటకు రావడంతో చివరకు జైలు పాలయ్యాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

లఖ్‌నవూ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పరమ్జిత్ సింగ్.. బీఎస్సీ విద్యార్థినితో ఫోన్లో అసభ్యంగా మాట్లాడాడు. ఆమెను తన వద్దకు రప్పించుకునేందుకు ''డార్లింగ్ నీకోసం పేపర్ లీక్ చేస్తా''నంటూ వ్యాఖ్యలు చేశాడు. పరీక్షలకు ముందు తనను కలవాలని వేధించాడు. తాను చదువుకున్నానని, సిలబస్ పూర్తి చేశానని ఆ కాల్‌లో మాట్లాడిన యువతి



బదులిచ్చింది. అయితే ఆ వేధింపులు ఆగకపోవడంతో సదరు విద్యార్థిని యూనివర్సిటీ యంత్రాంగానికి ఫిర్యాదు చేసింది. దాంతో ఆడియో క్లిప్‌లు బయటకు వచ్చాయి. దీనిపై లఖ్‌నవూ యూనివర్సిటీ అధికారులు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు.

ఈ మొత్తం వ్యవహారంలో నిజనిర్ధరణ కోసం విశ్వవిద్యాలయం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చాడు. యూనివర్సిటీ అంతర్గత రాజకీయాల్లో తనను ఇరికించారని పేర్కొన్నాడు. ఒకవైపు దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. దానిపై సీబీఐ ముమ్మర దర్యాప్తు చేస్తోంది. ఈ సమయంలో ప్రొఫెసర్‌పై పేపర్ లీక్ ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసులో ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలి




## • రాహుల్ గాంధీ డిమాండ్

**ఢిల్లీ,మే 16 :** నీట్- యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీకేజీ వల్ల దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు పడిన కష్టం, వారి కలలు ఛిన్నాభిన్నమయ్యాయన్నారు. ఇందుకుగాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యత తీసుకోవాలని అన్నారు. దేశంలో ఇంత జరుగుతున్నా ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

బీజేపీ నేతలు, విశ్వవిద్యాలయ అధికారుల కుమ్మక్కయ్యి దేశ విద్యా వ్యవస్థను దెబ్బతీశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూనిర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలు యోగ్యత ఆధారంగా కాకుండా ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక అనుబంధం ఆధారంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

దేశంలో 80 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అవి రెండు కోట్ల మంది యువత భవిష్యత్తును నాశనం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి పేపర్ లీక్ మాఫియా ఎటువంటి శిక్షల్లేకుండా తప్పించుకుంటుంటే నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. పేపర్ లీక్ ఆరోపణలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రూ.182 కోట్ల 'జిహాదీ డ్రగ్' పట్టివేత



**ఢిల్లీ,మే 16 :** మాదక ద్రవ్యాల రవాణాపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. దేశం మీదుగా పశ్చిమాసియాకు భారీ మొత్తంలో డ్రగ్స్ తరలిపోకుండా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అడ్డుకుంది. ఈ క్రమంలో తొలిసారిగా రూ.182 కోట్ల విలువైన 'జిహాదీ డ్రగ్' అని పిలిచే క్యాప్టగాన్‌ను స్వాధీనం చేసుకుంది.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ విషయాలు వెల్లడిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'డ్రగ్ రహిత భారత్'ను నిర్మించాలని ప్రధాని మోడీ ప్రభుత్వం సంకల్పించిందన్నారు. 'ఆపరేషన్ రేజ్‌పిల్'లో భాగంగా ఎన్‌సీబీ భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకుందని తెలిపారు. 'జిహాదీ డ్రగ్'గా పిలిచే క్యాప్టగాన్ డ్రగ్స్‌ను తొలిసారి స్వాధీనం చేసుకున్నారని వాటి విలువ దాదాపు రూ.182 కోట్లు ఉంటుందని వెల్లడించారు. ఈ డ్రగ్స్ పశ్చిమాసియాకు తరలిస్తుండగా పట్టుకోవడంతో పాటు ఓ విదేశీయుడిని అరెస్టు చేశారని తెలిపారు. మాదక ద్రవ్యాలపై జీరో టోలరెన్స్ అనే తమ నిబద్ధతకు ఇది ఉదాహరణ అని అభివర్ణించారు. ఈసందర్భంగా డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేసేవారికి అమిత్‌షా గట్టి హెచ్చరికలు చేశారు. డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఈసందర్భంగా ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఎన్‌సీబీ అధికారులను ఆయన అభినందించారు. ఈ డ్రగ్స్‌ను గుజరాత్‌లోని ముంద్రా పోర్టులోను, ఢిల్లీలో నెబ్‌సరాయ్‌లలో పట్టుకున్నట్లు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# నీట్ పేపర్ లీక్.. మరో మాస్టర్‌మైండ్ మనీషా అరెస్ట్



**ఢిల్లీ,మే 16 :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి అరెస్టయ్యారు. ఢిల్లీలో విచారణ అనంతరం పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మందరేను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఆమె నీట్-యూజీ బయాలజీ పేపర్‌ను లీక్ చేసినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన మనీషా గురునాథ్ మందరే బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రక్రియలో మనీషా భాగమయ్యారు. ఒక నిపుణురాలిగా ఎన్‌టీఏ ఆమెను నియమించిందని సీబీఐ పేర్కొంది. ఏప్రిల్ నుంచి ఆమె నీట్ అభ్యర్థులతో టచ్‌లో ఉన్నారు. వారికి తన ఇంటి వద్దే శిక్షణాతరగతులు నిర్వహించారు. అప్పుడు ఆమె విద్యార్థులకు బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను వెల్లడించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ ప్రశ్నలు నోట్‌బుక్‌లో రాసుకునేలా, టెక్స్‌బుక్‌లలో మార్క్ చేసుకునేలా విద్యార్థులకు ఆమె సూచించారు. మే 3వ తేదీన జరిగిన నీట్-యూజీ అసలు పరీక్ష పత్రంలోని ప్రశ్నలతో అవి సరిపోలాయని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. పుణెకు చెందిన మనీషా వాఘ్మారే ఆ విద్యార్థులను సమీకరించారు. వాఘ్మారేను సీబీఐ ఈ నెల 14న అరెస్టు చేసింది. ఇక, గత 24 గంటల్లో సీబీఐ ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కొన్ని డాక్యుమెంట్లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం వాటిని అధికారులు విశ్లేషిస్తున్నారు.

రసాయన శాస్త్రంలో నిపుణుడైన ప్రొఫెసర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ ఇప్పటికే అరెస్టు చేసింది. ఆయనది మహారాష్ట్రలోని లాతూర్. గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం పుణెలో నివసిస్తున్న ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది. కాగా.. ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహిల్యానగర్ నుంచి ఇప్పటివరకు తొమ్మిదిమంది అరెస్టు అయ్యారు.

# ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కీలక కమాండర్ మృతి

**గాజా, మే 16:** గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో హమాస్ మిలిటరీ విభాగాధిపతి ఇజ్ అల్ హదాద్ మృతి చెందాడు. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణ దళం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌లో 2023 అక్టోబర్ 7న జరిపిన దాడులకు సూత్రధారుల్లో ఒకరిగా పేర్కొంది. హమాస్ కూడా హదాద్ మరణాన్ని ధ్రువీకరించింది. ఈ దాడుల్లో ఆయన భార్య, కుమార్తె కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హమాస్ కీలక నేత మొహమ్మద్ సిన్వార్ మృతి తర్వాత ఆయన బాధ్యతలను హదాద్ తీసుకున్నాడు. ఐడీఎఫ్ దళాలపై దాడులకు వ్యూహరచనలు చేయడంతో కీలకంగా వ్యవహరించాడు. యుద్ధసమయంలో ఇజ్రాయెల్ సైనికులను బందీలుగా పట్టుకోవడంతో పాటు వారిని తనకు రక్షణ కవచంగా



ఏర్పాటు చేసుకున్నాడు. హమాస్ స్థావరాల పునర్నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాడు. అక్టోబర్ 7నాటి దాడులకు వ్యూహరచన చేసిన హమాస్ కమాండర్లలో చివరి వ్యక్తి ఈయనేనని ఐడీఎఫ్ వెల్లడించింది.

# చరిత్రలో ఉంటారో, లేదో..

## పాక్ డిసైడ్ చేసుకోవాలి..!

• భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక

**ఢిల్లీ,మే 16 :** పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులకు ఇలాగే ఆశ్రయం కల్పిస్తూ.. భారత్‌పై ప్రయోగించాలని చూస్తే ప్రపంచపటంలో పాక్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. చరిత్రలో ఉండాలనుకుంటున్నారో, లేదో తేల్చుకోవాలని హెచ్చరించారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకేవిధంగా పరిగణిస్తుందని.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టంచేశారు.

పహల్‌గామ్‌లో పర్యాటకుల ఊచకోతకు ప్రతిగా పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి జనరల్ ద్వివేది మాట్లాడుతూ.. ఆ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామని పేర్కొన్నారు. పొరుగుదేశం తన తీరును మార్చుకోకుంటే ఆ ఆపరేషన్‌కు సంబంధించిన రెండో వెర్షన్ తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపైనే దృష్టిపెడుతుందని.. తన మార్గంలో



ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో మనుషులకు విశ్రాంతినిచ్చే ఓ కేఫ్ ప్రారంభించాలనేది తన కల అని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో దీనిని ఏర్పాటు చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. 'సేనా సంవాద్' అనే కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ప్రారంభించబోయే ఆ కేఫ్ కప్పు కాఫీ తాగుతూ సేదతీరే విధంగా ఉంటుందని ఎవరైనా తాము తీసుకునే నిర్ణయాలపై ఇతరులతో ఉచితంగా సంప్రదింపులు జరిపే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. అంతే కాకుండా అందులో ఓ గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

# అమెరికాను నమ్మలేం

## ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ




**ఢిల్లీ,మే 16 :** అమెరికా తమతో నిర్వహించిన చర్చల సందర్భంగా పరస్పర విరుద్ధమైన సంకేతాలు వెలువరించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆరోపించారు. అణ్వాయుధాలు సమకూర్చుకోవాలని ఇరాన్ ఏనాడూ కోరుకోలేదని ఆయన అన్నారు. బ్రిక్స్ దేశాల సదస్సు ముగింపు సందర్భంగా ఢిల్లీలో అరాగ్చీ విలేకరులతో మాట్లాడారు. అమెరికాపై ఇరాన్‌కు నమ్మకం లేదని స్పష్టం చేశారు. అయితే ఉద్రిక్తతల నివారణకై దౌత్య మార్గానికే తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు.''మరేమీ చేయలేక అమెరికా సంప్రదింపుల మార్గం ఎంచుకుంది. అమెరికన్‌లపై మాకు విశ్వాసం లేదు. ఈ అపనమ్మకమే దౌత్య ప్రయత్నాలకు ఆటంకంగా నిలిచింది'' అని అరాగ్చీ అన్నారు. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలన్నదే మా కోరిక. ఆ జలమార్గం మాకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి, మా వ్యతిరేకులకు తప్ప మిగిలిన అన్ని దేశాల నౌకల కోసం తెరిచే ఉందని అరాగ్చీ వివరించారు.

# అమెరికా 'వాతావరణం' బాగోలేదు

## జర్మన్ ఛాన్సలర్ ఫెడరిక్ మెర్జ్

**బెర్లిన్,మే 16 :** అమెరికాలో చదువుకు, ఉద్యోగాలకు వెళతామని తన పిల్లలు చెబితే, సరేనంటూ వారిని ప్రోత్సహించలేనని ఆ దేశంలో ఉన్నపళంగా మారిన 'సామాజిక వాతావరణం' ఇందుకు కారణంగా జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ వ్యాఖ్యానించారు. ''వాస్తవానికి నేను అమెరికాకు గొప్ప అభిమానిని. కానీ, ప్రస్తుతానికి ఆ అభిమానం పెరగడం లేదు'' అంటూ వర్జ్‌బర్గ్‌లోని క్యాథలిక్ కాంగ్రెస్ ప్యానెల్ చర్చల్లో ఆయన తెలిపారు. బాగా చదువుకొన్న యువత ఏమి సాధించగలరనే ప్రశ్నకు అమెరికాలో ఏడాది కిందటిదాకా భిన్నమైన సమాధానాలు లభించేవన్నారు. నేటి అమెరికాలో ఉన్నత విద్యావంతులు ఉద్యోగం సంపాదించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చైనా పర్యటన నుంచి వెనుదిరుగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాను ఫోనులో మాట్లాడినట్లు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తెలిపారు. ''ఇరాన్ చర్చలకు వచ్చి, హర్మూజ్ జలసంధి తెరవాల్సిందే'' అంటూ తామిద్దరం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఆయన 'ఎక్స్' ద్వారా తెలిపారు.



# అవసరమైతే పార్టీ ఆఫీసులకు రంగులేస్తాం

## మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**కోల్‌కతా,మే 16 :** పశ్చిమబెంగాల్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పరాజయం పాలైంది. ఎన్నికల్లో ఓటమిపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

పార్టీలో ఉండాలనుకునేవాళ్లు ఉండొచ్చని, వద్దనుకునేవాళ్లు వెళ్లిపోవచ్చని ఆమె పేర్కొన్నట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలు వెలువడుతోన్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమత సమావేశమయ్యారు. ఇందులో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీ మళ్లీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 'పార్టీ మారాలనుకునే వారిని వెళ్లనివ్వండి. నేను పార్టీని కొత్తగా మళ్లీ నిర్మిస్తాను.

ఇందులోనే ఉండేవారు.. దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించండి. వాటికి రంగులు వేయండి. అవసరమైతే నేనూ రంగులు వేస్తాను. టీఎంసీ ఎప్పటికీ తల వంచదు. ప్రజల తీర్పును వారు దొంగిలించారు' అని మమతాబెనర్జీ తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత టీఎంసీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు పోస్ట్ చేసింది. దీనికి 'టీఎంసీ ఒక కుటుంబంలా ఐక్యంగా నిలుస్తుంది. ప్రజల తీర్పును దోచుకునే వారి ముందు మేం ఎప్పటికీ తలవంచం. సత్యమే గెలుస్తుంది' అని రాసుకొచ్చింది.

ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఆమె ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. చాలామంది ఇతర పార్టీలకు వెళ్తారని తనకి తెలుసన్నారు. అందుకు వారికి సొంత కారణాలు ఉండొచ్చని వెళ్లాలనుకునే వారిని తాను ఆపాలనుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

# ప్రతిరోజు15 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

## మిల్లుల వద్ద 12 గంటల్లోపు అన్ లోడింగ్ పూర్తి కావాలి
## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
## ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాలు



**సూర్యాపేట, మే 16 (మనం ప్రతినిధి):** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలో రోజుకు 5 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపిన ఆయన.. ఇకపై ఆ వేగాన్ని పెంచి రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సమయానికి లారీలు రావడం లేదని, వచ్చిన లారీలను కూడా సెంటర్ ఇంచార్జ్ లు కొన్ని నిర్దిష్ట మిల్లులకు మాత్రమే ఎక్కువగా పంపిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల మిల్లుల వద్ద లారీలు గంటల తరబడి నిలిచిపోతున్నా యన్నారు. మండల తహశీల్దార్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని, మిల్లుల వద్ద ఎక్కువ లారీలు నిలిచిపోయిన చోట త్వరితగతిన అన్ లోడింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలి. అదే విధంగా మిల్లుకు చేరుకున్న లారీలు 12 గంటల లోపు అన్ లోడింగ్ పూర్తి చేయాలని, ఒకవేళ 12 గంటల లోపు అన్ లోడింగ్ ప్రారంభం కాకపోతే, వెంటనే ఆ లారీలను ప్రత్యామ్నాయ అన్ లోడింగ్ పాయింట్లకు మళ్లించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నుండి లారీలో ధాన్యం లోడింగ్ పూర్తి చేసి, 3 గంటల లోపు మిల్లుకు తరలించాలన్నారు. ఏ మిల్లుకు ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి, ఎంత అన్ లోడింగ్ జరిగింది అనే రిపోర్టుతో పాటు, కొనుగోలు కేంద్రాలకు ఎన్ని లారీలు వస్తున్నాయనే పూర్తి వివరాలను రోజువారీగా ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో హమాలీల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, దాన్యం లోడింగ్, అన్ లోడింగ్ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు మూడు షిఫ్టులలో హమాలీలు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఒ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహనబాబు, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎం సివిల్ సప్లయస్ శ్రీధర్ రెడ్డి, డిఎంఒ నాగేశ్వర శర్మ, ఎఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి వెంకట్ రాంరెడ్డి

## జొన్నల గడ్డల గుడం గ్రామ అభివృద్ధికి ఆయన ఎంతో చేశారు
## రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్లగొండ మే 16( మనం ప్రతినిధి):** తిప్పర్తి మండల ఉమ్మడి రాజపేటకు చెందిన నామిరెడ్డి వెంకట్ రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాగా శనివారం నాడు రాష్ట్ర రోడ్డుభవనాలు మరియు సినిమాటో గ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మృతదేహానికి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఉమ్మడి రాజుపేట ఎంపీటీసీగా, జొన్నగడ్డలగూడెం గ్రామ సర్పంచ్గా ప్రజలకు సేవలందించిన వ్యక్తి వెంకట్ రాంరెడ్డి అని కొనియాడారు అయన అకాల మరణం నాకు త్రివ్రంగా కలిచి వేసిందని వెంకట్ రాంరెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.మంత్రి వెంట మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్ సహకార బ్యాంక్ చైర్మన్ పాశం సంపత్ రెడ్డి సర్పంచ్ లు కోన వెంకన్న బొంత రాములు బద్దం రజిత సుధీర్ నామ చక్రవర్తి వాడాల సువర్ణ ప్రసాద్ అలుగుబెల్లి వెంకట్ రెడ్డి కారే శ్రీరాములు మాజీ ఎంపీటీసీ లు మాజీ సర్పంచ్ లు నివాళ్లు అర్పించారు.

# రైతుల పక్షాన మిల్లర్లు బాధ్యత తీసుకోవాలి

- వాహనాల నుండి త్వరితగతిన ధాన్యం దిగుమతి చేయాలి
- జిల్లా ఎస్పీ నరసింహా

**సూర్యాపేట, మే 16 (మనం ప్రతినిధి):** మిల్లులో వరి ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని ఎస్పి నరసింహా మిల్లర్లను కోరారు. సూర్యాపేట రూరల్ పరిధి జనగామ రోడ్డు లో ఉన్న వజ్ర రైస్ మిల్ నందు వరి ధాన్యం దిగుమతులను శనివారం ఎస్పీ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పంట దిగుమతి బాగా వచ్చింది, రైతులు అకాల వర్షాల వల్ల నష్టపోకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వరి ధాన్యాన్ని వాహనాల నుండి త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమానులకు సూచించారు, రైతుల పక్షాన బాధ్యత తీసుకుని వారికి అండగా నిలవాలని కోరారు. మిల్లు యజమానులతో, మిల్లులో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి ధాన్యం దిగుమతి వివరాలు తెలుసుకున్నారు. వరి ధాన్యాన్ని తరలించడానికి లారీ యజమానులు డ్రైవర్లు సహకరించాలని పండిన పంట వర్షంలో తడవకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని అవసరమైన తార్పాలీన్లు పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం నుండి ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపాలని సూచించారు. ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ ఎస్సై బాలు నాయక్ మిల్లు నిర్వాహకులున్నారు.




# ఎన్యూమరేట్‌లకు సహకరించాలి



**సూర్యాపేట టౌన్, మే 16, మనం న్యూస్:** పట్టణంలో జరిగే జనగణన కార్యక్రమానికి వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించి, తమ వివరాలు తెలియజేయాలని సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డు లలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... పట్టణంలో జన గణనకు సుమారు 267 మంది ఎన్యూమరేటర్లు, 43 మంది సూపర్వైజర్లు, విధులు నిర్వహిస్తున్నారని, వీరు మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులలో ప్రజల వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, సూపర్వైజర్లు సుధీర్ రెడ్డి శ్రీనివాసు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది

- మిల్లర్ల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం
- నకిలీ విత్తనాలు మార్కెట్లో విలయతాండవం
- మధుసూదన్ రెడ్డి



**కోదాడ, మే 16(మనం న్యూస్) :** ఎన్నికల సమయంలో ఎలాంటి శరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని అల్వాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకైనా రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో చేశారా అని ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్లో ఇచ్చిన హామీలపై ఎక్కడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. రుణమాఫీ కాకపోవడం వల్ల బ్యాంకుల అప్పులు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త రుణాలు రాక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని కూడా ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. రైతులు పండించిన చివర గింజ వరకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంతో మిల్లర్లు, అధికారులు కలిసి కుమ్మక్కయి రైతులను నట్టేట ముంచారన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని, రాబోయే వానాకాలం సీజన్ నుండి నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా నకిలీ విత్తనాలు మార్కెట్లలో విలయతాండవం చేస్తున్నాయని దాన్ని పట్టించుకునే నాథుడు లేడని తెలిపారు. అలాగే సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అగ్రికల్చర్ ఆఫీసర్లు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. అన్ని రకాల పంటలకు మద్దతు ధర పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మామిడి తోటలను పరిశీలించారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి అశోక్ రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెలివోలు చిట్టిబాబు, సీనియర్ నాయకులు కనగాల వెంకటరామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, కనగాల నారాయణ, యడ్లపల్లి రామారావు, వెంకట నరసయ్య, గోదేశీ లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశనుండే మార్గ నిర్దేశం చూపిస్తే దేశానికి ఆదర్శంగా నిలుస్తారు

## భవిష్యత్తు మార్గాన్ని ఎంచుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి
## కన్నుల పండుగగా వైభవంగా విద్యా వారోత్సవాలు
## విద్యా వారోత్సవాల సందర్భంగా మెరిసిన విద్యార్థుల ప్రతిభ
## గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభ ఉంది
## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన కలెక్టర్....



**ఉమ్మడి మహబూబ్ నగర్ మే 16 (మనం బ్యూరో):** విద్యార్థులు భవిష్యత్ మార్గన్ని ఎంచుకొని ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే నేర్చుకోవడం సరిపోదని, జీవితంలో విజయవంతం కావాలంటే ఇతర రంగాల్లో కూడా చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, వేదికపై మాట్లాడే ధైర్యం, కళాత్మక ప్రతిభను పెంపొందిస్తాయని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నాగర్కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్వాగత నృత్యాలు, జానపద కళారూపాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలను ప్రదర్శించి అతిథులను అలరించారు. విద్యార్థులు రూపొందించిన టిఎల్ఎం ను తిలకించి, విద్యార్థుల ప్రతిభను చూసి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి విద్యా వారోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. భవిష్యత్ సమాజ నిర్మాణంలో విద్యార్థులే ప్రధాన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. అందుకే వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్రూమ్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని ఉన్నత లక్ష్యాల దిశగా నడిపించాలని సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు నైతిక విలువలు కూడా ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేస్తే తప్పకుండా విజయం సాధించగలడని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నారన్నారు. వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తే దేశానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, సైన్స్ ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, వెంకటయ్య, మురళీధర్ రెడ్డి, శోభారాణి, షర్ఫుద్దీన్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి నాగేశ్వర్ రావు, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర అధికారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేకే కమిటీ కి రాష్ట్ర ప్రభుత్వం చట్ట బద్దత కల్పించాలి



**సూర్యాపేట, మే 16 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న, అనారోగ్యలకు గురి అవుతున్న ఉద్యమకారులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ 2019 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తుంది అని తెలంగాణ ఉద్యమాల ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ అనంతుల మధు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్బంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అనేక ఉద్యమ పోరాట రూపాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అని, తొలి, మలి దశ ఉద్యమకారుల గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ నియమించటాన్ని స్వాగతీస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా కేకే కమిటీ కి చట్ట బద్దత కల్పించాలని కోరారు.ఇప్పటికే తొలి తరం ఉద్యమ కారులు కనీస గుర్తింపు, గౌరవం నోచుకోక 'పండుటాకుల' వలే రోజు కొక్కరు నేలరాలిపోతున్నారని,కొంతమంది మలి దశ ఉద్యమకారులు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యల పాలు అయి ఇబ్బందులు ఎదుర్కొంటూన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కమిటీ కాలయాపన చేయకుండా, కుంటి సాకులు చూపకుండా ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి, ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు అయ్యేలా చొరవ చూపాలని అదేవిధంగా ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్ నగర్ మే 16 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు జరుగుతున్న ధాన్యం నాణ్యత, తూకాల విధానం, రికార్డుల నిర్వహణ, నిల్వ సదుపాయాలు, హమాలి, రవాణా ఏర్పాట్లపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించడం జరిగింది. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. హమాలి కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా త్వరితగతిన ధాన్యం స్వీకరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా తూకాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితత్వంతో వ్యవహరించాలన్నారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా ధాన్యం కొనుగోలు పూర్తైన వెంటనే సంబంధిత ప్రక్రియలు పూర్తి చేసి వారి బ్యాంకు ఖాతాల్లో త్వరితగతిన డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు, విశ్రాంతి ఏర్పాట్లు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ధాన్యం నిల్వ విషయంలో నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రవాణా ప్రక్రియ వేగవంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, సంబంధిత శాఖల అధికారులు, ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం

- డయాలసిస్ కేంద్రానికి నేటి నుంచి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుంది
- ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఉమ్మడి మహబూబ్ నగర్ మే 16 (మనం బ్యూరో):** పేద, మధ్యతరగతి ప్రజలు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం పకట్బంది చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ, ఆసుపత్రికి నేటి నుంచే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఆధునిక వైద్య సేవలు, పరీక్షలు, నాణ్యమైన మందులు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిలో త్వరలోనే పూర్తిస్థాయి సేవలను మరింత విస్తృతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయం కారణంగా డయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక విద్యుత్ లైన్ను ఏర్పాటు చేయించినట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. నేటి నుంచి ఎలాంటి విద్యుత్ అంతరాయంకు బ్రేక్ లేకుండా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీనివల్ల రోగులకు సకాలంలో, సురక్షితంగా వైద్యం అందుతుందన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీల ఏర్పాటుతో పాటు రోగుల కోసం ప్రత్యేకంగా మరో అంబులెన్సు కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. గత 2018 సంవత్సరంలో రూ.22 కోట్ల వ్యయంతో మంజూరైన 100 పడకల నూతన ఆసుపత్రి భవన పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నట్లు జూపల్లి తెలిపారు. పెండింగ్లో ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి వద్ద రూ.5 లక్షల వ్యయంతో నూతన బస్ షెల్టర్ నిర్మిస్తున్నామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రిని నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు అండగా ఉండాలని మంత్రి సూచించారు.

## జీవో 679 జారీపై హర్షం

మహాదేవపూర్ మే 16 (మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముఖ్యమంత్రి మరియు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు ఇతర మంత్రులు మరియు ఎం ఎల్ సి లు, ఉద్యమకారులను గుర్తించి 679 జీవో జారీ చేయడంపై తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ప్రతినిధి ఎండి అయివుద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రోజు అయుద్దిన్ ఒక ప్రకటన జారీ చేస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్రను గౌరవించిన ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ప్రభుత్వం,జి ఓ 679 జారీ చేసి ఉద్యమకారులకు, గుర్తించి పలు అభివృద్ధి ఫలాలను ఉద్యమకారులకు అందించే దిశగా అడుగులు వేయడాన్ని హర్షిస్తూ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగుల ఫోరం ఎన్నటికీ మర్చిపోదని, ప్రభుత్వానికి అలాగే ప్రభుత్వంలోని క్యాబినెట్ మంత్రులకు, ఉద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులకు అలాగే జిల్లాల అధ్యక్షులకు సైతం ఐవుద్దీన్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## పశువుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలి



ములుగు, మే 16, మనం ప్రతినిధిః ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ మల్లంపల్లి మరియు పస్ర వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్ పోస్ట్ లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ములుగు జిల్లా నుండి ఎట్టి పరిస్థితుల్లో పశువుల అక్రమ రవాణా జరగకూడదని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెక్ పోస్ట్ లలో విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్ట్ ల వారీగా విధులు నిర్వహించాలని, ఎవరు కూడా విధులలో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. పశువుల రవాణా చేసే వ్యక్తుల వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదా నిశితంగా తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీ చేసిన వాహనాలు వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. చెక్పోస్ట్ విధుల్లో ఉన్న సిబ్బందికి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారుల ను ఆదేశించారు. ఈ తనిఖీలలో తెలుగు డిఎస్పి రవీందర్ ఎస్పి ఇన్స్పెక్టర్ శంకర్, పస్ర సీఐ దయాకర్, ములుగు సీఐ సురేష్ మరియు ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఉపేందర్, పస్ర పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ తాజుద్దీన్ లు పాల్గొన్నారు.

## పుట్ట మధుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యాదవ సంఘం



మల్హర్, మే 16 (మనం న్యూస్)ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్రావు మండలం.రుద్రారం గ్రామంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం కార్యక్రమం నిర్వహించి చీకటి పాలనకు చరమగీతం పలికిన రోజే జననేత మదన్న జన్మదినం మంథని మట్టి తల్లి ముద్దాడిన బిడ్డ బడుగుల ఆశాజ్యోతి దమ్మున్న లీడర్ మంథని మాజీ శాసన సభ్యులు పుట్ట మధుకర్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మరియు శాలువాతో సన్మానం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మాజీ జడ్పిటి సి గోనే శ్రీనివాసరావు మంథని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని రాజన్న యాదవ్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పంచిక మల్లేష్ యాదవ్ ముదిరాజ్ సంఘం నాయకులు అక్కిన బోయిన సమ్మయ్య కొడారి మల్లేష్ యాదవ్ తొట్ల రమేష్ యాదవ్ పంచిక హరీష్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



ములుగు, మే 16, మనం ప్రతినిధిః మల్లంపల్లి మండల కేంద్రంలో ని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, మరియు పస్ర లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల యొక్క సమస్యలు, వారు పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు తమకు వాహనాల కొరత ఉందని, వాటిని ఏర్పాటు చేయాలని విన్నవించగా వెంటనే సానుకూలంగా స్పందించిన ఎస్పీ గారు, లారీ అసోసియేషన్ వారితో మాట్లాడి తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల యొక్క ధాన్యం గింజలు, మొక్కజొన్నలు అన్నీ కూడా రవాణా అయ్యేంతవరకు ములుగు పోలీస్ రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భనలో ములుగు డిఎస్పి రవీందర్, ఎస్పి ఇన్స్పెక్టర్ శంకర్, ములుగు సిఐ సురేష్, పస్ర సీఐ దయాకర్, ములుగు ఎస్త్స ఉపేందర్, పస్ర ఎస్త్స తాజుద్దీన్ పాల్గొన్నారు.



## నేల ఆరోగ్యాన్ని కాపాడితే అధిక దిగుబడి

- వ్యవసాయశాస్త్రవేత్తలు

భీమదేవరపల్లి, మే 16 మనం న్యూస్ః నేల ఆరోగ్యాన్ని కాపాడితే అధిక దిగుబడి పొందవచ్చు వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. శనివారం రోజు న ముల్కనూర్ రైతు వేదిక రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ డాక్టర్ సౌజన్య హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు యూరియా అధిక విధి యుగం వల్ల కలిగే నష్టాలను అలాగే సుస్థిర ఆదాయం కూర్చునే మార్గాన్ని వివరించారు. పంట వ్యర్థం లను కాల్చకుండా భూమి ఆరోగ్యాన్ని కాపాడి కలియదున్ని రసాయనిరుల వాడకం తగ్గించుకోవలసినదిగా శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులకు ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు గురించి మండల వ్యవసాయ అధికారి పద్మ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం సి ఆర్ సి జనరల్ మేనేజర్ రామ్ రెడ్డి సెరికల్చర్ ఆఫీసర్ సంజీవరెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి కమలహాసన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సుమంత్ రాజేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద అధికార పార్టీ పెత్తనం



- బార్ధాన్లు అన్నీ అధికార పార్టీ వ్యక్తులకె
- చిన్న రైతులకు బస్తాకు పది రూపాయల రవాణా చార్జీ లేదంటే నో
- సాధారణ రైతులకు గండంగా మారిన సూరారం కొనుగోలు కేంద్రం
- మంత్రి మరియు జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలి



మహాదేవపూర్ మే 16 (మనం న్యూస్)ః సూరారం వడ్ల కొనుగోలు కేంద్రం కేవలం అధికార పార్టీ కు సంబంధించిన రైతులకు అలాగే వారి సన్నిహితులకు మాత్రమే, వార్ధాన్లు అందించడం లేదా వారి ధాన్య బస్తాలను రవాణా చేయడం జరుగుతుందే తప్ప, పార్టీలకు సంబంధం లేని చిన్న సన్నకార రైతులకు మాత్రం సూరారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబడే వడ్ల కొనుగోలు కేంద్రం శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పేద రైతులు. శనివారం రోజు కొనుగోలు కేంద్రం వద్ద పెద్ద మొత్తంలో చిన్న రైతులు చేరి తమకు బార్ధాలు ఇవ్వకపోవడం తమ ధాన్యాన్ని రవాణా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, అనంతరం గత 20 రోజులుగా చిన్న పేద రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ పత్రిక ప్రకటన జారీ చేశారు కొందరు రైతులు. నలుగురు వ్యక్తులు కలిసి సూరారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించుటకు అధికార పార్టీ నుండి ఒప్పందం చేసుకొని 20 రోజులుగా, అధికార పార్టీ వ్యక్తులతో పాటు వారి బంధువులకు అలాగే, వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు బార్ధాన్లు అందించడం జరిగిందని. ఇప్పటికీ 37వేల చిల్లర వార్ధాలు వచ్చినప్పటికీ, పేద రైతులకు ఇవ్వకుండా వారి దగ్గరికి ఇవ్వడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు. అలాగే శుక్రవారం రోజు ధాన్యం రవాణా కొరకు రెండు లారీలను పంపించి, పేద రైతుల ధాన్యం రవాణా కొరకు బస్తాకు పది రూపాయలు ఇస్తేనే రవాణా చేస్తామని, లేదంటే మీ ధాన్యం ఇక్కడే ఉంటుందని, అనడంతో ఆగ్రహించిన రైతులు, ప్రభుత్వం ట్రాన్స్పోర్ట్ వెసులుబాటు కల్పించినప్పటికీ బస్తాకు పది రూపాయల చొప్పున రైతుల నుండి వసూలు చేయడం ఎక్కడి వరకు సమంజసం అని ప్రశ్నించి నిరాకరించడంతో పేద రైతుల ధాన్యాన్ని తీసుకు వెళ్లకుండా లారీలను పంపించడం జరిగిందని ఆగ్రహించారు రైతులు. సూరారం పరిధిలోని చిన్న పేద సన్నకార రైతుల కు అధికార పార్టీ పేరుతో, ఇబ్బందులకు గురిచేసి, ధాన్యాన్ని రవాణా చేయకుండా అలాగే బార్ధాన్లు అందించకుండా, వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో పేద రైతు కుటుంబాలు రోడ్డున పడేసేలా, చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు జిల్లా కలెక్టర్, తక్షణమే స్పందించి నిర్వాహకులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు రైతులు. సుమారు 20 కి పైచిలుకు రైతులు కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

## వీరభద్రుని సన్నిధిలో శని జయంతి



భీమదేవరపల్లి, మే 16 మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన వీరభద్ర దేవస్థానంలో శని జయంతి అర్చకులు ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున శని అమావాస్య జయంతి సందర్భంగా అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చండీ హోమం అర్చకులు నిర్వహించి అనంతరం అన్నదాన ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భక్తులు గ్రామ ప్రజలు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల సందర్భంగా వ్యాస రచన పోటీలు



మహాదేవపూర్, మే 16(మనం న్యూస్)ః మహాదేవపూర్ మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు విద్యా వారోత్సవాల ఆరవ రోజు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మాధవి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు క్విజ్ కాంపిటీషన్ ఏర్పాటు చేయడం జరిగినది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ బహుమతులు ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడి ఇష్టంతో చదువు మీద శ్రద్ధ పెట్టినట్లయితే విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొనడం జరిగినది ఈకార్యక్రమంలోవిద్యార్థినివిద్యార్థులు అధ్యాపక బృందం మరియు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి కొత్త మోటారును ఏర్పాటు చేయించిన సర్పంచ్



మహాదేవపూర్ మే16మనం న్యూస్ః మహాదేవపూర్ మండల కేంద్రంలోని 12వవార్డు సంబంధించినవేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటికి ఇబ్బందులు పడకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో మంచినీటికి సంబంధించిన కొత్త మోటర్ ను పెట్టించడం జరిగింది దీంతో 12వ వాడు కాలనీ వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి ఈరోజు మేము నమ్మికొని ఎన్నికలలో గెలిపించుకున్నటువంటి మానాయకురాలు హసీనాబాను అక్బర్ ఖాన్ మరియు 12వ వార్డు సభ్యులు ఆధ్వర్యంలో మోటర్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అనికాలనీవాసులు చాలా సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ మరియు వార్డు సభ్యులు పూసల హరీష్ గడ్డం స్వామి కొండపల్లి రాములు చీర్లవంచ చంద్రశేఖర్ మహమ్మద్ బిన్ అలీ నల్ల బుగసమ్మయ్య పడాల మొగిలి గ్రామపంచాయతీ సిబ్బంది మరియు ప్రజలు గ్రామ పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

## ధర్మని పార్థివదేహానికి నివాళ్లర్పించిన ముఖ్య నాయకులు



హనుమకొండ, మే 16 (మనం న్యూస్)ః మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ వదిన ధర్మని అకల మరణం పొందినందున ప్రార్థిక దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ఎల్ హెచ్ పి ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్భానోత్ సునీల్ నాయక్ యొక్క చిన్నమ్మ అకాల మరణానికి అటెండ్ అయి నివాళులు అర్పించి వారి కుటుంబీలకు మనోధైర్యాన్ని ఇచ్చిన సునీల్ నాయక్ మనోజ్ లాల్, కూతురు రాధా, మరియు కొడుకులు ప్రవీణ్ మరియు సంతోష్ మొదలైన వారు పాల్గొన్నారు.

## కాంగెస్‌లో చేరికలు



వరంగల్, మే 16(మనం న్యూస్)ః సెంగెం మండలం పెద్ద తండా గ్రామంలో మన ప్రియతమా నాయకులు ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డి మరియు మండల్ సమన్వయ కమిటీ సభ్యులు ఆదేశాలమేరకు డిసిసి ఎస్టీ సెల్ చైర్మన్ , సర్పంచ్, ఉప సర్పంచ్ గుగులోత్ వినోదరవీందర్ నాయక్ ఆధ్వర్యంలో గుగులోతు రవి, కేవుల గుగులోతు రవి, రాములు తదితరులు బిజెపి / బీ ఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, శ్రీకాంత్, నితీష్, రాకేష్, అనిల్, బిక్షపతి, చక్రు, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను గుర్తించి కమిటీ వేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మల్హర్, మే 16(మనం. న్యూస్)ః ఉద్యమకారులను గుర్తించి కమిటీ వేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు భూపాల్ పల్లి జిల్లా జాతీయ బీసీ సంఘం ఇన్చార్జి విజయగిరి సమ్మయ్య తెలిపారు. మల్హర్ మండలం కోయ్యూరు ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రావడానికి అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను ఉద్యమంచేసి జైలుకెళ్ళిన కేసులైన వారిని తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సకల జన సమ్మెలో పాల్గొని అన్ని వర్గాలకుల వృత్తుల వారు సబ్బండ వర్ణాల ప్రజలు ఎలక్ట్రానిక్ అండ్ ప్రింటు మీడియా జర్నలిస్టు లు ప్రజా సంఘాలు కుల సంఘాలు పాల్గొన్నట్లు గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నఉద్యమకారులను ప్రజా కుల సంఘాల జర్నలిస్టులు నాయకులందరినీ గుర్తించాలని కమిటీకీ ప్రభుత్వాన్ని కోరారు.

## పోరాటాలతోనే హక్కుల సాధన

- బిజెపివి అవకాశవాద రాజకీయాలు
- ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి
- ఉత్సాహపూరిత వాతావరణంలో మహిళా సమాఖ్య జిల్లా మహాసభలు




వైరా, మే 16 (మనం న్యూస్): మహిళా పోరాటాలతోనే హక్కులు సాధించబడ్డాయని ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఎందరో సంఘ సంస్కర్తలు, అమరుల పోరాటాల ఫలితంగా ఆస్తి, విద్య, సమానత్వపు హక్కు సహా పలు హక్కులను సాధించామని ప్రస్తుత పాలకులు ఆ హక్కులను నీరు గారుస్తూ మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 22వ మహాసభలు శనివారం వైరాలోని తుల్లూరు తులశమ్మ నగర్ (కమ్మ వారి కళ్యాణ మండపం) లో జరిగాయి. పోటు కళావతి, దండి శ్రీజ, సిహెచ్ సీతామహాలక్ష్మి, బేబీ రాణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన నెదునూరి జ్యోతి మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా మహిళల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని ప్రగతిశీల మార్పుల దిశగా మహిళా సమాఖ్య పని చేస్తుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్ట సభల్లో కల్పించేందుకు బిల్లు ప్రవేశ పెట్టడం వెనక బిజెపి అవకాశవాద రాజకీయం దాగి ఉందన్నారు. ప్రస్తుత పార్లమెంటు సభ్యులకు అనుగుణంగానే బిల్లును ప్రవేశపెట్టవచ్చు కానీ బిజెపి ఆ దిశగా ఆలోచించకుండా డిలిమిటేషన్తో ముడిపెట్టిందని ఆమె తెలిపారు. కేవలం విపక్షాలను విమర్శించడం కోసం మాత్రమే బిల్లును ప్రవేశ పెట్టారు తప్ప బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదన్నారు. దేశంలో మహిళలపై బిజెపి పాలనలో దాడులు పెరుగుతున్నాయని బిజెపి పాలిత రాష్ట్రాల్లో కనీస న్యాయం గురించి ప్రశ్నించడం నేరంగా పరిగణిస్తున్నారని ఆమె తెలిపారు. మనుధర్మ శాస్త్రాన్ని ప్రబోధించడం ద్వారా బిజెపి ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని ఆమె తెలిపారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు శ్రామిక మహిళలకు శాపంగా మారాయని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు బతకలేని స్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుని పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని సత్వరం బండి భగీరథను అరెస్టు చేసి తగు రీతిలో శిక్షించాలని జ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తులం బంగారం, నెలకు రూ.2,500 ఖాతాల్లో జమ, విద్యార్థులకు స్కూటీలు సహా అన్ని హామీలను నెరవేర్చాలన్నారు. సమాన పనికి సమాన వేతనం లభించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**మహిళా చైతన్యంతోనే సమాజ మార్పు : చంద్రకళ**

మహిళా చైతన్యంతోనే సమాజంలో మార్పు వస్తుందని మహిళల స్థితిగతులను బట్టి సమాజాభివృద్ధిపై అంచనా వేయవచ్చునని వైరా మున్సిపల్ ఛైర్పర్సన్ కాపా చంద్రకళ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అట్టడుగు వర్గాలకు చేరడం లేదని అవి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు మహిళా సమాఖ్య పోరాటాలు దోహదపడాలని ఆమె కోరారు. నాయకత్వ లేమి కూడా మహిళలకు శాపంగా మారుతుందని అత్యుత్తమ నాయకత్వం తయారు కావాలని ఆమె ఆకాంక్షించారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల కూడా చైతన్యం అవసరమని జబ్బులకు భయపడితే ప్రాణాలకే ప్రమాదమని మారిన ఆధునీక యుగంలో ప్రతి వ్యాధికి చికిత్స ఉందని దానిని త్వరితగతిన పొందడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని డాక్టర్ కాపా చంద్రకళ సూచించారు. మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేంద్రరెడ్డి సందేశాలు ఇచ్చారు. బలమైన మహిళా ఉద్యమాలే ప్రజా చైతన్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని వారు తెలిపారు. గ్రామ స్థాయి నుండి మహిళా ఉద్యమాన్ని నిర్మించడమే మహిళల పట్ల జరుగుతున్న వివక్ష, దాడులకు పరిష్కారమని వారు సూచించారు. ప్రతి ఘటనపైన మహిళలు స్పందించే తత్వాన్ని అలవర్చు కోవాలని వారు సూచించారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్, మహిళా సమాఖ్య నాయకురాలు ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, బత్తినేని నీరజ, నల్లమోతు శైలజ, మందడపు రాణి, కర్నాటి నళిని, ఏపూరి పద్మ, కారం కోటమ్మ, మేళ్లచెరువు లలిత, జమ్ముల లక్ష్మి, రంజాన్బీ తదితరులు పాల్గొన్నారు. మహాసభ ప్రారంభసూచికంగా మహిళా సమాఖ్య పతాకాన్ని బత్తినేని నీరజ ఆవిష్కరించారు. మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల సంతాప సందేశాన్ని ప్రవేశపెట్టగా కార్యదర్శి నివేదికను ఏపూరి లతాదేవి ప్రవేశపెట్టారు. ఆహ్వాన సంఘ అధ్యక్షురాలు నల్లమోతు శైలజ అధ్యక్ష ఉపన్యాసం చేశారు.





## థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్‌కు
# సాత్విక్-చిరాగ్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-500 టోర్నీలో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ అదరగొట్టేస్తోంది. సెమీస్ లో మలేషియా జోడీపై 19-21, 22-20, 21-16 తేడాతో సాత్విక్-చిరాగ్ విజయం సాధించి ఫైనల్ కు దూసుకెళ్లారు. ఈ సీజన్ లో ఇదే తొలి ఫైనల్ కావడం గమనార్హం. తొలి సెట్ ను మలేషియా ఆటగాళ్లు గో జెఫీ - నూర్ ఇజ్జుద్దీన్ 21-19 తేడాతో సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జోడీ రెండో సెట్ ను 22-20తో కైవసం చేసుకుంది. మ్యాచ్ ను తేల్చే మూడో సెట్ లో విజయం కోసం ఇరు జట్లూ తీవ్రంగా శ్రమించాయి. అయితే, భారత జోడీ దూకుడు ప్రదర్శించి 21-16తో సెట్ ను.. అలాగే మ్యాచ్ ను గెలుచుకుంది. ఇటీవలే సాత్విక్ - చిరాగ్ జోడీ థామస్ కప్ లో పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తమను ఎవరూ పట్టించుకోలేదని ఇటీవల సాత్విక్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇప్పుడు మరోసారి థాయ్లాండ్ ఓపెన్ లో అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు.

# సన్ రైజర్స్ అభిమానులకు భారీ షాక్



ఐపీఎల్-2026లో మే 22న ఉప్పల్ మైదానం వేదికగా జరగనున్న సన్ రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ కు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ సీజన్ లో హైదరాబాద్ లో ఇదే చివరి లీగ్ మ్యాచ్ కావడం, దానికి తోడు కింగ్ విరాట్ కోహ్లి బరిలోకి దిగనుండడంతో ఫ్యాన్స్ ఎగబడుతున్నారు.

దీనిని క్యాష్ చేసుకునేందుకు ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం టికెట్ ధరలను ఏకంగా 50% నుండి 110% వరకు పెంచేసింది. ధరలు భారీగా పెరిగినప్పటికీ బుకింగ్స్ ఓపెన్ అయిన కొద్ది నిమిషాల్లోనే టికెట్లన్నీ అమ్ముడైపోయాయి. సన్ రైజర్స్ యాజమాన్యం ఈ మ్యాచ్ కు కనిష్ట టికెట్ ధరను రూ.1,950గా.. గరిష్ట ధరను ఏకంగా రూ.45,000గా నిర్ణయించింది.

సౌత్ రెండో అంతస్తులోని కార్పొరేట్ బాక్స్ టికెట్ ధర రూ.45,000 పలకడం విశేషం. గతంలో ఈ టికెట్ ధర రూ. 30,000గా ఉండేది. అలాగే వెస్ట్ రెండో అంతస్తు కార్పొరేట్ బాక్స్ ధర రూ.30,000గా, ఆరెంజ్ ఆర్మీ ఈస్ట్, వెస్ట్ లాంజ్ ల ధరను రూ.20,000గా నిర్ణయించారు.

ఇక టికెట్లు దొరకని అభిమానుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని సోషల్ మీడియా వేల రూపాయలకు టికెట్లను బ్లాక్ లో అమ్ముతున్నారు. దీనిపై హైదరాబాద్ పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకుంటున్నారు. బ్లాక్ టికెట్ దందా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాగా ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆర్సీబీ మరో విజయం సాధిస్తే అధికారికంగా ప్లే ఆఫ్స్కు అర్హత సాధిస్తోంది. మరోవైపు ఎస్ఆర్ హెచ్ గత మ్యాచ్ లో గుజరాత్ చేతిలో ఓడిపోయి గట్టి షాక్ తింది.ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్ వాళ్లకు చావో రేవో లాంటిది.

## టీ20ల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టి..
## పాక్ కెప్టెన్ ప్రపంచ రికార్డు



పాకిస్తాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనా టీ20 క్రికెట్ లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. నిన్న (మే 15) జింబాబ్వేతో జరిగిన మ్యాచ్ లో 15 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ఆమె.. అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్ లో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ నమోదు చేసిన ప్లేయర్ గా రికార్డుల్లోకెక్కింది.

గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్కు చెందిన సోఫీ డివైన్, ఆస్ట్రేలియాకు చెందిన ఫోబ్ లిచ్ ఫీల్డ్, భారత్ కు చెందిన రిచా ఘోష్ పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ ముగ్గురు 18 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు. తాజాగా ఫాతిమా సనా వీరి రికార్డును బద్దలు కొట్టి సింగిల్ గా ప్రపంచ రికార్డు సెట్ చేసింది.

# అందుకే బ్యాటింగ్‌కు రాలేదు: పంత్



హ్యాట్రిక్ ఓటముల తర్వాత లఖ్ నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్పై188 పరుగుల టార్గెట్ ను కేవలం 16.4 ఓవర్లలోనే ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మిచెల్ మార్ష్ (90) అద్భుతంగా ఆడాడు. అతడితోపాటు నికోలస్ పూరన్ (32₹: 17 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్స్ లు) దంచేశాడు. అనూహ్యంగా కెప్టెన్ రిషభ్ పంత్ బ్యాటింగ్కు దిగలేదు. ఫీల్డింగ్ సమయంలో క్యాచ్ కోసం డైవ్ చేస్తూ ఇబ్బంది పడ్డాడు. గాయం కారణంగా ఏమైనా బ్యాటింగ్ కు రాలేదా? అనే అనుమానాలు వచ్చాయి. కానీ, డగౌట్ లో ప్యాడ్లతో పంత్ రెడీగానే ఉన్నాడు. మ్యాచ్ అనంతరం పంత్ స్పందిస్తూ.. ఎక్కువగా అవకాశాలు రానివారిని పంపించినట్లు తెలిపాడు. మేనేజ్ మెంట్ తో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ''చూడండి.. నేను డగౌట్ లో ప్యాడ్లతో రెడీగానే ఉన్నా. డ్రెస్సింగ్ రూమ్ లో మేమంతా చర్చించుకున్నాం. ఎక్కువ అవకాశాలు రానివారిని ఎందుకు పంపించకూడదని మాట్లాడుకున్నాం. అదే మా ఐడియా. దాని గురించి చాలా తీవ్రంగా ఆలోచించా. క్రీజ్ లో నేను లేకపోతే ఎలా అని అనుకున్నా.

కానీ, కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వడం కూడా చాలా ముఖ్యం. మేనేజ్ మెంట్ ఆలోచనలకూ గౌరవం ఇవ్వాలి. టాప్ ఆర్డర్ లో విదేశీ క్రికెటర్లను వినియోగించుకోవాలనేది మా ఆలోచన. అందుకు తగినట్టుగానే ఆటగాళ్ల ఎంపిక కూడా ఉంది. నికోలస్ పూరన్, మార్ క్రమ్ ఈ సీజన్ లో అంతగా ప్రభావం చూపించలేదు. అయితే, కొన్నిసార్లు ఎంత కష్టపడినా ఫలితం మనం అనుకొనేలా రాదు. కానీ, జట్టుగా వారిపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది'' అని పంత్ వెల్లడించాడు.

# సినిమాలకు దూరంగా హీరో జయం రవి

ప్రముఖ తమిళ నటుడు జయం రవి (రవి మోహన్) తన వ్యక్తిగత జీవితంలో ఎదురవుతున్న ఒడిదుడుకులపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తాను ఎంతో సున్నితమైన మనస్తత్వం ఉన్న వ్యక్తినని, ఎవరైనా ఏదైనా చెబితే అర్థం చేసుకుని,



అవసరమైతే రాజీపడే తత్వం తనదని ఆయన పేర్కొన్నాడు. అయితే, ప్రస్తుతం తన వైవాహిక జీవితంలో నడుస్తున్న విడాకుల ప్రక్రియ పూర్తయ్యే వరకు తాను సినిమాల్లో నటించబోనని స్పష్టం చేస్తూ అభిమానులకు షాక్ ఇచ్చారు.

ఈ నిర్ణయం వెనుక ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం లేదని, దీనికి సినీ పరిశ్రమతో గానీ, ఇతర హీరోలతో గానీ ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశాడు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత విషయమని జయం రవి వివరించాడు. గత 23 ఏళ్లుగా అహర్నిశలు శ్రమిస్తూ, పరిశ్రమకు తన వంతు సహకారాన్ని అందించానని, తాను నటించిన చిత్రాలలో 95 శాతం సినిమాలు ఘనవిజయం సాధించాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నాడు.

ఇంతటి సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎంతో కష్టపడినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు తనను కొంత అవమానానికి గురిచేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. తనను అవమానిస్తున్న వారి ముందు ఈ విషయాలను బహిరంగంగా ప్రస్తావించడంలో ఎలాంటి తప్పు లేదని జయం రవి అన్నాడు. ఆయన తీసుకున్న ఈ తాత్కాలిక విరామ నిర్ణయం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## బిగ్గెస్ట్ డెబ్యూని మిస్ చేసుకున్న ఖుషి కపూర్



ఇప్పుడు మన టాలీవుడ్ నుంచి రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రాల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ చిత్రం పెద్ది కూడా ఒకటి. నిజానికి ఈ వేసవిలో బాక్సాఫీస్ దాహాన్ని తీర్చేది ఈ సినిమానే అని చాలామంది నమ్ముతున్నారు. అయితే ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన మొదటి సారి జాన్వీ కపూర్ జత కట్టింది.

జాన్వికి ఇది తెలుగులో రెండో సినిమా కాగా అసలు ఈ సినిమా జాన్వీ చేయాల్సిన సినిమానే కాదు అని రివీల్ అయ్యింది. దర్శకుడు బుచ్చిబాబు సానా లేటెస్ట్ కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. తాము ముందుగా జాన్వీ కపూర్ చెల్లెలు ఖుషి కపూర్ ని పెద్ది సినిమాలో హీరోయిన్ గా అనుకున్నట్టు అసలు విషయం తెలిపారు.

ఇలా చెల్లెలి కోసం సినిమాలో అనుకుంటే అదే ఇంటి నుంచి ఆమెని రిజెక్ట్ చేసి అక్కని ఫైనల్ చేయాల్సి వచ్చింది అని బుచ్చిబాబు క్రేజీ ట్విస్ట్ రివీల్ చేశారు. మరి జాన్వీ కాకుండా ఖుషి కపూర్ ఈ సినిమాలో చేసి ఉంటే తనకిది బిగ్గెస్ట్ డెబ్యూ అయ్యి ఉండేది అని చెప్పొచ్చు.

## రూ.12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన త్రిష



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.

కమల్ హాసన్ - రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్ పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్ కు చెందిన రెడ్ జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్ లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి.



## వెంకీ మామ, కళ్యాణ్ రామ్ ప్రాజెక్ట్ పై అప్డేట్!

మన టాలీవుడ్ నుంచి రానున్న క్రేజీ మల్టీస్టారర్ చిత్రాల్లో వెంకీ మామ అలాగే నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో తమ దర్శకుడు అనీల్ రావిపూడి కలయికలో చేస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం కూడా ఒకటి. ఈ కాంబినేషన్ అనౌన్స్ చేసినప్పుడే మంచి బజ్ ని సెట్ చేసుకుంది. ఇలా సినిమా షూటింగ్ ఇంకా మొదలు పెట్టుకోవాల్సి ఉండగా ప్రస్తుతం ఓ లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది. దర్శకుడు అనీల్ అండ్ టీం సినిమా తాలూకా స్క్రిప్ట్ ని పూర్తి చేసే పనుల్లో ఉన్నారట. ప్రస్తుతం విశాఖపట్నంలో టీం మకాం వేసి స్క్రిప్ట్ పైనే సీరియస్ గా వర్క్ చేస్తున్నారని తెలుస్తుంది. ఇది పూర్తయ్యాక ఇక సినిమా పట్టాలెక్కడమే బ్యాలన్స్ అట. ఈ గ్యాప్ లో వెంకీ మామ త్రివిక్రమ్ తో చేస్తున్న 'ఆదర్శ కుటుంబం' కూడా పూర్తి చేసుకోనున్నారు. ఇక వెంకీ మామ, కళ్యాణ్ రామ్, అనీల్ ప్రాజెక్ట్ ని సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## 'పెద్ది' ట్రైలర్ డైలాగ్ లీక్ చేసిన చిరంజీవి



ఎంత ఊహించుకున్నా.. దాన్ని మించి 'పెద్ది' ట్రైలర్ ఉంటుందని అంటున్నారు చిరంజీవి. రామ్ చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18న ట్రైలర్ ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే 'పెద్ది' ట్రైలర్ వీక్షించిన చిరు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. అంతేకాదు, ఒక డైలాగ్ ను కూడా లీక్ చేశారు.

''పెద్ది ట్రైలర్ చూశా. వావ్..! 3 నిమిషాలు.. ఫైర్ పవర్ ప్యాక్డ్ ట్రైలర్. చరణ్, బుచ్చి, రెహమాన్.. ఒక్కొక్కరూ తమ బెస్ట్ ఇచ్చారు. కలిసి మాత్రం రఫ్ఫాడించేశారు! ఎంత ఊహించుకున్నా దాన్ని మించి ఉంటుంది ఈ ట్రైలర్. ఎమోషన్.. ఎలివేషన్, మ్యాడ్నెస్, అన్నీ నెక్ట్స్ లెవల్ లో ఉన్నాయి. అన్నట్లు చాలా రోజులైంది మీకు చిరు లీక్స్ ఇచ్చి.. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు... నేను పోరాడాను సారు..'. సారీ బుచ్చి బాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పా..' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 'పెద్ది'ని బుచ్చిబాబు తీర్చిదిద్దారు. పూర్తిగా ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగనుంది. శివ రాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదల చేసిన 'చికిరి' పాట, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.